VISALAANDHRA Phone No. 75301 **** Regd. No. H/VJ47

విశాలాంధ్ర

705210

సంపుటి 27 సంచిక 131 | విజయవాడ 12—9—1977 సోమవారం | 6 పేజీలు 30 పైసలు

విశాలాంధ్ర చందా వివరాలు

	ఏజంట్లుద్వారా	పోస్టుద్వారా
నెల చందా	9–20	9–80
మూడు నెలలు	27–60	29–40
ఆరు నెలలు	55–20	58–80
సంవత్సరం	110–40	117–60

ఈ రేటు అడ్వాన్సుగా చందా చెల్లించినవారికి మాత్రమే వర్తించును.

సున్నపు రాయి నుండి వస్త్రాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11

కొన్నాళ్ళకి మీ వస్త్రాలు పత్తి నుండి కాక సున్నపురాయి నుండి వస్తాయేమో!

కృత్రిమ నూలు వస్త్రాల ఉత్పత్తికి అవసరమయ్యే మౌలిక పదార్థం "యాక్రిలిక్" నిధులు కార్బైడ్ లాయలో పెద్ద ఎత్తున వున్నాయి.

సున్నపురాయి నుండి వస్త్రాలు తయారుచేసే పద్ధతి అమెరికా జపానులలో ఉంది.

అమెరికా సంస్థ ప్రతిపాదనలకు కేంద్రం తిరస్కృతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

కొన్ని షరతులపై 100 శాతం విదేశీ ఈక్విటీ కంపెనీగా భారతదేశంలో తన కార్యకలాపాలను కొనసాగించటానికి అమెరికా బహుళజాతి కంపెనీ ఐ. బి. ఎం (ఇంటర్ నేషనల్ బిజినెస్ మెషిన్స్) చేసిన ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది.

విదేశీ మారక ద్రవ్య నిబంధనల చట్టం క్రింద ప్రతిపాదనలను పరిశీలించేందుకు పై చట్టం ప్రకారం ఏర్పాటుచేయబడిన కమిటీపై ప్రతిపాదనను నిన్న తిరస్కరించింది.

ఐ. బి. ఎం. తన ఈక్విటీ వాటాలను 40 శాతానికి తగ్గించుకొని మిగతా 60 శాతం భారతీయులకు అమ్మివేసినట్లయితే దేశంలో ఆ కంపెనీని తన కార్యక్రమాలను కొనసాగించటానికి అనుమతించాలని కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది.

ఈ క్విటీవాటాల తగ్గింపు విషయంలో ఐ బి. ఎం కు ఎలాంటి రాయితీలు ఇవ్వరాదని ఎలక్ట్రానిక్సు డిపార్టుమెంటు గట్టిగా సిఫారసు చేసిన అనంతరం ఈ నిర్ణయం చేయబడింది. కమిటీ సమావేశానికి ఎలక్ట్రానిక్సు కమిషన్ అధ్యక్షులు శ్రీ ఎం. జి. కె. మీనన్ కూడా హాజరయ్యారు.

ఎలక్ట్రానిక్సు శాఖను నిర్వహిస్తున్న ప్రధాని శ్రీ దేశాయ్ డిపార్టుమెంటు సిఫారసును ఆమోదించారని తెలుస్తున్నది.

జనరల్ రైనా హైద్రాబాద్ రాక

హైదరాబాద్, సెప్టెంబరు 11

భారత సైన్యాధిపతి జనరల్ శ్రీ టి.ఎన్. రైనా నిన్న ఇక్కడికి వచ్చారు. నగరంలో ఆయన రెండు రోజులపాటు వుంటారు.

విమానాశ్రయంలో జనరల్ రైనాకు సైనిక కార్యాలయాల మేజర్ జనరల్ హండా, బ్రిగేడియర్ హెచ్. ఎస్. సాంధూలు, తదితరులు స్వాగతం చెప్పారు.

కొత్త రైలుమార్గాల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వాల సహకారం

రైల్వే బోర్డు అధ్యక్షులు శ్రీ రాజన్ సూచన

హైదరాబాద్, సెప్టెంబర్ 11

కొత్త రైలుమార్గాల నిర్మాణ వ్యయంలో కొంత భాగాన్ని ఆ యా రాష్ట్రప్రభుత్వాలు భరిస్తే నిర్మాణ కార్యక్రమాలు త్వరితంగా పూర్తవుతాయని రైల్వేబోర్డు అధ్యక్షులు శ్రీ కె. యస్. రాజన్ సూచించారు.

బీబీనగర్ - నడికూడి రైలు మార్గ నిర్మాణాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తగినంత ఆర్థిక వనరులతో ముందుకు రావాలని కోరారు. ఈ రైలు మార్గం నిర్మాణం వలన నాగార్జునసాగర్ ఆయకట్టు ప్రాంతానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, ఆ ప్రాజెక్టు నిర్మాణానికి ఇస్తున్న ప్రపంచ బ్యాంకు సహాయంలో కొంత మొత్తాన్ని బీబీనగర్-నడికూడి రైలు మార్గ నిర్మాణానికి ఖర్చు చేస్తే సమంజసంగా వుంటుందన్న అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో నిన్న శ్రీ రాజన్ ప్రసంగించారు.

నగరంలోని మౌలాలి నుండి సనత్‌నగర్ వరకు బైపాస్ రైలు మార్గాన్ని నిర్మించే ప్రతిపాదన వుందని, ఈ విషయంలో సర్వే ప్రారంభించారని ఆయన చెప్పారు. ఈ నిర్మాణ కార్యక్రమాన్ని రైల్వే శాఖ ఒకటే చేపడుతుందా లేక రాష్ట్ర ప్రభుత్వంతో సంయుక్త రంగంలో నిర్వహిస్తుందా అన్న అంశం సర్వే నివేదికపై ఆధారపడి వుంటుందని ఆయన తెలిపారు.

రైల్వే శాఖ ప్రారంభించిన కార్యక్రమాలను పూర్తి చేయడానికి రు. 350 కోట్లు కేటాయించినట్లు శ్రీ రాజన్ తెలిపారు. తక్కువ దూరండిచే ఎక్స్‌ప్రెస్ రైళ్ళలో రెండంతస్తుల బోగీలను త్వరలో ప్రవేశ పెట్టనున్నట్లు ఆయన తెలిపారు.

పాకిస్తాన్ నుండి ఇరాన్ సరిహద్దు వరకు 536 కిలోమీటర్ల దూరం రైలుమార్గం లేదని, ట్రాన్స్‌ఏషియన్ రైల్వే కృషి ఫలితంగా ఈ రైలుమార్గం నిర్మాణానికి ఇరాన్ ప్రభుత్వం ముందుకు వచ్చిందని భారత్ - ఇరాన్‌ల మధ్య వున్న వాణిజ్య సంబంధాలదృష్ట్యా ఈ నూతన రైలుమార్గం నిర్మాణంలో భారత రైల్వే నిర్వహించవలసిన పాత్రను గురించి ఇరాన్ ప్రభుత్వంతో సంప్రదించనున్నట్లు శ్రీ రాజన్ వెల్లడించారు

ప్రారంభంలో రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ. ప్రభాకరరావు స్వాగతం చెప్పారు.

ప్రెస్ క్లబ్ కార్యదర్శి శ్రీ వి. దామోదర స్వామి కృతజ్ఞతలు తెల్పారు

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీ దాసన్ కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రు. 100 కోట్లకు చేరుకోనున్న పొగాకుఎగుమతులు

మద్రాసు, సెప్టెంబరు 11

గత ఆర్థిక సంవత్సరం చివరకు భారత పొగాకు ఎగుమతులు రు. 94 27 కోట్లకు చేరుకున్నాయి.

అంతకుముందు సంవత్సరంలో పొగాకు ఎగుమతులు మొత్తం రు. 93 10 కోట్లు మాత్రమే.

ఈ మొత్తం ఎగుమతులలో ఫ్లూక్యూర్డ్ వర్జీనియా పొగాకు ఎగుమతులు 90 శాతం వున్నాయి.

ఈ ఎగుమతులు ప్రస్తుత ఆర్థిక సంవత్సరాంతానికి రు 100 కోట్లకు చేరుకోగలవని పొగాకు అభివృద్ధి బోర్డు డైరెక్టరు డాక్టర్ డి. జి. జాజంబకర్ చెప్పారు.

రైల్వే రవాణా, ప్రయాణికుల చార్జీల అధ్యయనానికి కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

భారత రైల్వేల రవాణా, ప్రయాణీకుల ఛార్జీల స్వరూపాన్ని అధ్యయనం చేసి, వాటిని క్రమబద్ధం చేయడానికి సిఫార్సులు చేసే నిమిత్తం నిపుణుల కమిటీని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

1977-78 తాత్కాలిక రైల్వేబడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పిస్తూ రైల్వేమంత్రి, శ్రీ మధుదండావతే చేసిన ప్రకటన ప్రకారం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది

నిపుణుల కమిటీ అధ్యక్షులుగా శ్రీ హెచ్. కె. పరంజపేను నియమించారు. శ్రీ కె. టి. మీర్‌చందానీ (ఆర్థిక విషయాలు), ఎ. కె. సహానువత్య (వాణిజ్య విషయాలు) లను సభ్యులుగా నియమించారు. శ్రీ వినోద్‌పాల్‌ను కమిటీ కార్యదర్శిగా నియమించారు.

ఇంటర్ విద్యార్థినుల పీజులు తిరిగి చెల్లింపుకు ఉత్తర్వులు

హైదరాబాదు, సెప్టెంబరు 11

1977-78 విద్యా సంవత్సరం నుండి ఇంటర్ మీడియట్ స్థాయివరకు బాలికలకు ఉచితంగా విద్యను బోధించాలన్న నిర్ణయానికి అనుగుణంగా, ఈ విద్యా సంవత్సరానికి గాను విద్యార్థినులనుండి విద్యాసంస్థలు పీజులు ఇప్పటికే వసూలు చేసినట్లయితే వాటిని తిరిగి చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు చేసింది.

ఇందువల్ల ప్రయివేటు విద్యా సంస్థలకు వచ్చే నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఉత్తర్వులో తెలిపారు.

గార్షియా స్థావరాన్ని అమెరికా వదలిపోదు

అమెరికా రాయబారి గోహీన్ స్పష్టీకరణ

మద్రాసు, సెప్టెంబర్ 11

డీగోగార్షియా స్థావరాన్ని తాము వదులుకునేది లేదని అమెరికా రాయబారి రాబర్ట్ గోహీన్ స్పష్టం చేశారు.

తాము గార్షియాను ఖాళీచేయాలంటే సోమాలియాలో బెర్‌బెరా స్థావరాన్ని సోవియట్ ముందుగా వదిలివెళ్ళాలన్నారు.

హిందూ మహా సముద్రంనుండి వెళ్ళిపోవాలని ఒక దేశాన్ని అడగటం అన్యాయమని నిన్న యిక్కడ పత్రికాగోష్ఠిలో చెప్పారు.

అందరూ గార్షియా గురించే మాట్లాడతారుగాని, బెర్‌బెరా గురించి చెప్పరని యూరప్ నుండి ఆసియా ప్రాంతానికి వెళ్ళేందుకు హిందూమహాసముద్రంలో సోవియట్‌కు స్థావరముంది ఈ ప్రాంతంలో వారి జలాంతర్గాములెన్నో సంచరిస్తున్నాయి అన్నారు.

హిందూమహాసముద్రాన్ని నిస్సైనిక మండలం చేసే విషయమై అమెరికా సోవియట్ చర్చలు సాగుతున్నాయన్నారు.

కోకా కోలాపట్ల భారత వైఖరివల్ల భవిష్యత్‌లో ఇక్కడ అమెరికా పెట్టుబడులకు పెద్ద దెబ్బ ఉండబోదన్నారు. ఏమైనా కోకా కోలా వ్యవహారం తమకు కొంత నిరుత్సాహం కలిగించిందనే మాట నిజమేనన్నారు. ఇక్కడి మల్టీనేషనల్ కార్పొరేషన్లవంటి వాటిలో అమెరికా పెట్టుబడులు గణనీయంగా ఉన్నాయన్నారు,

తారాపూర్ ప్లుటోనియం వ్యవహారంలో తాము జాగ్రత్తతో వ్యవహరిస్తున్నామని తెలిపారు.

యురేనియం పునరుత్పత్తిని తగ్గించాల్సిందిగా భారత్ వెనుక జపాన్, బ్రిటన్ లను కూడా కోరుతున్నామన్నారు, తారాపూర్ ప్రాజెక్టు విషయంలో తాము సత్వరం నిర్ణయం తీసుకొంటామన్నారు

సోవియట్‌తో భారత్ సంబంధాల పట్ల తమకు పెద్దగా ఆందోళన లేదని చెప్పారు. కమ్యూనిజమనే భయాన్ని అమెరికన్లు అధిగమించారనీ, సోషలిస్టు దేశాలతో మంచి సంబంధాల అభివృద్ధికి యత్నిస్తున్నామన్నారు.

భారత్ పాకిస్తాన్‌ల మధ్య పూర్ణంగా సోవియట్‌కు వ్యతిరేకంగా పాకిస్తాన్‌ను వాడే పాత విధానానికి స్వస్తి చెప్పామనీ, దీనివల్ల పరిస్థితిలో మౌలికమైన మార్పువచ్చిందని పేర్కొన్నారు.

శ్రీమొరార్జీ, శ్రీవాజ్‌పాయిల ప్రకటనలపట్ల హర్షం తెలిపారు. ప్రతినిత్య సంబంధాలకు ఇవి దారితీయగలవన్నారు. ఆగ్రహం, పరస్పర నిందారోపణలున్న గత సంబంధాలు తొలగిపోయాయని చెప్పారు.

కొంతకాలం క్రితం మూసివేసిన అమెరికా సాంస్కృతిక కేంద్రాలను తిరిగి భారత్‌లో ప్రారంభించే ఉద్దేశం ముందన్నారు, బెంగుళూరు, హైదరాబాదు, తిరువనంతపురంలలో ఈ కేంద్రాలు పునఃప్రారంభిస్తాము. [illegible] పెట్టాలన్న డిమాండ్ వచ్చింది.

రాష్ట్రపతి శ్రీ సంజీవరెడ్డి వైద్యానికై అమెరికా వెళ్ళడంపై వచ్చిన వివాదంలో తలదూర్చబోనన్నారు.

శ్రీ మొరార్జీపర్యటనవాయిదా పట్ల విచారం

వచ్చే నెలలోగా అమెరికాలో ప్రధాని శ్రీ మొరార్జీ పర్యటించే సూచన లేదు

ఈ వాయిదాపట్ల గోహీన్ విచారం ప్రకటించారు. కార్టర్‌కూ మొరార్జీకి పనివత్తిడి వల్ల ఇలా జరిగిందన్నారు. అమెరికా శీతాకాలాన్ని తట్టుకోలేనని శ్రీమొరార్జీ పర్యటనం వాయిదా వేశారన్నారు.

సహకారబ్యాంక్ సిబ్బందికి తాత్కాలిక సాయం

రాష్ట్ర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి, అఖిలభారత వ్యవసాయ కార్మికసంఘ అధ్యక్షులు శ్రీ యల్లమందా రెడ్డి డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబరు 11

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మె ఉపసంహరణకు పరిష్కారం జరిగే లోగా ఇప్పటికైనా తాత్కాలిక భృతి ప్రకటించవచ్చునని ప్రదేశ్ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ తమ్మారెడ్డి సత్యనారాయణ, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు శ్రీ గుజ్జుల యల్లమందారెడ్డి నేడిక్కడ సూచించారు.

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులకు జీతాలు విపరీతంగా వస్తున్నాయని చెప్తూ ప్రజల్లో ఒకరిపై మరొకరిని ఎగదోసే ఎత్తులతో ప్రజాభిప్రాయాన్ని ప్రక్కదారి పట్టించే యత్నాలు చేసే బదులు ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ఈ దశలోనైనా సరే తాత్కాలిక భృతి ప్రకటించవచ్చునని శ్రీ తమ్మారెడ్డి సూచించారు.

సమ్మె చేస్తున్న ఉద్యోగుల అరెస్టులు, వారిపై దమనకాండను ఆయన ఖండించారు.

ఉద్యోగులకు తమపూర్తి సానుభూతి తోడ్పాటు ఉంటాయన్నారు.

"సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మె 24వ రోజులో ప్రవేశించింది. తమ మొత్తం వేతనాలలో 15 శాతం పెంపుదల కోరుతున్నారు. వివిధ తరగతుల బ్యాంకులతో పోలిస్తే వారికి అతి తక్కువ జీతాలిస్తున్నారు. సబ్ క్లాస్ బ్యాంకులో గుమాస్తా, ప్యూన్, డ్రైవర్ల బేసిక్ వేతనం వరుసగా రు 100 62 72 ఉన్నాయి అందుకే మొత్తం వేతనంలో 15 శాతం పెంచాలన్న డిమాండ్ చాల న్యాయ సమ్మతమైనది. తుది పరిష్కారానికి ముందు తాత్కాలిక భృతి ప్రకటిస్తే సమ్మె ఉప సంహరణకు తాము సిద్ధమేనని ఉద్యోగులు పదే పదే చెప్పారు

తాత్కాలిక భృతి ప్రకటన ద్వారా పరిష్కారం చేయటంపోయి, బేషరతుగా సమ్మె ఉపసంహరించు కోవాలని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు పట్టుబడుతున్నారు. సహకార బ్యాంకు ఉద్యోగులంటే చాల ఎక్కువ జీతాలు పొందేవారని చెప్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించ జూస్తున్నారు. ప్రజల్లో కొంతమందిని మరి కొంతమందిపై ఎగదోసే జిత్తులు వేసే బదులు ముఖ్యమంత్రి ఈ దశలోనైనా తాత్కాలిక సాయం ప్రకటించవచ్చు

ప్రభుత్వం తలపడిన అరెస్టులనూ దమనకాండనూ ఖండిస్తున్నాము. సమ్మె చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులకు పూర్తి సానుభూతి తోడ్పాటు ఇస్తున్నాము.

యల్లమందారెడ్డి

శ్రీ యల్లమందారెడ్డి ప్రకటనలోకూడ తక్షణమే తాత్కాలికసాయం ప్రకటించి, తర్వాత సంప్రదింపుల ద్వారా పరిష్కారం చేసుకోవాలి అని తెలిపారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపట్ల ప్రభుత్వ మొండి వైఖరిని ఖండించారు. ఉద్యోగులను ప్రభుత్వం బెదిరించడం మంచిది కాదన్నారు.

కుల వ్యవస్థ నిర్మూలన ఆవశ్యకత

హోంమంత్రి చరణ్‌సింగ్ ప్రసంగం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

భారత సమాజంనుండి కుల తత్వ దురాచారాన్ని రూపుమాపాల్సిన అవశ్యకతను కేంద్ర హోంమంత్రి శ్రీ చరణ్‌సింగ్ నొక్కి చెప్పారు.

ఈ లక్ష్యసాధనకు తాను చెప్పిన కొన్ని చర్యలను అమలుచేయడానికి కేంద్రంలో అధికారంలో వున్న తనకు అడ్డంకులెదురవుతున్నాయని ఆయన చెప్పారు.

ఆర్య ప్రతినిధిసభ ఏర్పాటు చేసిన ఒక సభలో యిటీవల మాట్లాడుతూ కులవ్యవస్థ హరిజనులను, ఆదివాసులను పట్ల పీడిస్తున్న యితర అవమానాలను నిర్మూలించడం ద్వారా సమాజాన్ని సంస్కరించాల్సిన అవశ్యకత వుందని శ్రీ చరణ్‌సింగ్ చెప్పారు.

దేశ విభజనకూడ కులతత్వ వ్యాప్తికి దోహద పడిందని ఆయన అన్నారు. హరిజనులు, యితర బలహీన వర్గాలవారికి సమాజంలో ఎదురౌతున్న యిబ్బందులపై ఆయన గంటసేపు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఈ విషయమై తాను 1954 లో అప్పటి ప్రధాని నెహ్రూకు జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలను వివరించారు.

ఇథియోపియాపై సోమాలీ యుద్ధప్రకటన?

నైరోబీ, సెప్టెంబరు 11

ఇథియోపియాపై యుద్ధం ప్రకటించే దశకు సోమాలి చేరువవుతుందని రాయిటర్ కథనం

తమ భూభాగంపై ఇథియోపియా విమాన దాడులు చేసిందని సోమాలి ప్రత్యక్షంగా ప్రకటించింది. ఇథియోపియాలోని వేర్పాటువాద గెరిల్లాలకు మొట్టమొదటి సారిగా బాహాటంగా మద్దతు తెలిపింది.

ఒగాడెన్ యుద్ధరంగంలో పోరాటం విస్తరించగా తమభూభాగంపై ఇథియోపియా నిన్న దాడిచేసినపుడు మూడు ఫైటర్ బాంబర్లను కూల్చివేశామని సోమాలి పేర్కొంది. వజాలే పట్నంపై దాడిలో పౌరులు మరణించారు.

తమ గగనతలం ఉల్లంఘించడం జరిగిందని జూన్, ఆగస్టునెలల్లో రెండు పార్లు సోమాలి ప్రకటించినపుడు ఇథియోపియా నిరాకరించింది..

7 వారాలుగా సాగుతున్న పోరాటంలో మూడవసారి పెద్ద ఎత్తున సోమాలీ జరిపిన దాడిని తిప్పికొట్టి ఎదురుదాడి ప్రారంభించామని ఇథియోపియా రేడియో నిన్న తెలిపింది.

ఇంకా సంఘర్షణ సాగుతోంది. సోమాలీ పెద్ద నష్టాలకు గురైంది. వేర్పాటువాద గెరిల్లాలు యుద్ధం చేస్తున్న ఎరిట్రియా ఉత్తరాన అనేకమంది గెరిల్లాలను మట్టిపెట్టి రాజధాని అస్మారా దక్షిణాన ఉన్న పట్నానికి మార్గం సుగమం చేశామని ఇథియోపియా ప్రకటించింది.

పాకిస్తాన్‌తోసహా 7 దేశాలకు 40 కోట్ల డాలర్ల ఆయుధాల అమ్మకం

—అమెరికా రక్షణశాఖ ప్రకటన

వాషింగ్టన్, సెప్టెంబరు 10

పాకిస్తాన్, ఇరాన్, థాయిలాండ్, ఆస్ట్రేలియాలతో సహా ఏడు దేశాలకు 40 కోట్ల డాలర్ల ఆయుధాలు అమ్మాలని తలపెట్టినట్లు అమెరికా రక్షణశాఖ నిన్న ప్రకటించింది.

అన్నిటికంటే పెద్ద అమ్మకం బ్రిటన్‌కు జరుగుతోంది. 24 కోట్ల, 6 లక్షల డాలర్ల హర్పూన్ మిసిలీను మెక్‌డొనెల్-డగ్లస్ ఎయిర్ క్రాఫ్టు కార్పొరేషన్ సరఫరా చేస్తుంది.

పాకిస్తాన్‌కు 28 వేల రౌండ్ల 105 ఎం. ఎం. మందుగుండు అమ్ముతున్నారు. దీని విలువ 1 కోటి 8 లక్షలు,

థాయిలాండ్‌కు 1 కోటి 28 లక్షల విలువగల ఆరు విమానాలు, డాలర్ల స్పేర్ ఇంజన్‌లు రెండు, విడిభాగాలను రాకెవెల్ ఇంటర్నేషనల్ కంపెనీ పంపుతోంది. ఇంకా 95 లక్షల విలువగల 13 హెలికాప్టర్లను బెల్ హెలికాప్టర్ కంపెనీ పంపుతోంది.

ఇరాన్‌లో నౌకాదళ వైమానిక అధికార్లుగా 200 మంది విమానదళ సిబ్బందికి వారికి శిక్షణ ఇస్తారు. ఈ అక్టోబరులో మొదలయ్యే శిక్షణ 1983 ఏప్రిల్‌లో ముగుస్తుంది. దీని ఖర్చు 2 కోట్ల 87 లక్షల డాలర్లు.

స్పెయిన్‌కు 90 లక్షలడాలర్ల మిసిలీలు, వాహనాలు, జాయిర్‌కు 2 కోట్లకు పైగా మందుగుండు పరికరాలు పంపుతున్నారు.

కోనసీమలో పశుగణాభివృద్ధి: రైతాంగానికి ముఖ్యమంత్రి సలహా

అమలాపురం, సెప్టెంబరు 11

కోనసీమలో రైతాంగం బ్యాంకు సౌకర్యాన్ని వినియోగించుకొని కోళ్ళ పెంపకం, పశు సంపదను వృద్ధి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు అన్నారు,

శుక్రవారం ఇక్కడ "సెమన్ బ్యాంకు" (పశువులవీర్య సేకరణ కేంద్రం)కు ఆయన శంకుస్థాపన చేశారు.

పశుపోషణ కోళ్ళ పెంపకంవల్ల ప్రకృతి వైపరీత్యాల కాలంలో రైతులకెంతో మేలు జరుగుతుందన్నారు. కృష్ణా జిల్లాలో గుడ్లవల్లేరు రైతాంగం ఈ సౌకర్యాలను వినియోగించుకొని అదనపు ఆదాయం సంపాయిస్తున్నారన్నారు.

నీటిపారుదల శాఖామంత్రి శ్రీ వళ్ళా వెంకటరావు సభకు అధ్యక్షత వహించారు.

సెమన్ బ్యాంక్ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ నడింపల్లి రాంభద్రరాజు స్వాగతం పలికారు ఈ పథకానికై ఐదు సమితులు, గ్రామ పంచాయితీలు అమలాపురం మునిసిపాలిటీ కోనసీమ ప్రజలు ఇచ్చిన రు. 2 16 400 చెక్కును ముఖ్యమంత్రికి అందజేశారు. దాన్ని పశుపోషణశాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ వి. నారాయణ రావు అందుకున్నారు. పశు వీర్యాన్ని కోనసీమలోని 28 వెటర్నరీ కేంద్రాలకు పంపుతామన్నారు

ముఖ్యమంత్రి రాక సందర్భంగా ఇళ్ళ స్థలాల పట్టాలు, రుణాల పంపిణీని ఆర్ డి. ఓ. శ్రీ టి ఎస్. రెడ్డి ఏర్పాటుచేశారు 3,429 మందిహరిజనులు వెనుకబడినవారికి రు. 22 లక్షల 11 వేల రుణాలు, 464 ఎకరాల ఇళ్ళ స్థలాలు ఇచ్చారు.

అనంతరం రు. 1 లక్ష 70 వేల వ్యయంతో నిర్మించిన కోనసీమ కొబ్బరి సహకారసంఘ భవనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సంఘ అధ్యక్షులు, మంత్రి శ్రీ వళ్ళా సుబ్బారావు స్వాగతం పలికారు.

"కొల్లూరి సుబ్బారావు మెమోరియల్ మిషనరీ హాస్పిటల్" ముఖ్యదాత శ్రీ కొల్లూరి సుబ్బారావు కాంస్య విగ్రహాన్ని ఆస్పత్రి ఆవరణలో ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

కొల్లూరి సుబ్బారావు కుమారుడు శ్రీ కొల్లూరి చిన వెంకటరత్నం ఆస్పత్రి అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతంపలికారు.

రు. 17 లక్షల వ్యయంతో ఏర్పరచిన అమలాపురం రక్షిత నీటిసరఫరా పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు.

దీనికి జీవిత బీమా సంస్థనుండి రు. 10 లక్షల రుణం లభించింది.

అమలాపురం పౌరుల అవసరాలకోసం రెండవ స్టోరేజ్‌ట్యాంక్ నిర్మించాలని దీనికి నిధులు మంజూరు చేయాలని సభకు అధ్యక్షత వహించిన శాసన సభ్యులు శ్రీ కటుపూడి ప్రభాకరరావు విజ్ఞప్తి చేశారు.

పోలీసులకు జయప్రకాశ్ విజ్ఞప్తి

పాట్నా, సెప్టెంబర్ 11

పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని పోలీసు శాఖకు శ్రీ జయప్రకాశ్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

"భారత్‌లో ప్రస్తుతం పోలీసులపాత్ర"పై ఇండియన్ పోలీస్ సర్వీస్ అసోసియేషన్ పాట్నా ఎ. ఎన్. ఎస్. సోషల్ స్టడీస్ ఇన్‌స్టిట్యూట్‌లు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సెమినార్‌ను శ్రీ జయప్రకాశ్ నిన్న యిక్కడ ప్రారంభోత్సవం చేశారు.

ఎంత కష్టాలు వచ్చినప్పటికీ పోలీసులునిగ్రహంతో వ్యవహరిస్తే పోలీసుల ప్రజలమధ్యవున్న అగాధాన్ని తగ్గించవచ్చని జయప్రకాశ్ సూచించారు

ఉద్రిక్త వాతావరణాలలో కూడా మితిమీరిన చర్యలకు పాల్పడకుండా నేర్పుగా పరిస్థితిని అదుపులోకి తేవాలని ఆయన అన్నారు. పోలీసులు ప్రజల మధ్య సంబంధాలను మెరుగు పరచేందుకు కృషిచేయాలన్నారు

బీహార్ ముఖ్యమంత్రి శ్రీ కర్పూరీ ఠాకూర్ అధ్యక్షతవహించారు

మగబిడ్డ గర్భంలో పిండం!

విశాఖపట్నం, సెప్టెంబరు 11

పదకొండు నెలల మగబిడ్డ కడుపు నుండి 4 నెలల పిండాన్ని ఇక్కడ వెలికితీశారు.

కింగ్ జార్జి ప్రభుత్వ ఆస్పత్రిలో నిన్న 3 గంటలపాటు ఆపరేషన్ చేసిన పెడియా ట్రిక్ సర్జన్ డాక్టర్ టి. విశ్వనాథరావు సమాచార విలేకరితో మాట్లాడుతూ: "బిడ్డలో అందునా మగబిడ్డగర్భంలో పూర్తి పిండం ఉండటం అరుదు" అన్నారు. ఈ పిండానికి 4 నెలల వయసున్నట్టుందని చెప్పారు,

ఆపరేషన్ తర్వాత మగబిడ్డ పరిస్థితి బాగా ఉందని తెలిపారు.

ఈ బిడ్డపేరు కృష్ణ, మూడువారాల క్రితం డయేరియావల్ల ఆస్పత్రికితెచ్చారు.

మొదట అది మామూలు వ్రణమనీ, పావుగంటలో ఆపరేషన్ అయిపోతుందనీ అనుకున్నాడు. పరీక్షించగా పిండం వుందని తేలింది. ఇలాంటి ఆపరేషన్ కె. జి. హాస్పటల్‌లో జరగడం యిదే ప్రథమం.

మంచికి పోయి మరణించిన రాంబాబు

విశాఖపట్నం, సెప్టెంబరు 11

మంచికిపోయి మరణం తెచ్చుకున్నారు రాంబాబు

మొన్నరాత్రి ఇక్కడి మధ్యతరగతి నివాస ప్రాంతం కంచెరపాలెంలో హత్య జరిగింది. జనం మూగారు.

వినాయక చవితికి చందాలు వసూలు చేస్తున్న 18 ఏళ్ళ రాంబాబు హత్య అయ్యింది. ఉత్సాహంతో ఇంటి దగ్గరనుండి వెళ్ళాడు.

ప్రక్కనే కొక్కొండ ఓనర వెంకటస్వామి, అతని భార్య తిట్టుకుంటున్నారు. చుట్టూ చేరిన జనమంతా వినోదిస్తున్నారు. పర్ణ తిరప్పుడుకి పోయినప్పుడు భార్యా భర్తల్ని విడదీయడానికి రాంబాబు ముందు కెళ్ళాడు వెంటనే వెంకటస్వామి కత్తితో పొడిచాడు. రాంబాబు ప్రాణాలు విడిచాడు.

వెంకటస్వామిని పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసు నమోదు చేశారు.

వృథాగా పారవేసే సరుకులనుండి బి-12 ఉత్పత్తి

మద్రాసు, సెప్టెంబరు 11

ఉపయోగించనని పారవేసే వస్తువుల నుండి విటమిన్ బి-12 ఉత్పత్తి చేసే క్రమాన్ని స్థానికభారత సాంకేతిక సంస్థ కెమికల్ ఇంజనీరింగ్‌శాఖఅభివృద్ధి పరచింది.

దేశంలో అత్యంత తీవ్ర ఆరోగ్య సమస్యగా పరిణమించిన పాండు వ్యాధి (ఎనీమియా) నివారణకు యీ క్రమం ఎంతగానో తోడ్పడుతుందని ఐ ఐ టి. డైరెక్టరు శ్రీ ఆర్ జి నారాయణమూర్తి ఒక పత్రికా ప్రకటనలో తెలియజేశారు.

19 మాసాల నిర్విరామంగా జరిపిన కృషి ఫలితంగా యీ క్రమం అభివృద్ధి పరచబడిందనీ, యూనివర్సిటీలో నెలకొల్పిన ప్రాయోగిక యంత్రంలో దీనిని విజయవంతంగా పరీక్షించడం జరిగిందని చెప్పారు ఫర్మెంటర్ నమూనాను దేశీయంగా తయారుచేసేందుకు. ఫార్మస్యూటికల్‌గా బి.12 ఉత్పత్తికి అయే ఖర్చు వివరాలను తయారు చేసేందుకు కృషి జరుగుతోంది.

ఈ క్రమాన్ని అభివృద్ధి పరచే విషయంలో ఒక ప్రభుత్వరంగ సంస్థ ఆసక్తి ప్రదర్శించింది. ఈ క్రమాన్ని వ్యాపార పద్ధతుల్లో అభివృద్ధిపరచేందుకు సంప్రతింపులు జరుగుతున్నాయని ఆ ప్రకటనలో తెలిపారు.

అప్లైడ్ మెకానిక్స్‌లోని బయో-ఇంజనీరింగ్ లేబొరేటరీ ఎలక్ట్రానిక్ బ్లడ్ ప్రెషర్ పరికరాన్ని తయారు చేసింది. మామూలుగా వైద్యులు ఉపయోగించే బ్లడ్ ప్రెషర్ పరికరంలాగే అది వుంటుంది. అయితే ఈ కొత్తరకం పరికరాన్ని వినియోగిస్తే డాక్టరు స్టెతస్కోప్ వినియోగించ నవసరంలేదు.

వాణిజ్య ప్రాతిపదికపై ఉత్పత్తి చేసేందుకు ఈ పరికరం తయారు చేసే క్రమాన్ని ఒక స్థానిక పారిశ్రామిక వేత్తకు యిచ్చినట్లు ఆ ప్రకటన తెలిపింది.

ఐ ఐ టి, సౌర శక్తితో పనిచేసే ఒక చిన్న రిఫ్రిజిరేటర్‌ను కూడా రూపొందించింది. ఈ రిఫ్రిజిరేటర్‌లో ఐస్ తయారు చెయ్యడం సాధ్యమని తేలింది

తమిళనాడు ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు సముద్రపు నీటి నుండి మంచి నీరు తయారు చేసే ఒక సోలార్ స్టిల్ నమూనా తయారు చేసింది. త్వరలో రామేశ్వరానికి కొంత దూరంలో వున్న కృసెడే దీవిలో సోలార్ స్టిల్ పెడతారు

అంతేకాదు, సౌర శక్తితో పని చేసే వాటర్ హీటరు, ఎయిర్ హీటరు, డ్రైయర్లు కుక్కర్లు వగైరా వివిధ పరికరాలను అభివృద్ధి పరచడంలో సోలార్ ఎనర్జీ డివిజన్ కృషి చేస్తోంది.

సౌర శక్తితో విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసేందుకు యీ కేంద్రం తీవ్రంగా కృషి చేస్తోంది.

బీడీ కార్మికులకు పి. ఎఫ్. పథకం

కేంద్ర మంత్రి వెల్లడి

బెంగుళూరు, సెప్టెంబర్ 11

దేశంలోనిబీడీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పథకాన్ని ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని కార్మికశాఖ స్టేట్ మంత్రి డా॥ రాంకృపాల్‌సిన్హా నేడిక్కడ తెలియ చేశారు.

ప్రారంభంలో దాదాపు 2 లక్షలమంది బీడీ కార్మికులున్న కర్ణాటకలో ఈ పథకం ప్రవేశపెట్టబడుతుందని ఆయన పత్రికా విలేకరులకు తెలిపారు.

కార్మికుల్లో బీడీ కార్మికులు చాలాబలహీన వర్గానికి చెందినవారని ఆయన అన్నారు.

రైల్వే పోర్టర్స్‌కు గ్రూప్ ఇన్సూరెన్సు పథకం

లైసెన్సుడు రైల్వే పోర్టర్స్‌కు గ్రూప్ ఇన్సూరెన్సు పథకంవిస్తరింపచేసే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తున్నదని కేంద్రకార్మిక శాఖస్టేట్ మంత్రి శ్రీ రాంకృపాల్ సిన్హా నేడిక్కడ తెలియజేశారు.

ఈ నెలాఖరున యీ విషయమై రైల్వే అధికారులతోను, జీవిత బీమా సంస్థతోను కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపనున్నదని తెలిపారు.

దేశంలో దాదాపు 3లక్షల రైల్వేపోర్టర్స్ వున్నారని ఆయన చెప్పారు.

రైల్వేలు పోర్టర్స్‌ను తమ సిబ్బందిగా అంగీకరించకపోవడంవలన, వారి సాంఘిక భద్రతకై కొన్ని పథకాలను అమలు పరచాలని అఖిల భారత పోర్టర్స్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని తెలిపారు

గ్రూప్ ఇన్సూరెన్సు పథకం ప్రతిపాదన అంగీకరించే పక్షంలో రైల్వేలు వార్షికంగా పోర్టర్స్‌నుండి ప్రీమియంలు వసూలు చేయవచ్చునని అన్నారు.

భారత పార్లమెంటరీ ప్రతినిధివర్గం మాంట్రియల్ రాక

మాంట్రియల్. సెప్టెంబరు 11

23వ కామన్‌వెల్త్ పార్లమెంటరీ మహాసభలో పాల్గొనే భారత ప్రతినిధి వర్గం ఇక్కడికి చేరుకున్నది.

లోక్‌సభ స్పీకర్ శ్రీ కె. ఎస్. హెగ్డే నాయకత్వానగల ఈ ప్రతినిధి వర్గంలో 24 మంది ప్రతినిధులు వున్నారు. ప్రతినిధి వర్గంలో రాజ్యసభ ఉపాధ్యక్షులు శ్రీ ఆర్. ఎన్. మీర్ధా, పార్లమెంటు సభ్యులు శ్రీ హెన్రీ ఆస్టిన్‌లు వున్నారు. మహాసభకు హాజరయ్యే ముందు ప్రతినిధివర్గం గ్రూపులుగా విడివడి దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శిస్తుంది. శ్రీ హెన్రీ ఆస్టిన్ ఆసియా రీజనల్ కౌన్సిలర్‌గా మహాసభకు హాజరవుతారు.

రెండోదఫా చర్చలు విఫలం

సిమెంటు కార్మికుల సమ్మె ప్రతిపాదనపై

బొంబాయి, సెప్టెంబరు 11

తాత్కాలికభృతి విషయంపై సెప్టెంబర్ 13 నుండి సిమెంట్ కార్మికులు జరుపదలచిన సమ్మెను నివారించటానికి నిన్న యిక్కడ పరిశ్రమ యాజమాన్యాలకు కార్మిక ప్రతినిధులకు మధ్య జరిగిన రెండో దఫా చర్చలు విఫలమయ్యాయి

కేంద్ర కార్మిక మంత్రి శ్రీ రవీంద్ర వర్మ చొరవతో యీ చర్చలు జరిగాయి. సమ్మెను నివారించేందుకు జరిగే కృషికి సిమెంటు పరిశ్రమ యాజమాన్యాలు సహకరించటం లేదని భారత జాతీయ సిమెంట్ కార్మికుల సమాఖ్య అధ్యక్షులు శ్రీ హెచ్. యన్. త్రివేది విమర్శించారు.

గ్రంథసమీక్ష

జైమిని భారతం

అనువాదం. ఏలూరుపాటి అనంతరామయ్య ఎం. ఎ.
శారద ప్రచురణలు. 3/3 అరండల్ పేట గుంటూరు
వెల : రు. 25—00

పూర్వమీమాంససూత్రకారుడు జైమిని ఇతనికాలం క్రీ పూ 200 బొద్ద ధర్మాన్ని వెనుకబడినట్టి వైదిక కర్మకాండను మూర్ఖపు పట్టుదలతో పునరుద్ధరించటం మీమాంసా శాస్త్ర లక్ష్యం. ఆసమయాన వచ్చిన భగవద్గీత వేదవాద రతులైన మీమాంసాకారులను విమర్శించి జ్ఞానపరమైన సాంఖ్యాన్ని, నిష్కామ కర్మను బోధించింది. నిష్కామ అనటంలోనే భగవద్గీత పూర్వ మీమాంసను ఖండించినట్లు స్పష్టం. ఏమంటే పూర్వ మీమాంసా కర్మకాండ యావత్తూ కామ్య కర్మలు.

విష్ణుపురాణ వాఙ్మయ సృష్టి క్రీ॥ శ॥ 400 లో జరిగింది. వైష్ణవభక్తి వ్యాపించింది కృష్ణుడు, విష్ణు అవతారమై వాసుదేవపూజ వ్యాపించింది. భాగవతం క్రీ॥ శ॥ 1000 ప్రాంతంలో బొప్పదేవుడు రచించాడు. ఆసమయంలో జైమిని పేరుతో భారతంలో అశ్వమేధపర్వం తిరిగి రచించబడింది. అదే జైమిని భారతం.

దీనినే శ్రీ అనంతరామయ్యగారు యథాతథంగా అనువదించారు.

సంస్కృత సాహిత్య చరిత్ర తెలిసిన వారందరూ సామాజిక దృష్టి కలిగిన వారందరూ ఆమోదించిన కాలనిర్ణయ మిది.

కనుక జైమిని భారతం అష్టాదశ పురాణాల తర్వాతం. యజ్ఞయాగాది వైదికకర్మల ప్రాశస్త్యాన్ని ఉగ్గడించేందుకు, అశ్వమేధ పర్వాన్ని మాత్రం స్వీకరించి రచింపబడిన గ్రంథం

ఈ జైమిని, పూర్వమీమాంసాకారుడైన జైమిని కాదు. ఉభయులకు వేయి సంవత్సరాల వ్యత్యాస మున్నది బొప్పదేవుడు రచించిన భాగవతం వ్యాసునికి ఆపాదింతగా రెండవ జైమిని మొదటి జైమినిగామారుటలో ఆశ్చర్యమేమి!

ఈ గ్రంథంలోని కథలను చూసినా ఇది పురాణ వాఙ్మయ కాలంనాటిదని స్పష్టమౌతుంది. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అను మనుస్మృతి వాక్యం చిలవలు పలవలుగా వర్ణింపబడ్డది కారిణి, స్వైరిణి ఇత్యాది వర్ణనలు కోకొల్లలు. బ్రాహ్మణుల ప్రాశస్త్యం మయూరధ్వజుడను రాజు తన శరీరాన్ని అర్ధభాగం రంపంతో నరకుకొనుట, చిరుతొండనంబి కథను స్మరింప చేస్తున్నది. ధర్మరాజు అశ్వమేధాన్ని వర్ణిస్తూ, దాదాపు మూడవవంతు గ్రంథం, శ్రీరాముడు చేసిన అశ్వమేధపు వర్ణనలతో నిండి ఉన్నది.

బాహ్య, అంతరంగిక సాక్ష్యాలు ఎన్ని చూసినా, ఈ గ్రంథం క్రీ॥శ॥1000 తర్వాత దనిస్పష్టం

కాని అనువాదకులైన అనంతరామయ్య గారు ఈ గ్రంథాన్ని క్రీ పూ 3 వేలకు నెట్టారు వ్యాసుని శిష్యుడు జైమిని అని, పూర్వమీమాంసా కారుడైన జైమిని ఈ గ్రంథ రచయిత ఒకరేనని, వాంపల్లి దాయి వద్దలిలో సుదీర్ఘమైన పీఠిక వ్రాశారు

అనువాద విషయంలో అనంతరామయ్య గారు చక్కని వ్యావహారిక భాషలో ప్రవాహ సదృశంగా వ్రాశారు, తెలుగు భాషపైన సంస్కృత భాషపైన రచయితకు గల అధికారం ప్రశంసనీయం.

జైమిని భారతాన్ని పిల్లలమర్రి పినవీరభద్రుడు, పద్యకావ్యంగాను సముఖం వెంకటకృష్ణప్పనాయుడు గద్యకావ్యంగాను లోగడనే వ్రాశారు. అవి యథామూలములు గావు. సంగ్రహీకరణములు.

ప్రస్తుత అనువాదం వాక్యానికి వాక్యం యథామూలం అదే ఈ గ్రంథ ప్రత్యేకం తన తండ్రి ఆదేశంమేరకు ఈ గ్రంథాన్ని అనువదించిన రచయిత పితృభక్తిని, సంస్కృత భాషానురక్తిని నిరూపించు కున్నారు.

— బలరామమూర్తి

నాస్తికత్వం
– ఒక పరిశీలన

రచన : రంగనాయకమ్మ
వెల రు. 2/-
ప్రచురణ : అరుణా పబ్లిషింగ్ హౌస్ ఏలూరురోడ్డు విజయవాడ - 2.

భారత నాస్తికసమాజం వారు దిగితే వ్రాసిన 80 పేజీల వ్యాసం ఇది నాస్తికత్వం అన్ని సమస్యలకూ పరిష్కారం కాదు మూఢనమ్మకాలనుంచి ప్రజలు బయటపడితే అది వారి మానసిక వికాసానికి తద్వారా సమాజోన్నతికి తోడ్పడుతుంది స్థూలంగా వుండే ఈ విషయాన్ని తమ స్వంత ఆలోచనని జోడించి శ్రీ గో. రా. గారు "విమర్శనాత్మక నాస్తికత్వాన్ని" నమ్మి ప్రచారం చేశారు. అయితే వారు శాస్త్రీయంగా కనపడే అనేక విషయాల్ని భౌతిక విషయాల్ని విస్మరించారు జీవశాస్త్రం ప్రతిపాదించిన ఆమోదించబడిన విషయాన్ని కూడా ఆయన ఒప్పుకోలేదు

నాస్తిక దృక్పథ మొక్కటే సర్వరోగ నివారిణి అనినమ్మిన గోరాగారికి రంగనాయకమ్మగారు అనేక సవాళ్ళు విసిరారు అందులో ఒకటి పేజీ 55

....."రష్యా విప్లవ కాలంలో తజికిస్తాన్ ప్రాంతంలో ముస్లిం రైతులు అల్లా పేరుతోనూ ఖురాన్ పేరుతోనూ మత నమ్మకాల కిందుత్తు కూడా పోతుండగానే భూస్వాములపై తిరుగుబాట్లు చేశారు. విప్లవాన్ని విజయవంతం చేశారు, నాస్తిక దృక్పథం వల్లనే వారిస్థితి మారిందా? చైనా విప్లవ కాలానికి ప్రజలందరూ నాస్తికులా?...... ఇలా పూర్వపక్షం చేశారు.

ఇంకో మెరుపు. "వర్గ సంఘర్షణ సిద్ధాంతం నిలవనుగాని, నాస్తిక ప్రజాస్వామ్యం నిర్ధారణకు నిలుస్తుందా?— వక్కాణి వివరణకో తర్కబద్ధంగా సాగిన ఈ రచన ప్రారంభంలో (పేజీ 3) రచయిత 'తెలుగు దేశంలో నాస్తికత్వం అంటే గోరా, గోరా అంటే నాస్తికత్వం......"అన్నారు, అందుచేత ఆ పరిధిలోనే చర్చించారు. చదవ దగ్గ వ్యాసం.

మాట్లాడిన మానవత

[వచన కవితా సంపుటి]
కవి :
సున్నా అచ్యుతరావు
ప్రచురణ :
మణి పబ్లికేషన్స్,
శ్రీకాకుళం 532001
వెల రు 5/-

శ్రీ శ్రీ ఆశీస్సు ఆముద్ర ముందు మాటలలో వచ్చే ఈ కవితా సంపుటికి ముఖచిత్రాలంకరణ శ్రీ శీలా వీర్రాజు. "ఎమోషన్ రికలెక్టెడ్ ఇన్ ట్రాన్ క్విలిటీ ఈజ్ పొయెట్రీ" అంటారు, అయితే తప్పనిసరిగా క్రమంలేని భావోద్వేగాన్ని కాగితంపై పరిస్తే ఏమౌతుంది?

"కొత్తని పాతని సమానంగా
తలుచుకుంటున్నాను
అభ్యుదయాన్నీ విప్లవాన్నీ అభ్యర్థి
చేస్తున్నాను
ఆనందాన్ని విషాదాన్ని ఒకే మాదిరిగా
ప్రేమిస్తున్నాను
గత అనుభవాన్ని గుర్తింపడం
నేర్చుకొంటున్నాను"

అని అంటున్న కవిని ఎలా అవగాహన చేసుకోవాలో బహుశా శ్రీ శ్రీ కి, అక్కడికే తెలియవచ్చు. (పాఠాంతరం : యాదాలాపంగా పేజీపైన పుస్తకాన్ని తెరచిన ఒక అమాయక పాఠకుడు ప్రశ్న 'అభ్యుదయాన్నీ విప్లవాన్ని గమనిస్తున్నాననంటే' అది తప్పా? అప్పుడు కవిత్వం కాదా?)

కవికి తనలోవున్న ఇంట్రోవర్ట కాంట్రాడిక్షన్స్ కి గోచరించినట్లు అనిపించదు. జాతీయ చింతనకు సంబంధించిన కాంట్రాడిక్షన్స్ అయితే కవితలో చోటు చేసుకున్నా అంతంగానే వుంటాయి. కానీ అనివర్తమాన సమాజంలోనికి ప్రసరించిన అణుపుండవు సమస్యలగురించిబాధ పడవలదన్న సంతులు వాటి గురించి రాస్తే మంచి పాఠకులకు కొంత హాస్యాస్పదంగా వుంటుంది వారు ఆనందానికీ, విషాదానికీ ఇంకా అభేదాన్ని సాధించేంత ఉన్నతులు కాలేదా , పాపం !

'స్వాతంత్ర్యమివ్వలేను' అనే కవితలో
'మండే మా కడుపులలో
రగిలే పొగలు చూసి !
ఎండిన మా హృదయాలలో
పారిన నీటిని చూసి !'' అంటాడు

కవి మున్ముందు పేజీలో నేటి మున్నుటు ఆరులో 'మా ఆంధ్రదేశ' అన్న కవితలో మన ఆంధ్రప్రదేశం వెలుగుబాటలో నడిపించండి. అన్నపూర్ణ అని పుణ్య ప్రదేశమనీ మెచ్చుకుంటారు

బహుశా ముందు పేజీలో రగిలిన మంటలు సరిహద్దుల మీద వేమో! ఇదే ఆనందాన్ని విషాదాన్ని ఒకే మాదిరిగా ప్రేమించటం అయివుండవచ్చు.

"ఏది మానవత్వం? కవి రాజకీయ దృక్పథాన్ని స్పష్టాస్పష్టంగా తెలియ జేస్తుంది శ్రీ శ్రీ ఆశీస్సులందించిన ఈ "[illegible]" అర్థంలేని ఆవేశంలో — ఆలోచన లేని ఆవేదనతో - దౌర్జన్యాలు చేసి దోచుకుంటే - మనుష్యుల్ని హత చేస్తే సామ్యవాదం సిద్ధిస్తుందా? - దోపిడీలు స్థాపింపబడుతుందా? నవసమాజం నిర్మింపబడుతుందా? - మానవత్వ మనిపించుకొంటుందా??" అంటారు

'పరీక్షణ' శాసనదాం వరసల్లోనిది. ఇంకా హృద్యమైనవి, సౌందర్యోపాసన లాంటి గేయా లున్నాయి.

ప్రొజాయిక్ భావం పొయిటిక్ కాదని తెలిసీ కూడా వ్రాయకుండా వుండలేకపోతే ముద్రాపణలు చూసుకోవడం మంచిదేమో 88 పేజీలకు 5 రూపాయల ధర అన్యాయం!

—డా॥ పరుచూరి రాజారామ్

బండ్లమూడి మాట

రచన :
బండ్లమూడి సత్యనారాయణ
ప్రాప్తిస్థానం :
ఇందుమతీ ప్రచురణలు,
నరసింహారావుపేట ఏలూరు.
వెల : రెండు రూపాయలు

102 ఆటవెలది పద్యాలతో 'బండ్లమూడి మాట వినిడిమాట' అనే మకుటంతో శతక రూపంలో సాగిన రచన. ఇది బండ్లమూడి వారి తొలి రచన.

కవి ఆధునికత్వాన్ని, సంస్కరణాన్ని అభిమానించేవారు కావటాన, ఆ రెండూ రచనలో చోటుచేసుకున్నాయి తమ తొమ్మిదు లోనే సంఘ సంస్కర్తలైన వేమన, కందుకూరి, త్రిపురనేని వారలను స్మరించారు

తెలుగు సాహిత్యంలో శతకా కొక విశిష్ట స్థానం వుంది. అందరూ స్వీకరించే వస్తువునుబట్టి చాలా వైవిధ్యంగల శతకాలు వచ్చాయి నీతి బోధకా అయిన శతకాలలో వేమన, సుమతీ శతకాల కున్న ప్రాచుర్యం మరి వేటికీ లేదంటే అతిశయోక్తి కాబోదు. వాటి మార్గంలోనే, సమకాలీన సమస్యలను గ్రహించి, గతంలో నార్లవారి మాట వెలువడింది, ఆ కోవలోదే ఈ బండ్లమూడి మాట. రచన ఎక్కడా కుంటు పడకుండా సాఫీగా సాగింది. అసలే ఆటవెలది చిన్నది. అందులో నడక కుంటిదైతే దాని సొగసంతా చెడుతుంది.

ఇక వారు స్పృశించిన విషయాలలో కూడా వైవిధ్యం మిన్నగా వుంది రాజకీయాలు, విద్యార్థుల పరిస్థితి, నేటి తీట వలన కలిగే ముప్పు, రైతుల బాధ, చదువులవలన కలిగే మేలు, ఇలా అనేకములైన పసిడి పలుకులను మూట గట్టారు

మచ్చుకు ఒకటి రెండు చూద్దాము సప్త వ్యసనాలేమో మనకు తెలును అయితే నేటి కాలపు దాబుల సప్త వ్యసనాలను బండ్లమూడి ఇలా చమత్కరించారు.

"సిల్లపేక, క్రికెటు, పేకాట, సిగరెట్టు
కాఫి (పి), సినిమ, సమ్మె" - అనుగొనంగ
కాలరకను నేడు వ్యసనమ్ము లని పిదు

గ్రంథారంభంలోనే స్వేచ్ఛను గూర్చి ఇలా అంటారు.

స్వేచ్ఛ కలదటంచు కుప్పుసు వెతరేగి
పెట్టి మెట్టి పనుల చేల మేయు
పిచ్చికుక్క స్వేచ్ఛ పిళ్ళగాంతికి చేటు,

ఇంటిదొంగను ఈశ్వరుడు కూడా పట్ట లేడని మనకో సామెత వుంది. సామెతయితే అందరికి తెలుసుకాని, పట్టలేకపోవడానికి కారణ మేమిటో తెలియదు. అయితే బండ్లమూడి ఇలా ఊహించారు.

దొంగ గుడినిచొచ్చి దోచుకు జనుదుంత
పటుకొనగ లేకు పరమశివుడు
ఇంటి దొంగ నభవు డింకెట్లు పట్టునో

నిజమే! తన ఇంటి దొంగనే పట్టలేని వాడు ఇతరుల ఇండ్ల దొంగలను ఎలాపట్టు కుంటాడు!

ఈ విధంగా అతి అతి పదాలతో, సున్నితంగా సాగిన ఈ రచన రసజ్ఞుల హృదయాల నలరిస్తుందని భావించవచ్చు.

వృషభగీత :

రచన
వల్లభనేని కాశీ విశ్వనాథం
ప్రాప్తిస్థానం : ప్రోగ్రెస్ పబ్లికేషన్స్ ఏలూరు.
వెల రు 2/-

ఇది ఆటవెలది ఛందస్సులో శతక ధోరణిలో నడిచిన లఘుకావ్యం. గిడ్డి విడలాపగి త్తలార ! చిత్తగించిరార ! గిత్తలార అనే రెండు మకుటాలతో "వక్కాణ" లవలు నడిచిన రచన. ఇందులి స్తుతును గూర్చి "స్వార్థ" చింతనలేని పల్లెగాసాగాలి గడ్డిమేయుచుంశ గొడ్డి ప్రేముం, పశుగణాల పాటు పసగట్టిన దిట్ట, వెళ్లడించుచుంటి వినుడుక' అని వృషభల వాదరూపంలో చెప్పుకున్నారు. పంకయించరాదు స్వార్థుల పరిమార్చి" అనే సత్యం సంకల్పంతో, ఈ రచన ప్రారంభించారు. రచయిత సంఘంలో పేర్కొన్న అవినీతి, అంధ గొందికనం దౌర్జన్యం మొదలయిన వాటినిగూర్చి, వారినట్ట వహించవలసిన జాగ్రత్తను గూర్చి హెచ్చరించారు. అక్కడక్కడా వ్యావహారిక భాషారూపాలు, అన్య దేశాల చోటు చేసుకున్నాయి. ఇలాంటి రచనల్లో కూడా అవి చోటు చేసుకొనడం ముదావహం. ఒక చోట 'రచయిత స్వాతంత్ర్య యోధులను గూర్చి "బంది ఖానా శీలపొందిరి పెన్షను బందెబడిన గొడ్డు కెందుకనడు!" అని వ్రాస్తారు కనీసం వారు బందిఖానాకైనా వెళ్ళారు కొంత న్యాయముంది. స్వాతంత్ర్యసంగరం, ఆ ఉద్యమంతో ఏమీ సంబంధంలేని ఎం. ఎల్. ఎ లకు పెన్షను ఏర్పాటు చేయడం మాట ఏమిటి? అంతేకాక రచయిత దృష్టి ప్రకారం.

బందె పడిన గొడ్డుకు పెన్షను యివ్వడ మంటే దాని యజమానికి చెందుతుంది గదా? అక్కడక్కడ రచయిత వెలి బుచ్చిన అభిప్రాయాలు "ఒకరి నొకరు నమ్మకుందురు. మానవులే" "దృష్టి కంద రాని దేవుని సృజియుంచి, మూఢభావములను ముంచి వచ్చి, గడిరచుపాసి నడ్డిపై తన్నుండు" మొదలైనవి పాఠకునిలో ఆలోచనను రేకెత్తిస్తాయి.

— యార్లగడ్డ
బాలగంగాధరరావు

కథలు — కల్పనలు

రవీంద్రుని మాతృకకు తెలుగు. డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డిగారు - ప్రచురణ ఆంధ్ర సారస్వత పరిషత్తు తిలక్ రోడ్డు హైదరాబాద్ - వెల 4 రూ॥లు)

ఈ పుస్తకం, యిరవై నాలుగుప్రసిద్ధ సాంప్రదాయక కథలు, ఎనిమిది కల్పనా కథలతో "కథా ఓకాహినీ" అనే రవీంద్రుని కథ గేయాలకు తెలుగు అనువాదం అనువదించిన సుప్రసిద్ధులు డా॥ బెజవాడ గోపాలరెడ్డిగారు కథా గేయాలను గద్యంలోకి మార్చివేశారు 1943 ప్రాంతంలో చేసిన తెలుగు అనువాదాన్ని 1976లో సారస్వత పరిషత్తువారు ప్రచురించారు

ముప్పయిమూడు క్రిందటి అనువాదాన్ని భాషనూ, వర్ణనలనూ యథాతథంగా అచ్చు వేశారు. మళ్ళీ ఒకసారి కలానికి పని కల్పించివుంటే బాగుండేది.

మూలం విశ్వకవి రవీంద్రుడిది. రచనా విధానమ్ములోనిది — ఉత్సాహోద్వేగాలతో కూడిన కథా గేయాలు - కవితా రూపకాలు

ప్రకాశకులన్నట్లుగా యే ఇంగ్లీషు అనువాదం నుండో తెలుగు చేసుకొనేవిదులు మాతృక అయిన బెంగాలీ భాష నుండే అనువదించడం ఈ పుస్తకం ప్రత్యేకత

రవీంద్ర కవి కాల్పనిక వాదాన్నే కాక వాస్తవిక వాదాన్నికూడా తన సాహిత్యానికి ఆలంబనంగా చేసుకున్నాడు. ఈ పుస్తకంలోని కథలు సాంప్రదాయమైన వాటిలోనూ, కల్పించిన కథల్లోనూ కాల్పనిక వాద ఛాయలే అత్యధికం.

రాజస్థాన్,మహారాష్ట్ర వీరులు, వీరవనితల వంటివారు విస్మరణీయులు. వీరత్వాన్ని చిత్రించే గాథలతోపాటు కరుణారసపూరితమైన బౌద్ధ గాథలనుకూడా విశ్వకవి తన కథావస్తువులుగా స్వీకరించారు.

కథావస్తువులను సామాజిక దృక్పథంతో చూసే కొంత ప్రతిపక్షోణి వుందనిపిస్తుంది 'వివాహము' అన్న ఖండికలో సహగమన దురాచారాన్ని ఆకాలాని కే తరం జరిగింది. "భర్తను పొందుట" అన్న శీర్షిక తన్వ్యతిరేకం.

అయితే బ్రహ్మ సమాజికుడు కవికుల గురువుఅంతటివాడు సహగమనదురాచారాన్ని సమర్థిస్తాడా అనడానికి ఆస్కారంలేదు, కాని ఈ పరస్పర వ్యతిరేక సామాజిక దృష్టికి కారణం, బాధ్యత, కాల్పనికవాదం మీదనే తోసివేయాల్సివుంటుంది.

చారిత్రకంగా ఆనాడు సహగమనం జరిగినా దానియెడ కవి దృక్కోణం ఎలా వుండాలన్న ప్రశ్న విచారణీయం.

ఇక అనువాదంగురించి రెండుమాటలు. బెంగాలీనుండి ప్రత్యక్షానువాదం చేసిన విశిష్టత, పుస్తకాన్నంతా గడ్డు గ్రాంధిక భాష ఎంచి వేయడంతో, అదీ 1943 లో గిడుగు పిడుగు యుగం తర్వాత, ఆ విశిష్టత నీరుగారిపోయింది. కృతక భాషను అలంకారంగా ఆనాడు అనువాదకులు చేసుకుంటే చేసుకున్నారు గాక కాని 1976 లో దానికి వ్యావహారిక రూపం యిస్తే బాలాబాగుండేది

చేసిన అనువాదం సజీవ భాషలో వుంటే పాఠకుడు ప్రత్యక్షానువాదం నుండి యింకా లాభపడేవాడు ఈ స్వల్ప లోపాలు వచ్చే ముద్రణలో సవరించుకోవాలనేమీ కాదు యేది యేమైనా రవీంద్రుని కవితకు ప్రత్యక్షానువాదాన్ని అందించిన అనువాదకులు అభినందనీయులు.

కాంచనపల్లి
చినవెంకట రామారావు

హిందుస్థానీ శాస్త్రీయ సంగీత యువ కళాకారుడు బాబాజహీర్ అహమ్మద్ ఖాన్

—వరదా బ్రహ్మానందం

భారతదేశ ప్రఖ్యాతిచెందిన, అతి ప్రాచీన మైన ఉస్తాద్ తీన్ రుస్ ఖాన్, ఢిల్లీ ఘరానాకి చెందిన హిందూస్థానీశాస్త్రీయసంగీత వంశదా వికిచెందిన సాంప్రదాయశాస్త్రీయసంగీతయువ కళాకారుడు శ్రీ బాబాజహీరుద్దీన్ అహమ్మద్ ఖాన్ యమన్ రాగం ఖ్యాల్ పాడుతుంటే హృదయం ఆనందంతో ఉప్పొంగుతుంది. వీరు ప్రసిద్ధ హిందుస్థానీ శాస్త్రీయ సంగీత గాయకులు ఉవాలీబాద్ షా, శ్రీ అజీజ్ అహమ్మద్ ఖాన్ వార్సీ, హైదరాబాద్ ప్రధమ పుత్రుడు. అనువంశికంగా వచ్చే సుప్రసిద్ధ సంగీత సాంప్రదాయాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో అభ్యసించారు. తమ 5 వ యేటనుండే సంగీత సాధన ప్రారంభించారు. వీరి తండ్రి అహమ్మద్ ఖాన్ వార్సీ, ఉస్తాద్ నిస్సార్ అహమ్మద్ ఖాన్ వద్ద శిష్యరికం చేసి అపూర్వ ప్రజ్ఞను సాధించారు వీరు కేవలంగా గానమేకాక పద్యసాధిగా తబలా, హార్మోనియంలను కూడా సాధనచేశారు వీరి సోదరులు షాహిద్ అహమ్మద్ ఖాన్ ఖవాలీ సంగీతాన్ని, చిన్నతమ్ముడు మక్బూల్ అహమ్మద్ ఖాన్ డోలక్ తబలా వాయిద్యాలలో ఎంతో పాండిత్యం సంపాదించారు.



శ్రీ బాబాజహీర్ చిన్నతనంలోనే తండ్రితో కూడా పెద్ద పెద్ద నగరాలలోనూ, ప్రముఖ విద్వాంసులు, రాజకీయనేతల సమక్షంలో సంగీత సభలు చేసి ప్రశంసలందుకున్నారు. వీరి వయస్సు 35 సం॥లు ప్రసిద్ధ గా॥శా॥ పంజల్ గాయనీమణి శ్రీమతి బేగం అక్తర్ గా॥శా॥ ఉస్తాద్ అమీర్ ఖాన్, అల్తాఫ్ హుస్సేన్ ఖుర్జావాలే, వీరి కొడుకు వహీద్ హుస్సేన్ ఖాన్. అజ్మత్ హుస్సేన్ ఖాన్, బొంబే, ఖుర్బాన్ హుస్సేన్ ఖాన్, రహమత్ హుస్సేన్ ఖాన్ గ్వాలియర్, కాంతాప్రసాద్, తస్నీం హుస్సేన్, విలాయత్ హుస్సేన్ ఖాన్, బడేగులాంఅలీఖాన్, వీరిమామ ఇనాం అహమ్మద్ ఖాన్ లు వీరిలోని సంగీత జ్ఞానాన్ని ప్రశంసించి, ఆశీర్వదించారు.

ప్రాచీన రచయితలుమీర్జాగాలిబ్ ఫణిన్స్ పాని, అమీర్ మీనాయీ రచనలు, ఈనాటి రఘునాథ్ సహాయ్, ఫిరాక్, వ్యర్థి యా మఖ్దూం మొహియుద్దీన్ ల రచనలు, హృదయరంజకంగా పాడతారు

"ఖ్దూమ్ మఖ్దూం మొహియుద్దీన్ రచనలు, హుజలు ఎంతో ఉద్దీపనం కలిగించేవని, వీరి రచనలకు కేవలం భారత దేశంలోనేకాక అరబ్ దేశాలలో కూడా ఎంతో ప్రఖ్యాతి చెందాయని, అక్కడకూడా వారి పాటలను పాడామని, శ్రీ వార్సీ, బాబా లిద్దరూ చెప్పారు. కనీసం వారం వరకో శాల కొంత సార్థైనా మఖ్దూం మొహియుద్దీన్ వీరి ఇంటికి వచ్చి వీరి పాటలను సంగీతాన్ని అధ్యాయ నంగా ఆలకించేవారని చెప్పారు. మఖ్దూం మొహిన్ మరణించాక వారిని మరింత జ్ఞప్తిలో వుంచుకోడానికి సభలలో ఇదివరకు కన్న ఎక్కువగా వారి పాటలను పాడుతున్నామని చెపుతారు, శ్రీ వార్సీ, అదేవిధంగా శ్రీ జహీర్ అహమ్మద్ ఖాన్ కూడా తమ సంగీతసభలలో మఖ్దూం పాటలుతప్పకుండాగా పాడతారు. ఠుమ్రీ, గజల్ వీరికి కొట్టిన పిండి

తండ్రితో బాటుగా శ్రీ జహీర్ అరబ్ దేశాలు కైరో, జహీరియన్, లిబియా, కువాయిత్ మొదలైన ప్రాంతాలు పర్యటించి అనేక ప్రశంసలందుకున్నారు.

ఉజ్బెకిస్థాన్ కళాకారులు హైదరాబాద్ వచ్చినపుడు శ్రీ జహీర్ సంగీత సభనికూడా ఏర్పాటు చేశారు. వీరి పాటని ఉజ్బెక్ కళాకారులు ఎంతో మెచ్చుకుని అభినందించి ఉజ్బెక్ సాంప్రదాయసిద్ధమయిన 'జూబ్బా', టోపీలను వీరికి బహూకరించారు. ఉజ్బెక్ కళాకారుల నృత్యాలు, పాటలు ఎంతో ఉన్నత కళాఖండాలని శ్రీ జహీర్ మెచ్చుకుంటారు

హిందుస్థానీ శాస్త్రీయ సంగీత కళాకారులకు అమెరికా, కెనడాలలో ఎక్కువ ఆదరణ వుంది. మన ప్రభుత్వం పోషిస్తు దేశాలకు కూడా ఈ కళాకారులను పంపి మన హిందుస్థానీ శాస్త్రీయ సంగీత ప్రతిభని అక్కడి ప్రజలకి వినిపించే సావకాశం కల్పించడం మంచిది అంటారు శ్రీ జహీర్.

వీరు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, రాజేంద్రప్రసాద్, ఇందిరాగాంధీల సమక్షంలో తమ సంగీత ప్రతిభను చూపి అభినందనలందు కున్నారు.

స్వర్గీయ నెహ్రూ సమక్షంలో కేవలం 15 నిముషాలు ప్రోగ్రాం నిర్ణయించబడి 1 గం, 15 ని, ల వరకూ శ్రీ నెహ్రూ వారి సంగీతాన్ని విన్నారంటే వీరి గానం ఎంత ఆకర్షణీయంగా వుంటుందో వూహించ వచ్చు.

ఢిల్లీ రేడియో, టెలివిజన్ లలో తరచు వీరి ప్రోగ్రాంలను ఏర్పాటు చేస్తారు.

ఢిల్లీ, లక్నో, కాశ్మీర్, డార్జిలింగ్, తదితర అనేక ముఖ్య పట్టణాలలో వీరి సంగీత సభలు జరుగుతాయి. పెద్ద సంఖ్యలో ప్రజలు వీరి గానామృతాన్ని గ్రోలుతారు. అనేక బహుమతులు స్వర్ణ, రజత పతకాలను కప్పులను బహుమతులు పొందారు. వీరు చిన్నప్పటి నుండి మస్తీ నేర్చుకున్న పహిల్వాన్ చాలా బహుమతులు సంపాదించారు.

కళాకారులు మత్తు పదార్థాలను దరిచేరనీయరాదని, మత్తు పదార్థాలు కళాకారుడి కళను, కళాకారుడిని నాశనం చేస్తుందని నమ్ముతారు.

బాబా జహీర అహమ్మద్ ఖాన్ సంగీతం ఎంతో శ్రుతి పక్వతలో గంభీరతలో, గమక్ తాన్, ఖరే, మీండ్ ప్రత్యేకతలతో అన్ని స్థాయిలనూ సులువుగా పలుకుతూ, శ్రోతల హృదయాలను స్పందిస్తుంది. సులువైన స్వరగమన సోగలతో, చక్కటి తిరుగుడుతో రాగంతార పంచమాన్నందుకున్నపుడు విన వలసిందే గాని రాయడం సాధ్యం కాదు

ఎన్నో రాగాల ఖ్యాల్స్ ని అపురూపంగా పాడటం వీరి ప్రత్యేకత.

వీరి అతని కుమారుడు నసీర్ అహమ్మద్ ఖాన్ [9 సం.] అప్పుడే అనుభవజ్ఞుడైన గాయకుడిలా పాడతాడు.

ఇంత పాండిత్య ప్రతిభలు కల బాబా జహీర్ నిగర్వి ఇంకా సంగీత సముద్రంలో ఎంతో ఈది, ఎన్నో కొత్త లోతులకు పోవా లనే కాంక్షతో సాధన, కృషి చేస్తూనే వుంటానుఅంటారు శ్రీ బాబా జహీర్ అహ్మద్ ఖాన్.

రంగస్థలి

విజయవాడలో పిఠాపురం, మాధవపెద్ది బృందంచే మ్యూజికల్ నైట్

విజయవాడ రైల్వే ఇన్ స్టిట్యూట్ లో ఇటీవల ప్రఖ్యాత సినీ ప్లేబాక్ గాయకులు పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం బృందం [మ్యుదాసు] వారు దాదాపు 3 గంటలపాటు మ్యూజికల్ నైటు నిర్వహించి హాస్య శృంగార రస గీతికలతో హుషారెత్తించే పాటలు పద్యాలతో ప్రేక్షకులను కవ్వించి నవ్వించి ఆనంద డోలికల్లో ముంచెత్తారు.

ఎప్పుడో 20 ఏళ్ళ క్రితం గానంచేసి తమ చిత్రాలద్వారా వినిపింప చేసిన పాటలను, ఎంతో ప్రజాదరణ పొందిన ఆ గీతికలను స్వయంగా తమ గళాలువిప్పి మరింత శ్రావ్యంగా పాడి ఆ గానలహరిలో ప్రయాణం లూసి తేలించ జేశారు. సుమధురం కాక పోయినా, రసాస్వాదనతో తన్మయత్వం చెంది వళ్లు పులకరింప జేయక పోయినా జరుగు అంగుమనే తమ కంచు కంఠంతో చేసిన గానానికి అనుగుణమైన నటనను జత చేసి ప్రదర్శించడం విశేషం.

దానికితోడు, ఇటీవలే ఆంధ్రప్రదేశ్ సినీ గాయకుల సంఘం నిర్వహించిన రాష్ట్ర స్థాయి పాటల పోటీలలో బంగారు పతకంతో పాటు, పెక్కు పోటీలలో వివిధ బహుమతులు, సన్మాన పత్రాలనందుకుని రామకృష్ణ, వసంత లాంటి ప్రఖ్యాత సినీ ప్లేబాక్ గాయకులతో గళం గళం కలిపి పలు పాట కచ్చేరీలలో పాల్గొన్న వర్తమాన గాయకుడు శ్రీ కోనాడ అశోక్ స్వయం కృషితో యిప్పుడిప్పుడే సరిగమల పలుకుల్లో పస తెలుసుకుంటూ గానం చేసిన నాలుగు పాటలు ఎంతో రసాత్మకంగా, వీనులకింపుగా, హృద్యానందం గొలిపేదిగా వుండి మైమరపింప చేశాయి.

ఇంకా వర్ధమానగాయనీగాయకులుకుమారి [ఎదురీత ఫేం], ఉష, డాక్టర్ మహేష్ చంద్ర [డ్యూయట్ సింగర్], దొరైస్వామి తమ తమ స్థాయి మేరకు చక్కగా పాడారు. డాక్టర్ మహేష్ చంద్ర హుషారుగా పాటతో నటన జతచేసి గానంచేసి మన్ననలుపొందినా అనవసరమైన కులుకులు, చిందులు తగ్గించి వుంటే మరింత ఏమైనా ఆదరణ పొందే వారేమో ఒకే వ్యక్తి మగ, ఆడ గొంతుకలతో పాడటం ఓ విశేషం, అలానే పాటకు తగ్గ సంగీతం లేకపోవడం కొట్టొచ్చి నట్లు కనిపిస్తున్నా కొంత మేరకు మేలేనని అనిపిస్తుంది.

— ఉదయ్

విజయ వరలక్ష్మి నృత్య ప్రదర్శన

మంచి నర్తకికి కావల్సిన రూప లావణ్యాలు, అధ్యయనకాంక్ష, ఉత్తమ గురుత్వం, నిరంతర సాధన, వీటికి వన్నె తెచ్చు ఉన్నత విద్యావ్యాసమూ, చక్కని ప్రదర్శనకు కావల్సిన సమర్థవంతమైన నట్టువాంగం, తగిన వాద్య సమ్మేళనాలు సమకూడుటవల్ల— కుమారి విజయ వరలక్ష్మి నృత్యప్రదర్శన పరిపుష్టిని ఆకట్టుకుంది.

అలరింపును — "నాట"లో అలరించినా, జతిస్వరానికి— "కళ్యాణి"లో అందెల రవళులు చిందించినా, వర్ణం— "శంకరాభరణ"మైనా, అష్టపదిలో అభినయం "యమునా కల్యాణ"మైనా కృష్ణ శబ్దంలో కృష్ణుడ్నే— "మోహనం"గా చూపినా కీర్తన "రాగమాలిక" మైనా. తన ప్రత్యేకతను ప్రదర్శించి ప్రేక్షకుల్ని మెప్పించి, తాను మెప్పు పొందిన నర్తకి

ఈ సందర్భంగా జరిగిన సభకు శ్రీ ఎం. శ్రీప్రకాశం అధ్యక్షత వహించగా, శ్రీ తె రామచంద్రమూర్తి ప్రారంభకులుగా, శ్రీ సుందరరావు ముఖ్య అతిథిగా వ్యవహరించారు కుమారి వరలక్ష్మి నృత్య విశేషాలను గూర్చి వక్తలు ప్రశంసించారు.

శ్రీయుతులు సూర్యారావు, పూర్ణచంద్ లు సన్మానించబడ్డారు.

నృత్తం - నృత్య పరంగా బాగున్న యీ ప్రదర్శనకు నట్టువాంగం, గానం - శ్రీ టి. యస్. రామమూర్తి నిర్వహించారు. శ్రీ సరస్వతీనంద నృత్య కళాలయవారు సెప్టెంబరు 4 వ తేదీన విజయవాడ రైల్వే ఇన్ స్టిట్యూట్ లో యీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

"ఇదీ భారతం" నాటక ప్రదర్శన

విజయవాడ శ్రీ నటరాజ కళామండలివారు ఆగస్టు 28 న వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో పై నాటక ప్రదర్శనను ఏర్పాటు చేశారు

నటీనటులంతా చక్కని టీం వర్క్ ప్రదర్శించారు. శ్రీ యస్. కాశీంద్ ఈ నాటకాన్ని రచించారు నవ్య కళా మండలికి చెందిన శ్రీమతి ఉమ, శ్రీయుతులు రాంబాబు ప్రసాద్, రాధాకృష్ణమూర్తి, కె యల్.యస్. మూర్తి, రామ్మూర్తి, వెంకటేశ్వరరావు పదాశివరావు, కబీర్ దాస్ నటీనటులు.

శ్రీమతి బాలా త్రిపురసుందరి, శ్రీ రాజారాం సంగీతం, శ్రీ కాశ్రీ మేకప్, శ్రీజగన్నాధ రావు దర్శకత్వం నిర్వహించారు.

—వి. యస్

భీమవరంలో నాటక పోటీలు

భీమవరం అరుణోదయ నాటక కళా పరిషత్ ఆధ్వర్యాన డిసెంబరులో భారీ ఎత్తున నాటక పోటీలుజరపడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

ఈ పోటీలకు దరఖాస్తులు పంపవలసిన ఆఖరుతేదీ అక్టోబరు 15 వ తేదీ. వివరాలకు శ్రీ కొలా నాగేశ్వరరావు, [ఏ. యం. పి.] అరుణోదయ నాటక కళాపరిషత్, 21 వ వార్డు, భీమవరం పశ్చిమ గోదావరి జిల్లాకు వ్రాసి తెలుసుకోవాల్సివుంది.

మావోకు జోహార్లు

పాట్నా, సెప్టెంబరు 11

చైర్మన్ మావో సేటుంగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా బీహార్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీరాధానందన్ [కాంగ్రెస్] అధ్యక్షతన మొన్న ఇక్కడ జరిగిన సభలో మావోకు జోహార్లర్పించారు.

ముఖ్యమంత్రి శ్రీ కర్పూరీఠాకూర్ సభను ప్రారంభిస్తూ మావో నడిపిన లాంగ్ మార్చ్ చారిత్రాత్మకమైనదని. ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవులకు ఉత్తేజం గలిగించిందన్నారు. ఢిల్లీలోని చైనా రాయబార కార్యాలయ రెండవ కార్యదర్శి లీవానాన్ ఈ సభకు హాజరైనారు.

సభలు-సమావేశాలు

ఖమ్మం జిల్లా యువజన సమాఖ్య ఆధ్వర్యాన ఈ నెల 18 న కొత్తగూడెం. 19న భద్రాచలం. 20 న ఖమ్మం. 21 న ఇల్లెందు, 22 న బూర్గంపహాడ్, 23 న సత్తుపల్లి, 24 న మధిరలో సదస్సులుజరుగుతాయి.

లేఖలు

ప్రభుత్వ శాఖలలో నిరంకుశత్వం, అలసత్వం

మహాశయా !

నేను హోమియోపతి ప్రాక్టీషనరుగా 1962 లో రిజిష్టరైనాను. నా రిజిస్ట్రేషన్ నంబరు 1447. అప్పటినుండి నేను ఐదు సంవత్సరాల కొకసారి రిజిస్ట్రేషన్ రిన్యూ చేసుకుంటూనే వున్నాను. కాని యిటీవల రిన్యూ చేసుకోడం కొంత ఆలస్యమైంది. అందుకు గాను ప్రభుత్వం నిర్ణయించిన పెనాల్టీ, రిన్యూవల్ ఫీజులతో సహా "రిజిస్ట్రార్ పర్ బోర్డు ఆఫ్ హోమియోపతి అండ్ ఆయుర్వేదం [హైదరాబాదు] వారికి 1976 జులై 10 వ తేదీన రు. 31 50 మనియార్డరు చేసి, జులై 12 న రిజిష్టర్డు పోస్టులో నా రిజిస్ట్రేషన్ సర్టిఫికెటు, మనియార్డరు రశీదు, కవరింగు లెటరు పంపించినాను, తర్వాత వారికి రెండు లెటర్లు వ్రాశాను. కాని యింతవరకు నాకు సమాధానం కాని రిన్యూ చేసిన సర్టిఫికెట్ కానీ పంపనేలేదు. ప్రభుత్వోద్యోగుల నిరంకుశత్వానికి, రెడ్ టేపిజానికి యింతకంటే నిదర్శనం ఏం కావాలి ?

ఇలా ఎంతమంది బాధలకు గురిచేయబడుతున్నారో! ఇప్పటికైనా రిజిస్ట్రారు నా సర్టిఫికేట్ రిన్యూ చేసి పంపుతారని ఆశించవచ్చునా ? లేకపోతే సంవత్సరాల తరబడి యిలాగే జరుపుతారా ?

ఇట్లు
బి హెచ్. వి శర్మ,
సూర్యారావుపేట, విజయవాడ.

పోరుమామిళ్ళ జూనియర్ కాలేజి టీచర్ల సస్పెన్షన్ రద్దుకై విజ్ఞప్తి

మహాశయా,

పోరుమామిళ్ళ జూనియర్ కళాశాలలో పనిచేయు ఏడుగురు జూనియర్ లెక్చరర్లను 19/7 ఏప్రిల్ లో జరిగిన జూనియర్ ఇంటర్ మరియు 10 వ క్లాసు పబ్లిక్ పరీక్షలకు పర్యవేక్షకులుగా జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నియమించడం జరిగింది. ఆ సెంటరులో కొంత మంది కాపీలు కొట్టినారని కొందరి పిల్లలకు న్యాయం జరుగలేదని కొందరు తల్లి దండ్రులు ప్రభుత్వమునకు వ్రాసిన కారణంగా సెంటరుమొత్తముపిల్లలపరీక్షఫలితాలు నిలిపి వేయటమైనది. ఇందుపై పిల్లల తల్లి దండ్రులు ఆందోళన చేయడమువల్ల కొందరి పరీక్ష ఫలితాలు విడుదలచేస్తూ ఈ కాపీ జరుగుటకు పోరుమామిళ్ళ జూనియర్ కళాశాల అధ్యాపకులే కారణమని ఎట్లు భావించిరో తెలియదు. కానీ ఆ ఏడుగురిని సస్పెండ్ చేయుట జరిగి దాదాపు రెండు మాసాలు అగుచున్నది. ఈకారణముగా పిల్లల చదువు జరుగదనే విశాల హృదయంతో వీరు యథా ప్రకారం కళాశాలకు హాజరై తమ ధర్మమును నెరవేర్చు చున్నందులకు గ్రామ పెద్దలు వీరిని అభినందించు చున్నారు. ప్రభుత్వ చర్యకు మేధావులు విస్తుపోవు చున్నారు. వెంటనేవీరందరికీపునర్నియామక ఉత్తర్వులిచ్చి ఇటు ఉపాధ్యాయులకూ అటు కళాశాల విద్యార్థులకు న్యాయం కల్గించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

ఇట్లు,
యస్. సుబ్బరాయుడు
అధ్యక్షుడు.
కడపజిల్లా ప్రాథమికోపాధ్యాయ
ఫెడరేషన్ (రిజిష్టర్)
పోరుమామిళ్ళ.

ప్రయాణీకులపట్ల ఆర్.టి.సి. సిబ్బంది నిర్లక్ష్యం

మహాశయా,

తిరువూరు వయా [illegible], నూజివీడు మార్గంలో తెల్లదేవరపల్లి గ్రామంవద్ద స్టేజి వుంది, జూన్ 7వ తేదీన మధ్యాహ్నం 12 గంటలనుండి సాయంత్రం 6 గంటలవరకు ఒక్క బస్సును కూడా ఆపకుండా వెళ్ళారు. ఫలితంగా పసిపిల్లలతో వున్న మహిళలతో పాటు ప్రయాణీకులంతా పలు ఇబ్బందుల పాలయ్యారు, ఉదయంనుండి బస్సులను ఆప లేదని కొంతమంది ప్రయాణీకులు చెప్పారు.

గతంలో ఈ రూట్ గుండానే ఏలూరు, మచిలీపట్నం బస్సులు కూడా వెళ్ళేవి. అయితే వాటి రూట్ను మార్చి కొండూరు మీదుగా నడుపుతున్నందున ప్రయాణీకుల రద్దీ మరీ అధికమైంది.

స్టేజికి ఫర్లాంగు ముందే బస్సు ఆపుచేసి ప్రయాణీకులను దింపి స్టేజీ వద్ద ఆపకుండా పోవడం అంటే ప్రయాణీకుల పట్ల ఆర్. టి. సి సిబ్బంది నిర్లక్ష్యాన్ని తెలియచేస్తున్నదే కాని, 'ప్రజా సేవయే మా కర్తవ్యం' అన్న వారి నినాదానికి విలువలేకుండా పోయింది. గత రెండు, మూడు రోజుల నుండి యిలా జరుగుతున్నట్లు ప్రయాణీకులు తెలిపారు.

కావున ఆర్. టి. సి అధికారులు యీ విషయంలో వెంటనే చర్యలు తీసుకుని స్టేజీలవద్ద బస్సులను ఆపేవిధంగా సిబ్బందిని ఆదేశించాలని కోరుతున్నాను.

ఇట్లు
పి. జగన్నాధాచార్యులు
విస్సన్నపేట.

శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర కరువు పరిస్థితి

తక్షణ సహాయ చర్యలకై ముఖ్యమంత్రికి ముగ్గురు శాసనసభ్యుల విజ్ఞప్తి

శ్రీకాకుళం, సెప్టెంబరు 11

శ్రీకాకుళంజిల్లా సోంపేట, మందస, పలాస, టెక్కలి, ఇచ్ఛాపురం తాలూకాలలో అనావృష్టి కారణంగా తీవ్రకరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, అందుచేత పై తాలూకాలలో వెంటనే కరువు సహాయక చర్యలను ప్రారంభించాలని, పన్నుల వసూళ్ళను వాయిదా వేయాలని సోంపేట నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ మజ్జి తులసీదాస్, టెక్కలి నియోజకవర్గ శాసన సభ్యులు శ్రీ ఎన్. లోకనాధం నాయుడు, ఇచ్ఛాపురం నియోజకవర్గం శాసన సభ్యులు శ్రీ ఉప్పాడ గంగాబాబు రాష్ట్ర ముఖ్య మంత్రి శ్రీ జె. వెంగళరావుకు విజ్ఞప్తి చేశారు.

పై తాలూకాల కరువు పరిస్థితులపై వారు ముఖ్యమంత్రికి యింకాక్రిందివిధంగా తెలిపారు.

ఈ తాలూకాలలో అక్కడక్కడ చిన్న చిన్న జల్లులు పడడం మినహా ఈ సీజన్ లో మొదటి నుండి వర్షాలు లేవు. కొద్దిగ్రామాలలో నాట్లు పడి నప్పటికి పై తాలూకాల లోని మొత్తం భూములలో యింతవరకు నాట్లు పడలేదు. నాట్లు పడిన ప్రాంతాలలో కూడా వర్షాభావం వలన ప్రస్తుతం అవి ఎండిపోతున్నాయి.

ప్రతి సంవత్సరం నాట్లు తరుణంలో నీటిని సరఫరా చేసే పైడిగడ్డ, సున ముడి గడ్డని తదితర నదులలో వర్షాభావం వల్ల ఈ సీజన్ లో ఎండిపోయాయి నారు మళ్ళు మొత్తంగా ఎండిపోయాయి. వ్యవసాయ దారులు తీవ్రంగా ఆందోళన చెందు తున్నారు.

అందుచేత వెంటనే ఈ తాలూకాలలో కరువు సహాయక చర్యలను చేపట్టాలి పన్నుల రాయితీలు ప్రకటించి, రుణ బకాయీల వసూళ్ళను వాయిదా వేయాలి చౌకదుకాణాలను ప్రారంభించాలి. సబ్సిడీపై రుణాలను మంజూరు చేయాలి పై ప్రాంతాల పశువుల రక్షించటానికి ఈ చర్యలను తక్షణం చేపట్టాలి.

పై తాలూకాలలో ప్రజలకు సహాయం చేయటానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి వారికి హామీ యిచ్చారు.

25 ఏళ్ళ క్రితం-నేడు

విశాలాంధ్ర

శుక్రవారం- సెప్టెం 12, 1952

కాశ్మీర్ సంభాషణల వైఫల్యం

జెనీవా, సెప్టెంబరు 10

మూడు వారాలుగా జెనీవాలో జరుగుతున్న కాశ్మీర్ చర్చలు ఎట్టి అంతిమ నిర్ణయం లేకుండా వాయిదా పడ్డాయి. ప్రతినిధివర్గ నాయకులంతా తమ తమ దేశాలకు తిరిగి వెళ్ళుతున్నారు.

భారత - పాకిస్తాన్ ప్రతినిధివర్గాల అంతిమ సమావేశం నేటి రాత్రి జెనీవాలో జరిగింది.

మిత్రరాజ్యసమితి మధ్యవర్తి డాక్టర్ గ్రాహం సాధ్యమయినంత త్వరలో, యీ చర్చల పర్యవసానాన్ని భద్రతా సమితికి నివేదించాలి అన్న తీర్మానం సమావేశంలో అంగీకరించబడింది.

కృష్ణ ఆనకట్ట మరమ్మతు

విజయవాడ, సెప్టెంబరు 10

చీఫ్ ఇంజనీయరు శ్రీ వెంకటాచారి ఈ ఉదయం ఆనకట్టపరీక్షించారు. సాయంత్రం ప్రమాదంలో చనిపోయిన ఆఫీసర్ల ఇళ్ళకు వెళ్ళి పరామర్శ చేశారు. వెంటనే రాత్రి మెయిలులో మద్రాసు వెళ్ళి పోయారు. డిపార్టుమెంటులోని దాదాపు అయిదుగురు యింజనీర్లు, కొందరు కార్మికులు ప్రాణాలు కోల్పోవడం, వారి శవాలు కన్పించక పోవడం, యీ స్థితిలో ఉండగా, కనీస మానవధర్మంకూడా చూపెట్టకుండా శవాలు ఏమయిపోయినవో విచారించకుండా అర్ధరాత్రే వెళ్ళిపోయినందుకు చీఫ్ ఇంజనీయర్ గారి ప్రవర్తన బెజవాడ ప్రజలకు చాలా ఆగ్రహాన్ని కలుగజేసింది.



గౌతమబాలవిహార్‌లో సాగర్ డాంకు చెందిన ఇనుము, సిమెంటు

పూర్తి విచారణకై శాసనసభ్యులు శ్రీ బి. రామశర్మ, శ్రీ నిమ్మల రాములు డిమాండ్

విజయపురి, సెప్టెంబరు 11

నాగార్జునసాగర్ డామ్‌నిర్మాణానికి సంబంధించి ఇనుము సిమెంటు, రాగి వగైరా ప్రభుత్వ అస్తులు హిల్ కాలనీలోని ప్రయివేట్ సంస్థ "గౌతమ బాలవిహార్"లో ప్రత్యక్షంగాపడటంపై పూర్తి విచారణ జరిపించాలని శాసన సభ్యులు శ్రీ బి రామశర్మ, శ్రీ నిమ్మల రాములు డిమాండ్ చేశారు.

ఈ విషయాన్ని వచ్చే శాసనసభ సమావేశాలలో ప్రస్తావించ గలనని దేవరకొండ శాసనసభ్యుడు శ్రీ రామశర్మ (కమ్యూ) పత్రికా విలేకరులతో చెప్పారు. శ్రీ రామశర్మ శ్రీరాములు ప్రకటనలో యింకా ఈ విధంగా తెలిపారు.

నాగార్జునసాగర్ డామ్ నిర్మాణ దశలో వున్నప్పుడు దక్షిణ విజయపురిలో పీడ్ల మెషినరీ డివిజన్ క్రింద వున్న భారీ యంత్ర సామాగ్రిని వుంచు నిమిత్తం సుమారు లక్ష రూపాయల వ్యయంతో ఒక షెడ్డును ప్రాజెక్టు అధికార్లు నిర్మించడం జరిగింది.

నాగార్జునసాగర్ డామ్ నిర్మాణం పూర్తి అయిన తరువాత దక్షిణ విజయపురిలోనే వున్న టెక్నికల్ హై వింగ్ సెంటరులో ముటుమాయం అయిపోగా మిగిలిపోయిన షెడ్డును రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల వారికి రెండు సంవత్సరాల క్రిందట యివ్వటం జరిగింది

మెషనరీ డామ్‌కు సమీపంలో ఎత్తు డామ్‌కు ప్రక్కనే వున్న కారణాన యంత్ర సామాగ్రిని వుంచుటకు పైన తెలియచేసిన షెడ్డును అలానే వుంచారు కాని హఠాత్తుగా ఆ షెడ్డు అదృశ్యమైపోయి స్థానికులకు విభ్రాంతిని కలిగించినది.

ఆ తరువాత కొద్ది రోజులలోనే ఆ షెడ్డుకు సంబంధించిన ఇనుప స్థంభాలు, రేకులు వగైరా హిల్ కాలనీలో వున్న "గౌతమ బాలవిహార్" అను ప్రైవేటు సంస్థలో వెలసినవి.

ఈ బాలవిహార్ కళాకృష్ణగల బాలబాలికల దగ్గర భరతనాట్యం, సంగీతం మొదలగునవి నేర్పుటకు అధిక రుసుం వసూలు చేస్తూ, ప్రదర్శనలకు కూడా భారీగా ప్రవేశ రుసుం వసూలు చేస్తున్న వ్యాపారసంస్థ

కేవలం 50 రూపాయల వ్యయంతోనే ఈ షెడ్డు నిర్మాణసామాగ్రిని సేకరించగలిగినట్లు, దానితో గౌతమ బాలవిహార్ ఆవరణలో ఒక ఆడిటోరియంని నిర్మించుచున్నట్లు ఆబాలవిహార్ ఏర్పాటు చేసిన ఒక బహిరంగసభలో బాలవిహార్ కార్యదర్శి శ్రీ జె షణ్ముగరెడ్డి ప్రకటించటం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది

ఈ బాలవిహార్‌కు కార్యదర్శిగా వ్యవహరిస్తున్న శ్రీ జె షణ్ముగరెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా ప్రమోషన్ మీద శ్రీకాకుళం బదిలీ అయినా, బాలవిహార్‌ను అడ్డంపెట్టుకొని తీవ్రంగా కృషిచేసి డామ్ సూపరింటెండింగ్ ఇంజనీరు పి ఏ గా నియుక్తులై ఆ స్థానంలోనికి వచ్చిన దగ్గరనుండి అధికార దుర్వినియోగం చేసి ఈ షెడ్డును మాయంచేసినట్లు స్థానికులు భావిస్తున్నారు.

కేవలం నామమాత్రం అద్దెతో సర్వహంగులతో ప్రభుత్వ ఆధీనంలో హిల్ కాలనీలోనే "రంగనాధ రంగశాల' అను ఆడిటోరియంలోనే "రంగనాధ రంగశాల" అను ఆడిటోరియం వుండగా ఇంత భారీ వ్యయంతో అధికార దుర్వినియోగం చేసి అనుమతి లేకుండా ప్రభుత్వ ఆస్తులను తరలించి హిల్ కాలనీలోనే పరోక్ష ప్రైవేటు ఆడిటోరియంను నిర్మించవలసిన అవసరం ఎంతమాత్రం కనిపించుట లేదని ఇరువురు శాసన సభ్యుల అభిప్రాయ పడ్డారు

పైగా దక్షిణ విజయపురిలోనే 30 వేల రూపాయల విలువగల ఒక పంటును పగలగొట్టి దాని చెక్కలను బాలవిహార్‌లో నిర్మిస్తూన్న ఆడిటోరియం నిర్మాణమునకు తరలించుటకూడా జరిగినట్లు తెలియుచున్నది ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు ఎన్ని తరలించ బడ్డాయో అనూహ్యంగా వున్నదని శ్రీయుతులు రామశర్మ, నిమ్మల రాములు అన్నారు.

కాంగ్రెస్ పార్టీ పునర్వ్యవస్థీకరణ

—శ్రీ వి. బి. రాజు వెల్లడి

లక్నో, సెప్టెంబరు 11

ప్రజా బాహుళ్యంలో ఒక పార్టీగా మనగలగడానికి, నూతన స్వరూపం నూతన ఉత్సాహం యిచ్చేందుకుగాను కాంగ్రెసును పునర్ వ్యవస్థీకరించడం జరుగుతుందని ఎ ఐ సి సి ప్రధాన కార్యదర్శి శ్రీ వి బి రాజు తెలియచేశారు

నిన్న యిక్కడ ఒక పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ ఎ. ఐ సి సి యిప్పటికే అన్ని స్థాయిలలోను ఎన్నికలు జరపడానికి నిర్ణీత కార్యక్రమాన్ని నిర్ణయించడం జరిగిందని, వచ్చే సంవత్సరం జనవరి నాటికి ఎన్నికలు పూర్తి చేయబడతాయని, వాస్తవానికి గత 8 సంవత్సరాల నుండి పార్టీ శాఖలకు ఎన్నికలు జరగలేదని ఆయన అన్నాడు

పార్టీ అంతరంగిక ప్రజా స్వామ్యాన్ని పునరుద్ధరించుటకు పార్టీని పునర్ వ్యవస్థీకరించటం జరుగుతుందని అందువల్ల సంస్థ సరళంగా నడవటానికి సహాయ పడుతుందని తెల్పారు

గత 33 సంవత్సరాలుగా పార్టీ ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో నిమగ్నమై వుండటం వలన ఇప్పుడు రాజకీయ కార్యక్రమాలు నిర్వహించే పార్టీగా మార్చాలని నాయకత్వం నిర్ణయించిందని అన్నాడు.

లోక్‌సభ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పరాజయాన్ని గురించి ఆయన ప్రస్తావించి దేశ ప్రజలు కాంగ్రెస్ ప్రతిపక్షంగా వుండాలని నిర్ణయించారని, కనుక గట్టి ప్రతిపక్షంగా వ్యవహరించుటకు పార్టీ మరింత సమరశీల రాజకీయ పార్టీగా మార్పు చేయాల్సి వుందని అన్నారు.

కాంగ్రెస్‌కు కర్నాటక శాసనసభ్యుని రాజీనామా

గుల్బర్గా, సెప్టెంబరు 11

కర్నాటక శాసనసభ్యులు శ్రీ మహేంద్ర కుమార్ కల్లప్ప నిన్న కాంగ్రెసుకు రాజీనామా చేశారు.

పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటిస్తూ రాజీనామా విషయాన్ని టెలిగ్రాం ద్వారా ముఖ్యమంత్రి శ్రీ అర్స్, పి.సి.సి అధ్యక్షులు శ్రీ కె హెచ్ పాటిల్‌కు పంపానని అన్నారు

తాను జనతాపార్టీలో చేరే అవకాశం లేకపోలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

సికింద్రాబాద్ డివిజన్‌లో ఆస్తిపన్ను విపరీతంగా పెంపుదల: శ్రీ అమ్‌లోక్ రాం ఖండన

హైదరాబాద్, సెప్టెంబరు 11

సికింద్రాబాద్ డివిజన్‌లో ఆస్తిపన్నుతిరిగి మదింపు సందర్భంగా పన్నును విపరీతంగా పెంచటాన్ని నగర కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ అమలోక్ రామ్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఉదాహరణకు మెట్టుగూడలో పన్నులను సగటున రెట్టింపు చేయడం జరిగిందని ఆయన తెలిపారు

మెట్టుగూడ రైల్వే, ఆర్ టి సి యితర పరిశ్రమల కార్మికులు నివసించే ప్రాంతం. వీరంతా షెడ్యూలు కులాలకు, తరగతులకు, వెనుకబడిన తరగతులకు, యితర బలహీన వర్గాలకు చెందినవారు.

ఈ ప్రాంతంలో డ్రైనేజి, వీధి దీపాలు, మంచినీటి కుళాయిలు, గ్రంథాలయం యువకులకు క్రీడాస్థలం తదితర పౌర సౌకర్యాలు మృగ్యం. వీటిని తక్షణం ఏర్పాటు చేయవలసివుంది దశాబ్దాలుగా మునిసిపల్ అధికారులు వీటిని పట్టించుకున్న పాపాన పోలేదు.

అందుచేత పాత పన్నుల పద్దతిని కొనసాగించాలని, వీధి దీపాలు డ్రైనేజి యూత్ క్లబ్ [తిలక్ మెమోరియల్ క్లబ్ పేరుతో మంజూరై దీర్ఘకాలంగా అమలుజరుపకుండా వున్న] నిర్మాణం, తదితర సౌకర్యాలను తక్షణం కల్పించాలని కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తున్నదని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీమతి గాంధీ పట్ల శ్రీ జగన్నాధ మిశ్రా విశ్వాసం

కటిహార్ [బీహార్], సెప్టెంబర్ 11

శ్రీమతి గాంధీ నాయకత్వం పట్ల బీహార్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ జగన్నాథ మిశ్రా తన విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ శ్రీమతి గాంధీ ఒక్కరే జాతీయ నాయకురాలని అభివర్ణించారు.

మొన్న యిక్కడ ఒక సమావేశంలో మాట్లాడుతూ శ్రీమతి గాంధీని అరెస్టు చేసినప్పటికి కాంగ్రెసు అవకాశాలు దెబ్బతినబోవని అన్నారు

ధరల పెరుగుదల, హరిజనులను వారి భూముల నుండి బేదఖలు చేయించటానికి వ్యతిరేకంగా సెప్టెంబరు 19 నుండి రాష్ట్ర వ్యాపితంగా ఆందోళన ప్రారంభిస్తామని అన్నారు.

రు. 12 లక్షలతో ఆడిటోరియం

ఒంగోలులో

(విశాలాంధ్ర విలేకరి)

ఒంగోలు, సెప్టెంబరు 11

రు 12 లక్షల వ్యయంతో ఒంగోలు పురపాలక సంఘం ఉన్నతపాఠశాలవద్ద ఖాళీమైదానంలో నూతనపద్దతులతో ఆడిటోరియంను నిర్మించనున్నట్లు ప్రకాశంజిల్లా కలెక్టరు శ్రీ ఆర్. వి. వైద్యనాధఅయ్యర్ తెలియజేశారు.

12 లక్షల రూపాయలలో తొమ్మిది లక్షల రూపాయలను ఫిలిం కార్పొరేషన్ వారు, రెండున్నర లక్షల రూపాయలను ప్రముఖ చలనచిత్ర నిర్మాత శ్రీ డి. రామానాయుడు ఇవ్వటానికి సంసిద్ధతను తెలియజేశారని, ప్రజలవద్దనుంచి అరలక్ష రూపాయలు వసూలు చేస్తామని ఆయన తెలిపారు

ఈ ఆడిటోరియంను రాజధానిలోని "రవీంద్రభారతి" నమూనాలో నిర్మించాలని నిశ్చయించారు.

నిర్మాణం చురుకుగా జరగడానికి జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. వి. వైద్యనాథ అయ్యర్ ఛైర్మన్‌గా, పురపాలక సంఘ స్పెషల్ ఆఫీసరు శ్రీ బి వీరయ్య వైస్ ఛైర్మన్‌గా జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసరు శ్రీ సి. పెంచలయ్య, కార్యదర్శిగా శ్రీయుతులు వి. సుబ్బారావు జనరల్ మేనేజర్ ఫిడ్కా అభివృద్ధి సంస్థ డా. బి వి ఎల్. నారాయణ, డి. రామానాయుడు, బి. బాలయ్య, మహమ్మద్ ఖాసింసాహెబ్, రామదర్ల అంజనేయులు సభ్యులుగా కమిటీఏర్పాటైంది

ఈజిప్టు రైలు ప్రమాదంలో 70 మందిమృతి

కైరో, సెప్టెంబరు 11

ఈజిప్టులో కైరో—అస్వాన్ రైలు గత గురువారంనాడు పట్టాలు తప్పి పడిపోయినందున 70 మంది మరణించారని వార్తా పత్రికలు నేడిక్కడ ప్రచురించాయి శిధిలాల నుండి 13 మృతదేహాలను బయటకు తీశారు.

అయితే రైల్వే మంత్రి అబ్దుల్ ఫతే అబ్దుల్లా గత రాత్రి ఒక ప్రకటన చేస్తూ ప్రమాదంలో 25 మంది మాత్రమే మరణించారని అన్నారు.

చీపురుపల్లి తాలూకాలో వర్షాభావం

శిస్తు రెమిషన్‌కై తాలూకా కమ్యూనిస్టుపార్టీ విజ్ఞప్తి

కర్లాం, సెప్టెంబరు 11

చీపురుపల్లి తాలూకాలో వర్షాభావంవల్ల నాటుపడకపని కొన్ని ప్రాంతాలలో వేసిన నాటు ఎండిపోతున్నాయని అందుచేత శిస్తు రెమిషన్ ప్రకటించాలని తాలూకా కమ్యూనిస్టు సమితి ఒక తీర్మానంలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది

సమితి సమావేశం ఈనెల 3న "కర్లాం"లో శ్రీ పి స్వాములు అధ్యక్షతన జరిగింది జిల్లా కమ్యూనిస్టుపార్టీ నాయకులు శ్రీయుతులు పైల కృష్ణమూర్తి ఎం. అప్పయ్యనాయుడు హాజరయ్యారు.

చేనేత కార్మికులకు నూలు రంగులు తదితరాలను సరసమైన ధరలకు సరఫరా చేయాలని కూడా సమావేశం తీర్మానించింది

పలు కేంద్రాల్లో సహకార బ్యాంకు ఉద్యోగుల సామూహిక నిరశన

విజయవాడ, సెప్టెంబర్ 11

తమ కోర్కెలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్ర ప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ పిలుపుపై ఈ నెల 7నరాష్ట్రవ్యాపితంగా సహకార కేంద్రబ్యాంకు ఉద్యోగులు సామూహిక నిరాహార దీక్షలు జరిపినటు వివిధ కేంద్రాల నుండి యిక్కడికి అందిన సమాచారం తెలుపుతోంది

ఈ సందర్భంగా వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు ట్రేడ్ యూనియనులు వారి సమ్మెకు తమ పూర్తి తోడ్పాటును ప్రకటించాయి.

వరంగల్ లో

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు ఈ నెల 7 న జరిపిన సామూహిక నిరాహార దీక్షలో 160 మంది పాల్గొన్నారు.

జిల్లాలో మొత్తం 350 మంది సమ్మె చేస్తున్నారు. రిలే నిరశనం కొనసాగుతోంది వరంగల్ బ్రాంచి పని మొత్తం బంద్ అయింది. ఈ పోరాటానికి సంఘీభావంగా కమర్షియల్ బ్యాంకు ఉద్యోగులు నిత్యం రిలే నిరశనలో పాల్గొంటున్నారు

నిరాహారదీక్ష సాగిస్తున్న వారిని జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ఎల్. వెంకటరామయ్య పరామర్శించారు

22 రోజులుగా పోరాటాన్ని దీక్షతో సాగిస్తున్నందుకు అభినందించారు ఉద్యోగులకు పార్టీ సంపూర్ణ సహకార మిస్తుందని అన్నారు

కరీంనగర్ లో

ఈ నెల 7 న కరీంనగర్‌లో 135 మంది ఉద్యోగులుసామూహికనిరాహారదీక్ష జరిపారు ఇంతకాలంగా ఉద్యమం సాగిస్తున్నప్పటికి ప్రభుత్వం ఉదాసీన వైఖరి వహించడం దారుణమని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ యం జనార్దనశర్మ అన్నారు.

రాజమండ్రిలో

న్యాయమైన కోర్కెల సాధనకు నిరవధిక సమ్మె రిలే నిరాహారదీక్షలు సాగిస్తున్న కో ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంకు ఉద్యోగులకు మద్దతుగా కో. ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఆవరణలో బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంటు శ్రీ వై. శ్రీనివాసరావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ హనుమంతరావు స్వాగతం చెప్పారు.

నగర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ కార్యదర్శి శ్రీ గార్లంక ముత్యంరాజు ఎల్. ఐ సి ఉద్యోగుల సంఘ కార్యదర్శి శ్రీపి వి. రామారావు ఎన్. జి ఓ సంఘ అధ్యక్షులు శ్రీ జి రామలింగేశ్వరరావు, పట్టణ కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ బానపల్లి వీరాస్వామి, మార్క్సిస్టుపార్టీ నాయకులు శ్రీ బి, ఎస్. బాలాజీదాసు, జిల్లా కమ్యూనిస్టు సమితి కార్యదర్శి శ్రీ ముక్కపూడి సూర్యనారాయణలు మాట్లాడుతూ తమ తమ సంస్థలు కార్మికసంఘాల తరఫున సహకార బ్యాంక్ ఉద్యోగుల సమ్మెకు మద్దతు ప్రకటించారు.

ఆలిండియా టెలిగ్రాఫ్ ఇంజనీరింగ్ 3 4 వ తరగతి ఉద్యోగుల సంఘాల తరపున కూడా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు మద్దతునిస్తూ ఆ సంఘాల కార్యదర్శులు శ్రీ జి, శ్రీరాములు, శ్రీ కె. కమలాకరరావులు ప్రకటించారు.

నర్సాపురంలో

పశ్చిమ గోదావరిజిల్లా నర్సాపురంబ్రాంచి సిబ్బంది ఈనెల 7వ తేదీన సామూహిక నిరాహారదీక్ష చేశారు నేటికి 21 రోజులుగా కో. ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంక్ సిబ్బంది సమ్మె చేస్తున్నందున సహకార రంగం కార్యక్రమాలు స్థంభించిపోయాయి. అనేక గ్రామాల సొసైటీ అధ్యక్షులు సిబ్బంది సమ్మెకు సంఘీభావంగా టెలిగ్రాములు పంపి ఈ సమస్య సత్వర పరిష్కారానికి పూనుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

ఇల్లెందులో

ఇల్లెందులో 7 న సామూహిక నిరాహార దీక్ష, బహిరంగసభ జరిగాయి

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు శ్రీ కె. అచ్యుతన్ అధ్యక్షత వహించారు

స్టేట్ బ్యాంకు ఉద్యోగుల తరపున శ్రీరాములు హాజరయారు

ఉద్యోగుల ఐక్యతకై అచ్యుతన్ ఉద్బోధించారు

సమ్మె గురించి శ్రీ సామయ్య ప్రసంగించారు

కర్నూలులో

కర్నూలుజిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగులు ఈనెల 8 వ తేదీన సామూహిక నిరాహార దీక్షలు జరిపారు

వాణిజ్య బ్యాంకులు, కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులు ప్రాధమిక వ్యవసాయ బ్యాంకుల సిబ్బంది ఈ రోజు సహకార బ్యాంకు ఉద్యోగులకు సంఘీభావంగా సమ్మె చేయాలని నిర్ణయించారు. కర్నూలులోని అన్ని ట్రేడ్ యూనియన్ల నాయకులు తమ పూర్తి తోడ్పాటునిచ్చారు

అల్లవరం యం యల్.ఏ. విజ్ఞప్తి

సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెవల్ల వ్యవసాయ పెట్టుబడి రుణాలు సకాలంలో అందక ఇబ్బందులకు గురైన చిన్న వ్యవసాయ దారులను ఆదుకొనడానికి ముఖ్యమంత్రి వెంటనే జోక్యంచేసుకుని వారి సమస్యలను పరిష్కరించవలసిందిగా అల్లవరం శాసనసభ్యులు శ్రీ విష్ణు ప్రసాదరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

అమలాపురంలో

అమలాపురంలో ఈ నెల 8 న సహకార బ్యాంకు ఉద్యోగులు సామూహిక నిరాహార దీక్షలు జరిపారు.

ఈ నిరాహార దీక్షలో స్టేట్ బ్యాంకు ఆఫ్ హైదరాబాద్ ఉద్యోగులు శ్రీయుతులు పి. సీతారాములు, వై. వెంకటేశ్వర్లు కూడా పాల్గొన్నారు.

అదే సమయంలో రాష్ట్ర ఇరిగేషన్ మంత్రి శ్రీ పి వెంకట్రావు యిక్కడికి వచ్చిన సందర్భంగా ఆయన నిరాహార దీక్ష చేస్తున్న బ్యాంకు ఉద్యోగులను కలుసుకొని తన సానుభూతి తెలుపుతూ, సమస్యల పరిష్కారానికి సాధ్యమైనంత కృషి చేస్తానని హామీ యిచ్చారు.

అల్లవరం శాసన సభ్యులు శ్రీ మోకా విష్ణుప్రసాదరావు బ్యాంకు సిబ్బంది సమ్మె శిబిరాన్ని సందర్శించి తన తోడ్పాటును ప్రకటించారు.

తాలూకా వ్యవసాయ కార్మిక సంఘం తోడ్పాటు

అమలాపురంలో ఈ నెల 8న శ్రీ నేతపూడి సూరన్న అధ్యక్షతన జరిగిన తాలూకా వ్యవసాయ కార్మికుల సభ సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు తోడ్పాటు ప్రకటించింది.

హైదరాబాద్‌లో

ఇక్కడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ముందు ఈ నెల 7 న జరిగిన సామూహిక నిరాహార దీక్షలో 160 మందికి పైగా ఉద్యోగులు పాల్గొన్నారు వారికి సంఘీభావంగా 12 స్థానిక బ్యాంకుల ఉద్యోగులు కూడా పాల్గొన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా వారు అర్ధగంటసేపు ప్రదర్శన జరిపారు.

ప్రవాసాంధ్రులకు కాలేజీలలో సీట్లు

అంతర్జాతీయ తెలుగు సంస్థ విజ్ఞప్తి

హైదరాబాద్ సెప్టెంబరు 11

రాష్ట్రం వెలుపల, విదేశాలలో స్థిర నివాసం ఏర్పరచుకొన్న తెలుగు ప్రజలకు రాష్ట్రంలోని ప్రతి మెడికల్ ఇంజనీరింగ్ కళాశాలలో రెండేసి సీట్లు రిజర్వు చెయ్యాలని అంతర్జాతీయ తెలుగుసంస్థ గవర్నింగుబోర్డు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విదేశాలలోని తెలుగు ప్రజలకు మెడిసిన్‌లో మూడు సీట్లు, ఇంజనీరింగులో మూడుసీట్లు, యితర రాష్ట్రాలలో నివసిస్తున్న తెలుగు వారికి మెడిసిన్ ఇంజనీరింగులలో మూడేసి సీట్లు రిజర్వు చేసింది

ఇతర రాష్ట్రాలలో, విదేశాలలో తెలుగు వారు ఎక్కువగా వున్నందువల్ల ఈ సీట్ల సంఖ్యను రెట్టింపు చేయాల్సిందిగా బోర్డు విజ్ఞప్తి చేసింది

విదేశాలలో నివసించే తెలుగు వారికై అగ్రికల్చర్‌లో ఆరు సీట్లు వెటర్నరీ సైన్సులో నాలుగు సీట్లు హోమ్ సైన్సులో రెండు సీట్లు రిజర్వ్ చేయాలన్న ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్ణయంపట్ల గవర్నింగు బోర్డు హర్షం వ్యక్తపరిచింది

తెలుగు భాషకు ఎంతో సేవచేసిన కందుకూరి రాధాకృష్ణన్, మాడపాటి,సి పి బ్రౌన్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య వంటి వారి గురించి రెండు నెలలకొకసారి ప్రసంగాలను నిర్వహించేందుకు రు 1 లక్షతో ఒక నిధిని ఏర్పరచాలని కూడా బోర్డు నిర్ణయించింది వివిధ రంగాలకు చెందిన వ్యక్తులను ఇంటర్వ్యూ చేసి వారి వాణిని భావితరాల వారికై భద్రపరిచేందుకు సంభాషణలను టేప్ చెయ్యాలని కూడా బోర్డు తలపెట్టింది

చించినాడలో మార్క్సిస్టులకు చుక్కెదురు

నర్సాపురం సెప్టెంబరు 11

గత 25సంవత్సరాలుగాఎదురులేనితిరుగులేని విధంగావున్న చించినాడలో మార్క్సిస్టులకు ఇటీవలి పరిణామాలు చుక్కెదురు కావడం మైనారిటీవర్గాలపై వికృతమైన దాడులు, దౌర్జన్యాలు ప్రారంభించారు ఈ అల్లకల్లోలమైన వాతావరణం నుండి బయటపడాలని ప్రశాంత జీవితం నెలకొనాలని చించినాడ ప్రజలు తహ తహ లాడుతున్నారు.

యువజనసంఘం, రైతు సంఘం గ్రామాభివృద్ధి సంఘాలఆధ్వర్యాన సంయుక్తంగాయావత్తువివరాలతోకరపత్రంవిడుదల చేయబడింది.

రైతు సంఘ వ్యవస్థాపక దినోత్సవాలు

ఆదిలాబాదు సెప్టెంబరు11

ఈ నెల 1 వ తేదీన ఆసిఫాబాదు కొమ్ముగూడ, ఎద్దెల్లి, ఖైరగాన్, ఇందులవాడ్‌లలో రైతుసంఘ వ్యవస్థాపక దినోత్సవాలు జరిగాయి

ఈ ఉత్సవాల సందర్భంగా జరిగిన సమావేశాలలో ఆదిలాబాదు జిల్లా రైతు సంఘ కార్యదర్శి శ్రీ పి. నరసయ్య ప్రసంగించారు.

రైతుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యత యిచ్చి పరిష్కరించాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

గాంధీజయంతి సందర్భంగా గ్రామీణాభివృద్ధి వారోత్సవాలు

గ్రామాభివృద్ధి శాఖ మంత్రి వెల్లడి

అవనిగడ్డ, సెప్టెంబర్ 11

గాంధీ జయంతి (అక్టోబర్ 2) నాటికి కృష్ణా గుంటూరు జిల్లాల్లో 300 వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పనున్నట్లు రాష్ట్ర విద్యా మంత్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు యిక్కడ చెప్పారు.

గత శనివారం యిక్కడ వయోజన విద్యా సదస్సును ఆయన ప్రారంభోత్సవంచేస్తూ ఈ 300 కేంద్రాలలో 9 వేలమందిని అక్షరాస్యులను చేయడం జరుగుతుందన్నారు. ప్రతి బ్లాకుకు 100 కేంద్రాలను నెలకొల్పాలన్న ప్రతిపాదన కూడా వుందని మంత్రి చెప్పారు. నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రభుత్వ కృషితోపాటు ప్రజలు కూడా సహకరించాలన్నారు.

సదస్సుకు జవహర్ లాల్ నెహ్రూ సాంకేతిక విద్యాలయం వైస్ ఛాన్సలర్ శ్రీ యం. వి. రాజగోపాల్ అధ్యక్షత వహించారు. విద్యామంత్రి అధ్యక్షునిగా నెలకొల్పబడిన రాష్ట్ర వయోజన విద్యాసంస్థ సర్వతోముఖాభివృద్ధిని కాంక్షించారు.

రాష్ట్ర వయోజన విద్యా ప్రత్యేకాధికారి శ్రీ జి గోపాలకృష్ణ కేంద్రంలో జరుగుతున్న అభివృద్ధి ప్రణాళికలను సమీక్షించారు రాష్ట్రంలో వయోజన విద్యా వ్యాప్తికై ఎక్కువ మొత్తాలను కేటాయించాల్సిన అవసరముందన్నారు.

ఆంధ్ర యూనివర్శిటీ వయోజన విద్యా శాఖాధ్యక్షులు డాక్టర్ సుబ్బారావు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య. కె. నాగేంద్రుడు, గుంటూరు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ ఇస్కా వసంతకుమార్ ప్రసంగించారు. చిలకలూరిపేట ఎ యం ఒ ఇంటర్నేషనల్ డైరెక్టర్ శ్రీ యస్. జాన్ డేవిడ్ స్వాగతం చెప్పారు ఈ సదస్సు దివిసీమ వయోజన విద్యా సమితి, ఎ. యం. ఒ మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యాన జరిగింది.

ఈ సందర్భంగా నర్సరావుపేట ఎ. ఒ. యం. మిషన్ ఆధ్వర్యాన వయోజన విద్యపై ఏర్పాటు చేసిన ప్రదర్శన శాలను మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

(వి. వి)

మానుకోట తాలూకా తాసిల్దారు కార్యాలయం ముందు రిలే నిరశనలు

తాలూకా రైతుసంఘం అధ్వర్యాన

మానుకోట, సెప్టెంబరు 11

నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, భూసంస్కరణల చట్టాన్ని సత్వరం అమలుచేసి మిగులు భూములను పేదలకు పంచాలనిడిమాండ్ చేస్తూ వరంగల్‌జిల్లామానుకోటతాలూకా రైతుసంఘంఅధ్వర్యాన నిన్న 15 మంది రిలే నిరాహారదీక్షలు జరిపారు.

తాలూకా రైతుసంఘం కార్యదర్శి శ్రీ వి. రాధాకృష్ణ నాయకత్వాన జరిగిన ఈ రిలే నిరాహారదీక్షలో శ్రీయుతులు నారాయణరెడ్డి, బండి లక్ష్మయ్య, జి. అంజయ్య, ఐ. బుచ్చయ్య, ఎ. యెల్లయ్య, బి మల్లయ్య, డి. లచ్చన్న, కె, యెల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు తాలూకాపార్టీ కార్యాలయంనుండి 100 మంది ప్రదర్శనగా తాసీల్దారు కార్యాలయం వద్దకు వెళ్ళారు. తాలూకాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, గ్రామాలలో చౌక డిపోలు ప్రారంభించాలని, చౌక డిపోల ద్వారా నిత్యావసర వస్తువులను అమ్మించాలని నినాదాలు చేశారు

అనంతరం తాలూకా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి శ్రీ సంగు సరసయ్య, యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ యెర్రాజు లక్ష్మినారాయణ తదితరుల నాయకత్వాన ఒక ప్రతినిధివర్గం తాసీల్దారుకు మెమోరాండం అందచేసింది. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని భూసంస్కరణలను సత్వరం అమలుచేయాలని, కౌలుదార్లను పట్టాదార్లుగా చేయాలని, సన్నకారు రైతులకు, చేతి వృత్తులవారికి, వ్యవసాయ కూలీలకు వ్యక్తిగత అప్పులమంజూరు చేయాలి, రుణ విమోచన చట్టం అమలు చేయాలని చినముప్పారం, అప్పరాజుపల్లి, మెదిరాజుపల్లి, కంబాలపల్లి గ్రామాలలోని అడవులు లేని భూములను అడవులనుండి విడగొట్టి పేదలకు పంచాలని, ఇళ్ళులేని వారందరికి ఇళ్ళ స్థలాలు మంజూరు చేయాలని మెమోరాండంలో కోరారు

బీడీ, సిగరెట్ల ఉత్పత్తి పెరుగుదల

మద్రాసు, సెప్టెంబరు 11

ధూమపానం ఆరోగ్యానికి హాని చేస్తుందని చట్టబద్ధంగా హెచ్చరిక చేస్తున్నప్పటికీ దేశంలో సిగరెట్ల ఉత్పత్తి పెరుగుతున్నది.

1971లో 6,578కోట్ల సిగరెట్లఉత్పత్తి కాగా, 1976లో 6 800 కోట్ల సిగరెట్లు ఉత్పత్తి అయినట్లు అంచనా వేయబడిందని పొగాకు అభివృద్ధి డైరెక్టరేట్ ప్రతినిధి నిన్న ఇక్కడ తెలియ చేశారు.

బీడీల ఉత్పత్తికూడా పెరిగిందని ఆయన అన్నారు.

1975–76లో 42కోట్ల బీడీలు ఉత్పత్తి అయ్యాయని ఆయన తెలిపారు.

గాలి, వెలుతురుకోసం బెల్లంపల్లి గని కార్మికుల పోరాటం

సమ్మెకు హెచ్చరిక

కొత్తగూడెం, సెప్టెంబరు 11

బెల్లంపల్లి గనుల్లో మోర్గాన్ పిట్ వద్ద గాలి, వెలుతురువచ్చే తగిన ఏర్పాట్లు లేనందున కార్మికులు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. ఈ విషయమై యూనియన్ గురువారం సమ్మె నోటీసిచ్చింది.

భూగర్భంలో పనిచేస్తూనే కొందరు స్పృహతప్పిపడిపోతున్నారు. దీనితో గత నెల 28 వ తేదీన పిట్‌వద్ద కోల్‌ఫిల్లర్లు పని నిలిపివేసి తమ సమస్యలను మేనేజిమెంటుకు నివేదించింది వారి విషయం పరిశీలించలేదు కాని గని తనిఖీ చేయాలని సంక్షేమాధికారిని కోరింది

తనిఖీకి వచ్చిన అధికారి భూగర్భంలో ఉక్కను భరించలేక బయటకి వచ్చేశారు

ఈ లోగా వర్కర్స్ యూనియన్ జోక్యం చేసుకుని తగిన గాలి వెలుతురూ వచ్చే ఏర్పాటు చేయాలని కోరింది. పదిరోజుల్లో చేయగలమని మేనేజ్‌మెంటు తెలిపింది. అనంతరం యూనియన్ నాయకుల మాటపై కార్మికులు 28 వ తేదీ రెండవ షిప్టుకు వెళ్ళారు. మర్నాడు ఉదయం శిక్షణ పొందే కార్మికులను పనికి అనుమతించలేదు దీనితో డ్యూటీకి వచ్చేందుకు సీనియర్ కార్మికులు కూడా నిరాకరించారు. శిక్షణ పొందుతున్న వారిని కూడా వెంటనే డ్యూటీలోకి అనుమతించాలని డిమాండ్ చేశారు కాని యాజమాన్యం నిరాకరించింది ఫలితంగా పని నిలుపుదల కొనసాగుతోంది

ఇది కవ్వింపు చర్య అని యూనియన్ విమర్శించింది, సమస్య పరిష్కారానికి అనేక స్థాయిలలో ప్రయత్నించింది ఫలితం లేకపోయింది.

శిక్షణ పొందేవారితో సహా ఫిల్లరను డ్యూటీలో చేర్చుకోవాలని పని నిలుపుదల కాలానికి వేతనాలివ్వాలని, లేఆఫ్‌కు గురైన కార్మికులకు నష్ట పరిహారం చెల్లించాలని, పగ సాధింపులు కూడదని డిమాండ్ చేస్తూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ సమ్మె నోటీసు యిచ్చింది,

ఈ నెల 20 లోగా పరిష్కారం జరగక పోతే అన్ని డిపార్టుమెంట్ల లోని కార్మికుల నిరవధిక సమ్మె చేస్తారని తెలిపింది,

రాష్ట్రవ్యాపితంగా జనరల్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల నిరశనలు

హైదరాబాద్, సెప్టెంబర్ 11

అఖిలభారత జనరల్ ఇన్సూరెన్స్ ఉద్యోగుల సంఘ పిలుపు మేరకు ప్రావిడెంట్ ఫండ్ ఒరిజినల్ రేటుపునరుద్దరణ, 74 75 76 సంవత్సరాలకు 20 శాతం బోనస్ వగైరా డిమాండ్ల సాధనకై హైదరాబాద్‌లో రాష్ట్రంలోని యితర ప్రాంతాలలో దక్షిణ మండలం జనరల్ ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యాన నిన్న ఒకరోజు నిరాహార దీక్షలు జరిగాయి

అఖిలభారత జనరల్ ఇన్సూరెన్స్ వుద్యోగుల అసోసియేషన్‌ను గుర్తించాలని టారిఫ్ సలహాసంఘాన్ని జనరల్ ఇన్సూరెన్సు కార్పొరేషన్‌లో విలీనం చేయాలని అత్యవసర పరిస్థితి కాలంలో ఏకపక్షంగా విధించిన ప్రవర్తనా నియమావళిని తొలగించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు

హైదరాబాదులో నిరాహారదీక్షా శిబిరం వద్ద వుద్యోగుల నుద్దేశించి హైదరాబాదు డివిజన్ ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పి ఎస్. మూర్తి సిటీ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సహాయ కార్యదర్శి శ్రీ పి. నాగేశ్వరరావు ప్రసంగించారు.

విజయవాడలో

అఖిలభారత జనరల్ ఇన్సూరెన్సు ఎంప్లాయీస్ అసోసియేషన్ పిలుపు మేరకు విజయవాడలో ఓరియంటల్ ఫైర్ అండ్ జనరల్ ఇన్సూరెన్సు కంపెనీ కార్యాలయంముందు జనరల్ ఇన్సూరెన్సు వుద్యోగులు నిన్న మధ్యాహ్నం 2 గంటల నుండి 24 గంటల నిరాహార దీక్షలు చేశారు

స్థానిక ట్రేడ్‌యూనియన్ నాయకులు శ్రీయుతులు యం ఆర్ మోహన్‌రావు, వెల్లంకి సుబ్బారావు, జి కృష్ణమూర్తి నిరాహార దీక్షల శిబిరంవద్దకు విచ్చేసి తమ సంఘీభావాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు

ప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. కేశవరావు కూడా శిబిరాన్ని సందర్శించారు.

బందరులో ఎల్. ఐ. సి. ఉద్యోగుల సమ్మె

బందరు, సెప్టెంబరు 11

ఎల్ ఐ సి ఉద్యోగులు నిన్న ఇక్కడ జరిపిన గంటసేపు సమ్మె జయప్రదం అయ్యింది,

ఆ తర్వాత జరిగిన సభలో ఇన్సూరెన్సు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ పి. సిరాజుద్దీన్, ఇన్సూరెన్సు కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. కె. డి, హనుమంతరావు, బి. యం ఎస్ యూనియన్ కార్యదర్శి శ్రీ కె. పి. శాస్త్రి బి ఎన్ టి యు. సి. నాయకులు శ్రీ వి. యస్, కృష్ణమూర్తి ప్రసంగించారు.

ఆఫీసర్లతోసహా అన్ని తరగతులకు చెందిన ఉద్యోగులు ఐక్యంగా ప్రదర్శనలో పాల్గొన్నారు

తాత్కాలిక సిబ్బందికి కూడా అడిషనల్‌చార్జి అలవెన్సు

హైదరాబాద్ సెప్టెంబర్ 11

ప్రొబేషన్ అప్రూవ్ కాని సిబ్బందికి, తాత్కాలిక ఉద్యోగులకు అడిషనల్‌చార్జి అలవెన్సు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు సంబంధించి జారీచేసిన వుత్తర్వు 1969 సెప్టెంబర్ 3 వ తేది నుండి అమలులోకి వస్తుంది ఇంతకుముందు అడిషనల్ అలవెన్సు చెల్లించిన కేసులు తిరిగి పరిశీలించబడవు పెండింగ్‌లో వున్న కేసులు ఈ వుత్తర్వు దృష్ట్యా పరిశీలించబడతాయి ఈ విషయమై హైదరాబాద్ సివిల్ సర్వీస్ రూల్సుకు ఫండమెంటల్ రూల్సుకు సవరణలు ప్రత్యేకంగా జారీ చేయబడతాయి.

10 లక్షల ప్రిమాక్విన్ బిళ్ళల విడుదల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

ఐ. డి పి. యల్. దేశమంతటా గల ప్రధాన మార్కెట్లకు 10 లక్షల ప్రిమాక్విన్ బిళ్ళలను విడుదల చేసింది

మలేరియా వ్యాధి నిరోధానికి ఈ బిళ్ళలు పనిచేస్తాయి అయితే డాక్టర్ల సలహా పైననే వీటిని ఉపయోగించాలని అధికార ప్రకటన తెలిపింది.

'మతం-సమాజం'పై రాజమండ్రిలో గోష్ఠి

రాజమండ్రి, సెప్టెంబరు 7

అసమానతలు అసమానతలలా వుండడానికి, వేరు వేరు రూపాల లోని స్వార్థపర పాలక వ్యవస్థలను సజీవంగా వుంచి, కుల మత వ్యవస్థల పేరుతో నిరాటంకంగా దోపిడీ కొనసాగటానికి మత వ్యవస్థలు తోడ్పడ్డాయి మానవ సమాజంలోని హేతువాద జిజ్ఞాసని దృక్పథాన్ని సమాధి చేయడానికి మతం తోడ్పడింది. మతాధిక్యత పేరుతో వ్యక్తుల స్వార్థాలు కొనసాగడానికి మారణ హోమాలు చిరకాలంగా సాగించింది.

అయినా మానవ సమాజంలోని హేతువాద దృక్పథానికి సమాధి చేయలేకపోయింది

తత్వశాస్త్రాన్ని మతంగా మసిబూయడానికి మత కర్తలు చేసిన పని కాలక్రమంలో దుల్లిపోయి మానవుడు పురోగమిస్తున్నాడు. స్వామి వివేకానంద లాంటి ఉత్తమ తాత్వికులు సామాజిక సుఖశాంతులకు పోషకమైన వ్యవస్థ అవసరమని నొక్కి చెప్పిన విషయాన్ని మనం మరిచిపోరాదు సమాజం విజ్ఞానయుత పరిణామ క్రమంలో అభివృద్ధి చెందిందని స్వామి వివేకానంద ప్రవచించాడు. తత్వజ్ఞానం అనేది వ్యక్తి అనుభూతికి చెందినది. ఆర్థిక శాస్త్రం సమాజ అస్తిత్వానికి మనుగడకి చెందినది మతం పేరుతో ఆర్థిక విధానాలకి పేదరికానికి ఎదురు తిరగకుండా మానవుడిని జడరూపం చెందించే శుష్క వేదాంతాన్ని నిజమైన తాత్వికులు అంగీకరించలేదు. అందుకని చరిత్రలో మతం ఆధారాల పేరుతో జరిగిన దారుణ ఘటనలను అధ్యయనంచేసి, హేతువాద దృష్టితో, శాస్త్రీయ దృష్టితో సమాజ పరిస్థితులని అధ్యయనంచేసి సమాజ పురోగతిలో భాగస్వాములు కావడమే నేటి యువతరం కర్తవ్యం అని శ్రీ వరదా బ్రహ్మానందం ఈ నెల 4 వ తేదీన శ్రీరాంపేట గ్రంథాలయంలో రామన్ స్టడీసర్కిల్ సభలో మతం-సమాజం అన్న విషయంపై మాట్లాడుతూ చెప్పారు.

శ్రీ కె. మాణిక్యాలరావు స్వాగతం చెప్పారు. శ్రీ కె. శ్రీధర్ నివేదిక సమర్పించారు.

శ్రీయుతులు పోతుకూచి సూర్యనారాయణమూర్తి (అడ్వకేట్) వి. ఎస్ శాస్త్రి, వి. లక్ష్మణరావు, టి. మాధవరావు వి వి ఆర్. సోమయాజులు, కె. సత్యయ్య బి. చిట్టిబాబులుకూడా ప్రసంగించారు

శ్రీ వి. హెచ్. గాంధి వందన సమర్పణ చేశారు.

ఎన్. వెంకట్రావు అభినందన సభ

రాజమండ్రి, సెప్టెంబరు 11

ఉపాధ్యాయ దినోత్సవ సందర్భంగా స్థానిక రాజ్యలక్ష్మి కళాశాలలో ఈనెల 5వ తేదీన శ్రీ ఎన్. వెంకట్రావు అభినందన సభ జరిగింది.

సభకు ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం అధ్యక్షత వహించారు.

కళాశాల కరస్పాండెంటు, కార్యదర్శి శ్రీ సాదనాల నరసింహమూర్తి ముఖ్య అతిధి శ్రీ వెంకట్రావును పరిచయంచేస్తూ సాహితీ వేత్తగా, ఉత్తమ అధ్యాపకునిగా శ్రీ వెంకట్రావు విద్యారంగానికి చేసిన సేవలను వివరించారు.

తొలుత కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి ఎల్. బుచ్చిసుందరం స్వాగతం చెప్పారు.

(వి. వి.)

రేడియో

మంగళవారం - సెప్టెంబరు 13

శక 1899 శ్రీ. భాద్ర 22

హైదరాబాదు—ఎ

ప్రసారము

6.00 వందేమాతరం; 6.55 ప్రకాశం జిల్లా సమాచారలేఖ, 7.15 సంగీతమధుర మదురై మణి అయ్యర్ : గానం 7 30 ఈ పాట నేర్చుకుందాం, 7 45 చిత్రసీమ, 8 30 బి లక్ష్మిదేవి వీణ, 9 00 ప్రసార సమాప్తి

ప్రసారము II

11-30 ప్రాథమిక పాఠశాలలకు 11 45 ఉన్నత పాఠశాలలకు 12 05 బి లక్ష్మిదేవి : వీణ 1 00 చిత్రసీమ; 1 10 హిందీ పాఠం 2.10 హైస్కూళ్లకు 2 30 ప్రసార సమాప్తి.

ప్రసారము III

5 30 వాద్యగోష్ఠి 8 00 అనార్కలి—నాటకం, రచన ముద్దుకృష్ణ 8 30 ప్రసంగం, 8 45 జానపదగేయాలు 9 30 నేషనల్ ప్రోగ్రాం 9 45 రాగం, తానం, పల్లవి 10 30 ప్రసారసమాప్తి

విజయవాడ

ప్రసారము I

5.55 వందేమాతరం 6 55 జిల్లా సమాచారలేఖ 7.30 హిందీపాఠం, 7 45 చిత్రరంగిణి 8 30 అరిపిరాల సత్యనారాయణమూర్తి వయొలిన్ 9.00 ప్రసార సమాప్తి.

నిర్ణయాలు వాయిదావేసే జనతాపార్టీ పద్ధతి

శ్రీ బ్రహ్మానందరెడ్డి విమర్శ

బొంబాయి, సెప్టెంబరు 10

ప్రజా సమస్యలపై జనతా పార్టీ తన నిర్ణయాలను వాయిదా వేస్తున్నదని కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బ్రహ్మానందరెడ్డి నేడు యిక్కడ పత్రికల వారితో అన్నారు.

ప్రతి రోజూ, ప్రతి వారం నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయి దానిలో చాలా వరకు అర్థం కావడం లేదని ఆయన అన్నారు. "మీరు ఏమి ప్రతిపాదించ దలచుకున్నారని అడిగితే, అక్టోబరు 15 వరకు నిరీక్షించండి, అని జనతా పార్టీ చెపుతున్నది అని శ్రీ బ్రహ్మానంద రెడ్డి అన్నారు.

"ఇటువంటి కీలక సమస్యలపై ప్రభుత్వం తన నిర్ణయాలన్నీ వాయిదావేస్తే దేశం ఏమౌతుంది? పేద ప్రజలు ఏమౌతారు? ప్రభుత్వం నిర్ణయం తీసుకొనేవరకూ ఆకలి మంటలతో బాధ వేచిచూస్తారా" అని ఆయన ప్రశ్నించారు.

పదేళ్ళలో నిరుద్యోగాన్ని నిర్మూలిస్తానని ప్రధాని శ్రీ మొరార్జీ దేశాయ్ ఇటీవల చేసిన ప్రకటనపట్ల ఆయన సందేహం వ్యక్తం చేశారు.

"ఇంతటి బృహత్తర సమస్యను పరిష్కరించటానికి జనతాపార్టీకి ఎటువంటి స్థూలమైన నిర్ధారణలేదు. ఏమి చర్య తీసుకో దలచు కున్నారని అడిగినప్పుడల్లా వచ్చే ఏప్రిల్ వరకు ఆగండి" అని జనతాపార్టీ సమాధాన మిస్తున్నదని ఆయన అన్నారు.

"దేశంలో 80 శాతం ప్రజలు సతమత మౌతున్న ఈ సమస్యను ఒక ప్రభుత్వం పరిష్కరించకపోతే, అది చేసే పనేమిటి" అని ఆయన అన్నారు.

ప్రభుత్వ ప్రయత్నాలను వ్యతిరేకించడం తమ ఉద్దేశం కాదని, దేశ, ప్రజల ప్రయోజనాలపై కలిసి ఆలోచించి సమస్యల ఉధృతిని తగ్గించాలనేదే తమ భావన అని ఆయన అన్నారు.

"ఆమెనే అడగండి"

శ్రీమతి గాంధీని గురించి అడిగిన ప్రశ్నలకు సమాధాన మిస్తూ, ఆమె యిప్పటికీ కాంగ్రెసు నాయకులలో ఒకరని, కార్య వర్గమూ, నిబంధనల సంఘం సభ్యురాలిగా వుందని శ్రీ రెడ్డి అన్నారు.

తాను కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నికైన దానికి శ్రీమతి గాంధీ తోడ్పాటుకు సంబంధించిన పరస్పర విరుద్ధ వార్తలను ప్రస్తావించగా 'జాకే ఉనసే పూఛో' (ఆమెనే అడగండి) అని అన్నారు.

కాంగ్రెసు నిధుల దుర్వినియోగం గురించి ప్రశ్నించగా నాకేమీ తెలియదని అన్నారు.

భుట్టో బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారంకు వాయిదా

లాహోర్, సెప్టెంబర్ 10

ఒక రాజకీయ ప్రత్యర్థిని హత్య చేసేందుకు పాక్ మాజీ ప్రధాని కుట్ర పన్నటానికి సంబంధించి సాక్ష్యాలు వున్నవని లాహోర్ హైకోర్టులో నేడు ప్రత్యేక ప్రాసిక్యూటర్ ఒకరు చెప్పారు.

1974 లో ఒక రాజకీయ ప్రత్యర్థిని హత్య చేశారన్న ఆరోపణపై గత శని వారం నాడు అరెస్టు చేయబడిన భుట్టో బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ స్పెషల్ ప్రాసిక్యూటర్ మహమ్మద్ అన్వర్ పై విషయం చెప్పారు.

బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా వేయబడింది.

మధ్యప్రదేశ్ విభజన కేంద్రమంత్రి అభిప్రాయం

భోపాల్, సెప్టెంబరు 10

మధ్యప్రదేశ్‌ను చిన్న రాష్ట్రాలుగా విడదీయటాని కనుకూలంగా ప్రజాభిప్రాయం పరిశీలనకు తీసుకోవలసినంత బలంగా లేదని కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ బ్రిజ్‌లాల్‌వర్మ నేడిక్కడ చెప్పారు.

చిన్న రాష్ట్రాల ఏర్పాటుకు అనుకూలంగా బలమైన ప్రజాభిప్రాయం గనుక వుంటే ఆ డిమాండ్‌ను తాను సమర్థించగలనని అన్నారు.

రాష్ట్రానికి చెందిన శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులలో మెజారిటీ మందిపైమేరకు ఒక తీర్మానాన్ని ఆమోదిస్తే రాష్ట్రాన్ని విడదీయటాని కనుకూలంగా అది బలమైన ప్రజాభిప్రాయమే అవుతుందని ఆయన అన్నారు

తంతి-తపాలా సిబ్బందికి బోనస్ చెల్లింపుకు మంత్రి తిరస్కృతి

భోపాల్, సెప్టెంబరు 10

తమకు కూడా బోనస్ చెల్లించవలసిందన్న తంతి-తపాలా ఉద్యోగుల డిమాండ్‌ను కేంద్ర కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ బ్రిజ్‌లాల్‌వర్మ నేడు తిరస్కరించారు.

తంతి తపాల శాఖలు సేవచేసే శాఖలు అని అవి ఉత్పత్తి ఫ్యాక్టరీలు కావని ఆయనన్నారు

టెలి కమ్యూనికేషన్‌ల శాఖకు రు 120 కోట్ల నుండి రు 150 కోట్ల వరకు లాభాలు వస్తాయి ప్రతి సంవత్సరం పోస్టల్ సర్వీసువల్ల దాదాపు రు 50 కోట్ల నష్టం వస్తుంది అని ఆయన చెప్పారు

నకిలీ డాక్టర్ అరెస్ట్

మంగళూరు, సెప్టెంబర్ 10

గత 7 మాసాలుగా ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు చికిత్సచేస్తూ ఇంజెక్షన్లు ఇస్తున్న ఒక నకిలీ డాక్టరును పోలీసులు అరెస్టు చేశారు.

ఈ నకిలీ డాక్టరు పేరు గణేశ్ పాయ్ అని ఒక ప్రైవేట్ డాక్టర్ వద్ద ఈ వ్యక్తి అటెండరుగా పని చేశాడని పోలీసులు చెప్పారు.

రోగులకు చికిత్సచేసే ఎటువంటి అర్హతా అతనికిలేదు. అతను మెట్రిక్యులేషన్ వరకు చదివినట్లు తెలుస్తున్నది

సెప్టెంబర్ 6 వ తేదీన ఆస్పత్రి ఆర్. యం. ఓ. ఆస్పత్రిలో వివిధ వార్డులను సందర్శిస్తూ ఈ బోగస్ వ్యక్తిని కనుగొన్నారు. గుర్తింపు కార్డును చూపవలసిందని గణేశ్ పాయ్‌ని ఆర్. యం. ఓ. కోరగా అతను చూపలేకపోయారు.

ఆస్పత్రిలో అధిక సంఖ్యలో పోస్టు గ్రాడ్యుయేట్లు, హౌస్ సర్జన్‌లు పని చేస్తున్నందువల్ల ఆస్పత్రిలో పనిచేసే డాక్టర్లను తనిఖీ చేయడం కష్టమైపోయిందని ఆస్పత్రి ప్రతినిధి ఒకరు చెప్పారు.

త్వరలోనే నూతన పారిశ్రామిక విధానం

శ్రీ ఫెర్నాండెజ్ వెల్లడి

కలకత్తా, సెప్టెంబరు 10

కేంద్రం త్వరలోనే నూతన పారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తుందని కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ జార్జి ఫెర్నాండెజ్ నిన్న యిక్కడ పేర్కొన్నారు.

ఇండియన్ ఇంజనీరింగ్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ, ఈ నూతన విధానం, వ్యవసాయ, కుటీర, లఘు పరిశ్రమల ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యత యిస్తుందని తెలిపారు.

ఇంజనీరింగ్ పరిశ్రమ అధికంగా వ్యవసాయ పనిముట్లను ఉత్పత్తి చేయాలని ఆయన అన్నారు దీనివల్ల వ్యవసాయానికే గాకుండా వివిధ అవాంతరా లెదుర్కొంటున్న ఇంజనీరింగ్ పరిశ్రమకూడా దోహద పడుతుందని పేర్కొన్నారు.

అమెరికా పర్యటనకు సోవియట్ టి.యు.ప్రతినిధివర్గానికి అనుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

గతంలో అమలులోవున్న విధానానికి భిన్నంగా అమెరికాలో నలుగురు సోవియట్ ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పర్యటించటాన్ని అనుమతించాలని కార్టర్ ప్రభుత్వం నిర్ణయించింది.

కమ్యూనిస్టు దేశాలకు చెందిన ట్రేడ్ యూనియన్ నాయకుల అమెరికా పర్యటనకు ఎ. యఫ్. ఎల్. సి. ఐ. ఓ. తీవ్ర అభ్యంతరం తెలిపినప్పటికీ పై నిర్ణయం తీసుకో బడింది.

ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం నుండి సోవియట్ ట్రేడ్ యూనియన్ నాయకుల అమెరికాలో పర్యటించటాన్ని అనుమతించ లేదు

హెల్సింకి ఒప్పందం క్రింద తూర్పు, పశ్చిమ దేశాల మధ్య మరింత సన్నిహిత సంబంధాలు నెలకొనేలా చూసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వవర్గాలు తెలిపాయి.

చికాగోకు చెందిన ఒక ట్రేడ్ యూనియన్ సంస్థ సోవియట్ ట్రేడ్ యూనియన్ నాయకులకు ఆహ్వానం పంపింది.

పాల ప్రాజెక్టు ఉద్యోగులకు 8 1/3 శాతం బోనస్

విజయవాడ, సెప్టెంబరు 10

కార్పొరేషన్ ఉద్యోగులకు దసరాలోగా 8⅓ శాతం బోనస్ చెల్లింపుకు మానేజింగ్ డైరెక్టరు అంగీకరించినట్లు డైరీ డెవలప్‌మెంటు కార్పొరేషన్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్సు యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ టి. చంద్రశేఖర్ ఆజాద్ ఒక పత్రికా ప్రకటనలో వెల్లడించారు.

దెబ్బతిన్న సీసాల ఖరీదు ఉద్యోగుల నుండి వసూలు చేయటంపై తీవ్ర ఆందోళన జరుగుతున్నది.

యాజమాన్య వైఖరికి నిరసనగా వేతనాలు తీసుకొనటానికి ఉద్యోగులు నిరాకరించారు. దీనిపై మానేజింగ్ డైరెక్టరు యూనియన్ ప్రతినిధులతో ఈనెల 8 వ తేదీన చర్చలు జరిపారు.

సీసాల ఖరీదులో 90 శాతాన్ని రద్దు చేయటానికి యం. డి. చర్చలలో అంగీకరించారు.

యూనిఫారము, కుట్టుకూలి ప్రతి ఒక్కరికీ రు. 22 యివ్వటానికి ఉత్తర్వులు జారీ చేశారు, కార్పొరేషన్ ఉద్యోగులలోని పేద ఉద్యోగుల కుటుంబాలకు కొత్త పాలబూత్‌లను కమిషన్ పద్ధతిపై యిచ్చేందుకు అంగీకరించారు.

ఇ యస్. ఐ హాస్పటల్‌లో వైద్య సౌకర్యంపై ఇ. యస్. ఐ. ఉన్నత అధికారులతో చర్చలు జరపడానికి యం. డి. అంగీకరించారు. ప్రమోషన్‌ల సందర్భంగా ఇంటర్వ్యూల పద్ధతి రద్దుచేసి సీనియారిటీని పరిగణనలోకి తీసుకొనటానికి అంగీకరించారు. మరికొన్ని యితర సమస్యలపై నిర్ణయాలు చేశారు.

80 కోట్లకు చేరిన నిరక్షరాస్యులు

పారిస్, సెప్టెంబర్ 11

ప్రపంచంలో చదువనూ, వ్రాయనూ చేతగానివారి సంఖ్య పెరుగుతోంది, ఇప్పుడా సంఖ్య 80 కోట్లకు చేరిందని యునెస్కో డైరెక్టర్ జనరల్ శాన్ ఫోబెస్ చెప్పారు,

ప్రతి ముగ్గురు వయోజనుల్లో ఒకరికి చదవడమెలాగో, వ్రాయడమెలాగో, లేదా ప్రాథమికమైన లెక్క అయినా కాగితంమీద చేయడమెలాగో తెలియదు అని ఇక్కడ యునెస్కో కేంద్ర కార్యాలయంలో 12 వ అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవ సభలో ఆయన తెలిపారు.

అంతకన్నా ఆందోళనకరమైనది, అనేక సమాజాలలో యువకులలో నిరక్షరాస్యత పెరుగుతోంది. ఈ ధోరణి కొనసాగితే 6 14 సంవత్సరాల గ్రూపులోపాఠశాలకు వెళ్ళని బాల బాలికల సంఖ్య వర్ధమాన దేశాల్లో 1985 నాటికి 13 కోట్ల 40 లక్షలకు చేరుతుంది. దానిలో మూడున్నర కోట్లు ఆఫ్రికాలో, 9 కోట్లు ఆసియాలో, 90 లక్షలు లాటిన్ అమెరికా దేశాల్లో వుంటారు.

ప్రపంచంలోని నిరక్షరాస్యుల్లో 60 శాతం మహిళలు.

ఎక్కువ నిరక్షరాస్యతవున్న దేశాలు పట్టుదలతో కృషిచేయకపోతే నిరక్షరాస్యుల సంఖ్యను తగ్గించాలన్న ప్రయత్నాలు నిరర్థకమవుతాయని ఫోబెస్ హెచ్చరించారు.

వేతనాల పెంపుకు తహశీల్‌దార్ల, డిప్యూటీ తహశీల్‌దార్ల విజ్ఞప్తి

(విశాలాంధ్ర విలేకరి)

విజయవాడ, సెప్టెంబరు 10

డిప్యూటీ తహసీల్‌దార్లు, తహసీల్‌దార్ల వేతన స్కేళ్ళను పునర్వ్యవస్థీకరించాలని యిక్కడ జరిగిన ఆంధ్రప్రదేశ్ తహసీల్‌దార్ల డిప్యూటీ తహసీల్‌దార్ల సదస్సు కోరింది.

సదస్సుకు మదిర తహసీల్‌దారు శ్రీ సి. యస్. రామచంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. బలహీన వర్గాల సంక్షేమ కార్యక్రమాల అమలు, యితర బాధ్యతలు పెరిగినందున వర్కులోడు విపరీతంగా పెరిగిందని వేతనాలను పెంచాలనిసదస్సు కోరింది. ప్రస్తుతం తహసీల్‌దార్ల రు. 530-1050 వేతనాన్ని రు. 700 1200గాను, డిప్యూటీ తహసీల్‌దార్లకు 430-800 వేతనాన్ని రు. 500 1000 గాను పెంచాలని కోరింది.

తాలూకా ఛార్జి యివ్వటంలో రొటేషన్ పద్ధతి ఏర్పాటుచేయాలని, తహసీల్‌దార్లు అందరికీ వాహనాలు యివ్వాలని సదస్సు కోరింది. పంచాయతీరాజ్ శాఖలో రెవెన్యూ సిబ్బందికి 25 శాతం కోటా గతంలో వున్నదని, తిరిగి పునరుద్ధరించాలని కోరింది. సారాడిపో మేనేజర్ల పోస్టులను డిప్యూటీ తహసీల్‌దార్లకు మాత్రమే తిరిగి కేటాయించాలని కోరింది డి. జనరల్ కార్యాలయాలలో హెడ్‌క్లర్కుల పోస్టులను డిప్యూటీ తహసీల్‌దారు స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని కోరింది. గిరిజన కార్పొరేషన్, పౌర సరఫరాల కార్పొరేషన్‌ల లోని పోస్టులలో తిరిగి రెవెన్యూ సిబ్బందిని నియమించాలనికోరింది.

జోనల్ విధానాన్ని రద్దు చేయాలని కోరింది. రహస్య ఫైళ్ళను వ్రాసే విధానం శాస్త్రీయంగా లేనందున దానిని రద్దు చేయాలని కోరింది. విజయవాడ అసిస్టెంటు గ్రెయిన్ పర్చేజింగ్ అధికారి శ్రీ యన్. సత్యనారాయణమూర్తిని అసోసియేషన్ అధ్యక్షుడిగా కో ఆప్టు చేశారు.

సిమెంట్ కార్మిక సమ్మెకు పరిష్కారం కుదరని స్థితి

బొంబాయి, సెప్టెంబర్ 11

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల కోర్కెలపై యాజమాన్యం, కార్మిక ప్రతినిధుల మధ్య చర్చల ద్వారా సామరస్య పూర్వక పరిష్కారం కనుగొనేందుకు కేంద్ర కార్మిక మంత్రి శ్రీ రవీంద్ర వర్మ తీసుకున్న చొరవతో జరిగిన చర్చలలో ఎటువంటి పురోగతి సాధించబడ లేదు.

సెప్టెంబరు 13 వ తేదీ అర్ధరాత్రి నుండి కార్మికులు జరుప తలపెట్టిన సమ్మె విరమింపబడే సూచనలు కన్పించ లేదు.

కేంద్ర కార్మిక మంత్రి విజ్ఞప్తి మేరకు ఇండియన్ నేషనల్ సిమెంట్ అండ్ అలైడ్ వర్కర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ హెచ్. యన్. త్రివేది నిన్న, నేడు యాజమాన్యాల ప్రతినిధులతో రెండు దఫాలు చర్చలు జరిపారు.

సమ్మెను నివారించ చేసేందుకు యాజమాన్యాలు ఎటువంటి సహకార వైఖరిని ప్రదర్శించటం లేదని శ్రీ త్రివేది విమర్శించారు.

మద్యపాన ప్రకటనలపై నిషేధం

రాష్ట్ర మంత్రివర్గ నిర్ణయం

హైదరాబాదు, సెప్టెంబరు 10

మద్యపానం ప్రచారానికై చేసే వాణిజ్య ప్రకటనలను నిషేధించడానికి ఆర్డినెన్సు జారీ చేయాలని రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు.

మంత్రివర్గ సమావేశానంతరం పత్రికా విలేకరులకు ఈ విషయాన్ని వెల్లడించారు.

నిజామాబాదు తదితర ప్రాంతాలలో రైతులు ఎరువుల కొరతను ఎదుర్కొంటున్నారని ముఖ్య మంత్రి దృష్టికి తీసుకరాగా యితర ప్రాంతాల నుండి కొరత జిల్లాలకు తరలించడానికి ఆదేశిస్తున్నానని చెప్పారు. నిజామాబాదులో వెంటనే ఎరువుల కొరత తీర్చడానికి చర్యలు చేపట్టాల్సిందిగా వ్యవసాయశాఖ కార్యదర్శిని ఆదేశించారు.

గుంటూరులో ఎల్. ఐ. సి ఉద్యోగుల నిరాహార దీక్షలు

గుంటూరు, సెప్టెంబరు 11

అఖిల భారత ఎల్. ఐ. సి ఉద్యోగుల సమాఖ్య పిలుపు మేరకు గుంటూరు బ్రాంచి ఉద్యోగులు మొన్న సమ్మె జరిపారు, అనంతరం నిన్న ఉదయం 2 నుండి నేడు 2 గంటల వరకు నిరాహార దీక్షలు చేశారు, సాధారణ బీమా సంస్థలో 80 శాతం ప్రాతినిధ్యం వహిస్తున్న జనరల్ ఇన్సూరెన్సు బీమా ఉద్యోగుల అఖిల భారత అసోసియేషన్‌ను గుర్తించాలని, వారికి బోనస్ చట్టం వర్తింప చెయ్యాలని, ప్రావిడెంట్ ఫండ్ పథకం పునరుద్ధరించాలని కోరుతూ సమ్మె చేశారు. ఈ నెల 21 వ తేదీన 2 గంటల పాటు దేశ వ్యాపితంగా జరిగే సమ్మెలో పాల్గొంటామని సంఘ అధ్యక్షులు శ్రీ కె. టి. ఆర్. శ్రీనివాసరావు, కార్యదర్శి శ్రీ పి. మురళీధరరావులు తెలిపారు.

అమలాపురంలో

అఖిల భారత యల్. ఐ. సి. సమాఖ్య పిలుపు మేరకు అమలాపురంలో నిన్న గంటపాటు ఎల్. ఐ. సి. ఉద్యోగులు సమ్మె చేశారు.

భార్గవా కమిషన్ విచారణలో ప్రధాన సమస్యపై సంఘటన

హైదరాబాదు, సెప్టెంబరు 10

భార్గవా కమిషన్‌ముందు హాజరవుతున్న వివిధ రాజకీయ పార్టీలు, ఇతర సంస్థలు కమిషన్ ముందున్న ప్రధాన సమస్యకు సంబంధించి ఒక ఐక్య సంఘటనను ఏర్పరచారు.

నక్సలైట్‌లకు సంబంధించిన పోరాటాలు, హత్యలు, చిత్రహింసలు ఈ కమిషన్ ముందున్న ప్రధాన సమస్య.

ఈ సంఘటనలో శ్రీ అయ్యపరెడ్డి (ప్రతిపక్షనాయకులు) శ్రీ పి సుందరయ్య, శ్రీ ఓంకార్, మా శ్రీ కొవ్విడి నరసింహం, శ్రీ గూడవల్లి నాగేశ్వరరావు [కమ్యూనిస్టు పార్టీ తరఫు న్యాయవాదులు] శ్రీ కొల్లా వెంకయ్య [సి. పి. ఐ యం, యల్.] శ్రీ మాకాల నారాయణస్వామి, శ్రీ భువన మోహన్ పట్నాయక్ యీ రాజకీయపార్టీలు. సంస్థలలో వున్నారు.

కమిషన్ పరిశీలనలోని మొదటిఅంశాన్ని మొదట పరిశీలించాలని న్యాయమూర్తి శ్రీ భార్గవా నిర్ణయించారని, మూడవ అంశాన్ని మొదటిసారిగా తీసుకోవాలని కోరటం జరిగిందని, మా విజ్ఞప్తిని అంగీకరించక పోతే విచారణలో పాల్గొనబోమని నేడు శ్రీయుతులు అయ్యపరెడ్డి, సుందరయ్య, కన్నబిరాన్‌లు హాజరైన పత్రికాగోష్ఠిలో ప్రకటించడమైంది.

సహకార బ్యాంక్ ఉద్యోగుల పికెటింగ్ : అరెస్టులు

విజయవాడ సెప్టెంబరు 10

సహకార బ్యాంక్ ఉద్యోగుల పికెటింగ్ కార్యక్రమానికి సంబంధించిన పలు కేంద్రాలనుండి వార్తలు వస్తున్నాయి. అనేకమంది అరెస్టు చేయబడుతున్నారు.

అమలాపురంలో

అమలాపురంలో సమ్మె చేస్తున్న సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగు లందరూ శాంతి యుతంగా పికెటింగు జరిపారు. ఈ సందర్భంగా బ్యాంకు కార్యదర్శిని సైతం బ్యాంకులో ప్రవేశించడానికి వారు అనుమతించలేదు. బ్యాంకు తెరవడానికి కూడా అనుమతించలేదు

స్థానిక వాణిజ్య బ్యాంకు యూనియన్‌ల నాయకులు కూడా ఈ కార్యాచరణలో పాల్గొన్నారు.

తమ సమస్యలను పరిష్కరించేంతవరకు పికెటింగ్ కొనసాగించాలని ఉద్యోగులు నిర్ణయించారు.

ఒంగోలులో సమ్మె

సమ్మె చేస్తున్న ఉద్యోగులపట్ల ముఖ్యమంత్రి సహకరించని వైఖరి దృష్ట్యా రాష్ట్ర వ్యాపితంగా రెండు గంటలపాటు సంఘీభావ సమ్మెలో భాగంగానే ఒంగోలులో అన్ని వాణిజ్య బ్యాంకులలో రెండు గంటలు సమ్మె చేశారు.

31 మంది రిమాండ్

ఒంగోలు సెంట్రల్ బ్యాంకు ఉద్యోగులు పికెటింగ్ చేస్తున్న సందర్భంలో అరెస్టు చేసిన 45 మందిలో నిన్న 31 మందిని 20 తేదీవరకు రిమాండ్‌కు పంపారు మిగిలిన వారిని విడుదల చేశారు.

రాజమండ్రిలో ముఖ్యమంత్రికి మెమొరాండం

ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు రాజమండ్రి వచ్చిన సందర్భంగా సమ్మె చేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగులు నిన్న ఉదయం ఆయనను కలుసుకుని మెమొరాండం సమర్పించారు.

అనంతరం, నినాదాలు చేస్తున్న ఉద్యోగులను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు

ఈ సందర్భంగా జిల్లా ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ తరఫున శ్రీ ముళ్ళపూడి సూర్యనారాయణ, జిల్లా రైతుసంఘ అధ్యక్షులు శ్రీ అల్లూరి వెంకటామరాజు ఒక ప్రకటన చేస్తూ ఉద్యోగులను కస్టడీలోకి తీసుకోవడం అక్రమమని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

పట్టణ కమ్యూనిస్టు సమితి, ట్రేడ్‌యూనియన్ కౌన్సిల్ తోడ్పాటు

పట్టణ కమ్యూనిస్టు సమితి పట్టణ ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు తోడ్పాటు ప్రకటిస్తూ వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశాయి.

నరసరావుపేటలో 48 మంది అరెస్టు

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా నేడు నరసరావుపేటలోని అన్ని వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు ఉదయం 11.15 గంటల వరకు తమ పనులను బహిష్కరించి పికెటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 48 మంది ఉద్యోగులను పోలీసులు అరెస్టు చేశారు. శ్రీయుతులు ఎ సీతారామయ్య, కె వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి పోలీసు స్టేషనుకు వెళ్ళిన ప్రదర్శనకు నాయకత్వం వహించారు.

చీరాలలో

అన్ని వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా రెండు గంటల సమ్మెను పాటించారు.

ఖమ్మంలో

ఖమ్మంలో విజయ బ్యాంకు ఉద్యోగు లంతా నేడు సహకార బ్యాంకు ఉద్యోగులకు సంఘీభావంగా 2 గంటలు సమ్మె చేశారు. అనంతరం సహకార బ్యాంకు వద్దకు వచ్చి ప్రదర్శన నిర్వహించారు.

సమ్మె విజయవంతంగా కొనసాగుతున్నట్లు సంఘ అధ్యక్షులు శ్రీ కె. వి. మురళీకృష్ణ తెలిపారు.

గుడివాడలో

సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు తమ కోర్కెల సాధనకై నిరవధికంగా చేస్తున్న సమ్మెకు సంఘీభావంగా నేడు గుడివాడలోని అన్ని వాణిజ్య బ్యాంకులు 2 గంటల పాటు సమ్మె చేశాయి. సహకార కేంద్ర బ్యాంకు ఉద్యోగులు నిరాహారదీక్షను కొనసాగిస్తున్నారు.

ఇల్లెందులో

ఇల్లెందులో వున్న స్టేట్ బ్యాంకు, వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు ఉద్యోగులు నేడు రెండు గంటలపాటు సంఘీభావ సమ్మె నిర్వహించారు. అనంతరం స్టేట్ బ్యాంకు ఎదుట ప్రదర్శన జరిపారు.

భద్రాచలం ప్రదర్శన

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా నేడు భద్రాచలంలో పెద్ద ప్రదర్శన జరిగింది. ప్రదర్శనలో అన్ని వాణిజ్య బ్యాంకులు, కమ్యూనిస్టు పార్టీ, యువజన సమాఖ్య, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం, జనతా పార్టీ సభ్యులు, స్థానిక ట్రేడ్ యూనియన్లు ఎన్.జి.వో.లు ప్రదర్శనలో పాల్గొన్నారు. ప్రదర్శన అనంతరం శ్రీయుతులు వై. శ్రీనివాసరావు (స్థానిక ట్రేడ్‌యూనియన్‌ల అధ్యక్షులు) భూపతిరావు, (జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి) జి. యన్. శర్మ (ట్రేడ్‌యూనియన్‌ల కార్యదర్శి) జగదీశ్వర రావు సి.పి.ఐ.,) జగన్మోహనరావు (యువజన సమాఖ్య) ఆంజనేయ ప్రసాద్, (బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి) జయరామిరెడ్డి, కె. చౌదరి, పి వాణీ రమణారావులు (జనతా) సంతకాలు చేసిన మెమొరాండాన్ని బ్యాంకు మేనేజ్‌మెంటుకు యిచ్చారు,

తాడేపల్లిగూడెంలో

సహకారబ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా నేడు ఇక్కడ అన్ని వాణిజ్య బ్యాంకు ఉద్యోగులు రెండు గంటల సమ్మెను పాటించారు.

అమలాపురంలో

స్థానిక వాణిజ్య బ్యాంకుల ఉద్యోగు లంతా నేడు రెండుగంటలపాటు సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావ సమ్మెను నిర్వహించారు.

సూర్యాపేటలో

సూర్యాపేటలోని అన్నివాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు రెండు గంటలపాటు సంఘీభావ సమ్మె నిర్వహించి అనంతరం సహకార బ్యాంకు ఎదుట ప్రదర్శన జరిపారు.

మచిలీపట్నంలో 140 మంది అరెస్టు

మచిలీపట్నం కృష్ణా కేంద్ర సహకార బ్యాంకులోని వివిధ బ్రాంచీల ఉద్యోగులు నేడు బ్యాంకు ఎదుట పికెటింగ్ జరిపారు. ఈ సందర్భంగా 140 మందిని పోలీసులు అరెస్టు చేసి రాబర్ట్సన్ పేట స్టేషన్‌లో వుంచారు.

వీరి సమ్మెకు సంఘీభావంగా వివిధ వాణిజ్య బ్యాంకుల ఉద్యోగులు 2 గంటలు సమ్మె చేశారు అరెస్టు వార్త విన్న ఉద్యోగులు తమ సమ్మెను మరో గంట పెంచారు.

అరెస్టు చేసినవారిని ఒక చిన్న హాలులో వుంచారు. ఉదయం నుండి భోజన సదుపాయాలు ఏర్పాటు చెయ్యక పోలీసుశాఖ అనుచితంగా వ్యవహరించింది. సాయంత్రం 6 గంటలకు మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా ఈ రోజుకు కోర్టు పనిచేసేవేళ ముగిసిందని రేపు హాజరు పరచమని కోరారు.

ఈ వార్త తెలియగానే బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ, ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు స్టేషన్ ఎదుట ప్రదర్శన జరిపారు.

అనంతరం కోనేరు సెంటర్‌లో బహిరంగసభ జరిగింది.

సాయంకాలం 4 గంటల నుండి బ్యాంకు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ ప్రజా సంఘాలు స్టేషన్ ఎదుట ప్రదర్శన జరుపుతూ బ్యాంకు ఉద్యోగుల యెడల పోలీసులు అనుసరించిన అనుచిత వైఖరికి తీవ్ర నిరసన తెలిపారు.

వివిధ రాజకీయ పార్టీల నాయకులు పోలీసు స్టేషన్‌కువెళ్ళి ఉద్యోగులను బేషరతుగా విడుదల చెయ్యాలని కోరుతూ వారి పట్ల అనుసరించిన వైఖరికి తీవ్ర నిరసన తెలిపారు ప్రజలంతా ఈ చర్యలపట్ల అసహ్యంతో వున్నారు. అరెస్టు చేసినవారికి స్థలం లేక స్టేషన్ బయటనే వుంచ వలసి వచ్చింది.

శ్రీ జోశ్యభట్ల విజ్ఞప్తి

విజయవాడ, సెప్టెంబరు 10

సమ్మె చేస్తున్న కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల కోర్కెలను వెంటనే ఆమోదించాలని ఎ. పి. టి. యు. సి. ఉపాధ్యక్షులు శ్రీ జోశ్యభట్ల సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు.

సమ్మె ప్రారంభమై 23 రోజులు గడిచినా ప్రభుత్వం ఎలాంటి చొరవను తీసుకొననందుకు ఆయన విమర్శించారు. బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు అన్ని ట్రేడ్‌యూనియన్లు సంఘీభావాన్ని ప్రకటించి పూర్తి సహకారాన్ని అందజేయాలని పిలుపు యిచ్చారు.

సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ సంఘీభావం

కొత్తగూడెం, సెప్టెంబరు 11

గత 23 రోజులుగా సమ్మెచేస్తున్న సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి తక్షణం జోక్యంచేసుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్సు యూనియన్ సెంట్రల్ కౌన్సిల్ డిమాండ్ చేసింది.

రాష్ట్రంలో 3500 సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సెంట్రల్ కౌన్సిల్ తన సంఘీభావాన్ని తెలిపింది. సమ్మె చేస్తున్న వారి స్థానంలోపనిచేస్తున్నసహకారశాఖఅధికార్లను సెంట్రల్ కౌన్సిల్ ఖండించింది. ముఖ్యమంత్రి తన హామీలను మరచిపోయి ముందు సమ్మె విరమిస్తేనేచర్చలు జరుపుతాననడాన్ని యూనియన్ ఖండించింది.

ఒంగోలులో

ఒంగోలులోని అన్ని వాణిజ్యబ్యాంకులు, వ్యవసాయ అభివృద్ధి బ్యాంకు, అర్బన్ బ్యాంకుల ఉద్యోగులు కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సంఘీభావంగా నేడు 2 గంటలు సమ్మెచేశారు, బ్యాంకు ఎదుట ప్రదర్శన జరిపారు. నిన్న అరెస్టు చేసిన బ్యాంకు ఉద్యోగులను వెంటనే విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి మొండివైఖరిని నిరసించారు.

బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన ప్రదర్శనగా వెళ్ళి కలెక్టర్‌కు మెమొరాండం అందచేశారు.

మెమొరాండం యిచ్చినవారిలో శ్రీ కె. సుబ్బారావు, జి. శేఖరబాబు, వి. హెచ్. వి. మోహనరావు, శ్రీమతి కోటమ్మవున్నారు.

ఒకటి, రెండు రోజులలో పి. సి. సి. నూతన కమిటీ ప్రకటన

హైదరాబాదు, సెప్టెంబరు 10

ఒకటి, రెండు రోజులలో ప్రదేశ్ కాంగ్రెసు అడ్‌హాక్ కమిటీ నూతన అధ్యక్షుల జాబితాను ప్రకటిస్తామని ముఖ్యమంత్రి నేడిక్కడ వెల్లడించారు.

12 వ తేదీ అనంతరం జిల్లా పర్యటనకు వెళ్ళక ముందే అభ్యర్థుల జాబితాను ప్రకటించే అవకాశం వుంది. (వి వి)



తెనాలిలో సహకార కేంద్ర బ్యాంకు ఎదుట మహిళల పికెటింగ్

ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం పునరుద్ధరణ యోచన

'మీసా' రద్దుకు ఆర్డినెన్సు ?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

వెంటనే 'మీసా'ను రద్దు చెయ్యాలన్న అభిప్రాయం ప్రజలలో ఉధృత మవుతున్నందున కొద్ది రోజులలోనే ఆర్డినెన్సు ద్వారా తీవ్ర వివాదాస్పదంగా వున్న ఈ చట్టాన్ని రద్దుచేసే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో వుంది.

సవరణలతో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం తిరిగి పునరుద్ధరించ బడవచ్చు అధికార దుర్వినియోగం కాకుండా ఎక్కువ కట్టుదిట్టాలు కలిగిన రూపంలో రావచ్చు.

పార్లమెంటు శీతాకాలం సమావేశంలో ఈ చట్టం రద్దుపై ప్రభుత్వం బిల్లు ప్రవేశ పెడుతుంది. సమావేశాలు నవంబరు 3 వ వారంలో ప్రారంభం కావచ్చు. అంత వరకు "మీసా" రద్దును ఆలస్యం చేయక పోవచ్చు.

మరోవైపు సంఘ వ్యతిరేక శక్తులను, ఆర్థిక నేరస్తులను, దేశ భద్రతకు హాని కలిగించే వారిని ఎదుర్కొనేందుకు పరిశీలనలు జరుగుతున్నాయి.

42 వ రాజ్యాంగ సవరణచట్టం రద్దుపై పరిశీలన కమిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

42 వ రాజ్యాంగ సవరణచట్టం రద్దును పరిశీలించేందుకు ఏర్పడిన నలుగురు సభ్యుల క్యాబినెట్ కమిటీ సమావేశం నిన్న రెండుగంటలపాటు సమావేశమై చర్చించింది.

కమిటీ వరుసగా సమావేశాలు జరిపింది. వీటిలో కొన్ని న్యాయశాఖమంత్రి శ్రీ శాంతి భూషణ్ సమక్షంలో కూడా జరిగాయి. శ్రీ శాంతిభూషణ్ కామన్‌వెల్తు న్యాయశాఖ మంత్రుల సమావేశంలో పాల్గొనేందుకు లండన్ వెళ్ళారు.

సెప్టెంబర్ 14 వ ప్రారంభం కానున్న జనతా పార్లమెంటరీ పార్టీ సమావేశానికి ముందు ఈకమిటీ తన నివేదికను రూపొందించ వచ్చునని భావింపబడుతోంది. ఈ సమావేశం మూడు రోజులు జరుగుతుంది.

పార్టీ సభ్యుల అభిప్రాయ సేకరణ అనంతరం ప్రభుత్వం తన తుది నిర్ణయాన్ని రూపొందిస్తుంది 42 వ రాజ్యాంగ సవరణ చట్టం రద్దు విషయమై ప్రభుత్వం అప్పుడే ప్రతిపక్షాలతో సంభాషణలకు దిగ వచ్చునని విశ్వసనీయ వర్గాల ద్వారా తెలియ వచ్చింది.

42 వ రాజ్యాంగ సవరణ చట్టం పూర్తిగా రద్దు చేస్తామని జనతా పార్టీ తన ప్రణాళికలో చెప్పినప్పటికీ, 9 వ షెడ్యూలుతో సహా కొన్ని అంశాలు అలాగే వుండే ఆలోచన ప్రస్తుతం వుంది. 9 వ షెడ్యూలులో సాంఘిక ఆర్థిక చట్టం మాత్రమే చేర్చవలసి వుంటుంది.

హామీని ఉల్లంఘించిన శ్రీ ఫెర్నాండెజ్

కోకా-కోలా ఉద్యోగుల యూనియన్ కార్యదర్శి వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 11

కోకా - కోలా పానీయాన్ని ఉత్పత్తి చెయ్యడానికి తాత్కాలికలైసెన్సు మంజూరు చెయ్యడానికి కూడా కేంద్ర పరిశ్రమల మంత్రి శ్రీ జార్జి ఫెర్నాండెజ్ తిరస్కరించి కంపెనీలో పనిచేసే ఉద్యోగుల యెడల "బాధాకరమయిన వైఖరి"ని అనుసరించారని కోకా-కోలా ఎంప్లాయీస్ యూనియన్ తెలిపింది.

యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. యస్ ధాదా ఇక్కడ పత్రికా గోష్ఠిలో ప్రసంగిస్తూ, తాత్కాలిక లైసెన్సుకు పరిశ్రమల మంత్రి హామీ యిచ్చి కూడా ఆ హామీని ఉల్లంఘించి "విశ్వాసఘాతుకమయిన" వైఖరిని అవలంబించారని అన్నారు.

బాటిలర్సుకు తమ పని కొనసాగించుకో మని ఫెర్నాండెజ్ హామీ యిచ్చి, తిరిగి ఉల్లంఘించడం సమంజసమయిన వైఖరి కాదన్నారు నూతన పానీయం వచ్చిన వెంటనే కోకా-కోలా బాటిలింగ్ నిలుపు చేస్తామనికూడా బాటిలర్సు హామీ యిచ్చారని ఆయన అన్నారు ఈ సందర్భంగా మంత్రి వ్యవహరించిన వైఖరి నిరుద్యోగానికి దారితీస్తుం దన్నారు ఫలితంగా మంత్రిగృహం ముందు ప్రదర్శన చెయ్యడానికి దారితీసిం దన్నారు.

త్వరితగతిన కోలుకుంటున్న శ్రీ సంజీవరెడ్డి

న్యూయార్క్, సెప్టెంబరు 11

ఇక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందు తున్న భారత రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవ రెడ్డి నిన్న తన పడకపై నుండిదిగి కారిడార్ చుట్టూ కొద్దిసేపు నడిచారు.

ఆస్పత్రి భవనంలోని 15 వ అంతస్తులో శ్రీ సంజీవరెడ్డి గది వుంది.

డాక్టర్ల సలహా మేరకు కొన్ని ఎక్సర్ సైజ్‌లను కూడా శ్రీ రెడ్డి చేస్తున్నారు.

ఆహారంపై ఆంక్షలను కూడా డాక్టర్లు తొలగించారు. దక్షిణ భారతదేశ ఆహారమైన ఇడ్లీ, సాంబారుకూడా ఆయన తీసుకుంటు న్నారు. శ్రీ రెడ్డి ఆరోగ్య పరిస్థితి త్వరిత గతిన మెరుగు పడుతున్నది.

రాష్ట్రపతి ఎక్కువసమయాన్ని చదువుకే కేటాయిస్తున్నారు, ప్రతిరోజూ న్యూయార్కు వెళ్ళే ఎయిర్ ఇండియా విమానం ద్వారా ఆయనకు భారతదేశ పత్రికలు పంపబడు తున్నాయి. ఇందులో తెలుగు పత్రికలుకూడా వుంటున్నాయి.

న్యూఢిల్లీనుండి రిలే చేయబడుతున్న టెలెక్స్ సందేశాల ద్వారా భారత జాతీయ వార్తలను కూడా ఆయన ఎప్పటి కప్పుడు తెలుసుకుంటున్నారు.

రైల్వే ఉద్యోగుల కోర్కెలపై చర్చలు

శ్రీ దండావతే వివరణ

భువనేశ్వర్, సెప్టెంబరు 11

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని మొదటి 5 మాసాలలో రైల్వే శాఖా ఉద్యోగులు చేసిన గణనీయమైన సేవను గుర్తింపు లేకుండానూ, ఎటువంటి అవార్డులు యివ్వకుండానూ వుండటం జరుగబోదని రైల్వే మంత్రి శ్రీ మధుదండావతే నిన్న హామీ ఇచ్చారు.

ఈ మాసాంతంలోగాని, వచ్చే నెల మొదటి వారంలోగాని రైల్వేలలోని ట్రేడ్ యూనియన్‌ల నాయకులతో చర్చలు ప్రారంభించటం జరుగుతుందని, బోనసుతో సహా రైల్వే ఉద్యోగులకు సంబంధించిన అనేక కోర్కెలను గురించి చర్చించటం జరుగుతుందని ఆయన చెప్పారు.

రైల్వే మంత్రిత్వశాఖను తాను స్వీకరించిన నాటి నుండి రైల్వే శాఖలో అనుకూలమైన పారిశ్రామిక వాతావరణాన్ని నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

జనతాపార్టీనుండి ముగ్గురు ఎం. ఎల్. ఎ. ల సస్పెండ్

ఇంఫాల్, సెప్టెంబరు 11

మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి శ్రీ రాజకుమార్ దొరేంద్ర, మాజీ పి. డబ్ల్యు. డి. మంత్రి రాజ్‌కుమార్ రణబీర్‌సింగ్, మాజీ విద్యామంత్రి శ్రీ రిసహాకెయిసింగ్ (అంతా జనతాపార్టీ ఎం. ఎల్. ఏ.లు) లను పార్టీ సభ్యత్వంనుండి రాష్ట్ర జనతాపార్టీ అధ్యక్షులు శ్రీ హెచ్. వీరమణిసింగ్ సస్పెండ్ చేసినట్లు పార్టీ కార్యాలయం విడుదల చేసిన పత్రికా ప్రకటన పేర్కొంది,

పైన పేర్కొన్న ముగ్గురు క్రిమినల్ కేసుల్లో వున్నట్లు ఆ ప్రకటన తెలిపింది,

మరో 50 వేల గ్రామాలకు సంచార పోస్టల్ సర్వీసులు

భోపాల్ సెప్టెంబరు 11

ప్రతి రోజూ సంచార పోస్టల్ సర్వీసులను, మరో 50 వేల గ్రామాలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కల్పిస్తామని కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ బ్రిజ్‌లాల్ వర్మ నిన్న యిక్కడ అన్నారు గత ఏడు సంవత్సరాలలో చేయలేని పని ఈ సంవత్సరం జరుగుతుందని అన్నారు.

ఆర్. ఎస్. ఎస్, జనసంఘ్ ఎత్తులపట్ల అప్రమత్తతకు

దేశానికి ప్రత్యామ్నాయమార్గం చూపే వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత

రాష్ట్ర సోషలిస్టు ఎడ్యుకేషన్ సొసైటీ సదస్సును ప్రారంభిస్తూ శ్రీ కె. ఆర్. గణేష్ ఉద్బోధ

(విశాలాంధ్ర విలేకరి)

హైదరాబాద్, సెప్టెంబర్ 10

పారిశ్రామికాభివృద్ధి, సైన్స్, దేశ ఆధునీకరణలతో సహా అన్ని రంగాలలో అభివృద్ధికి వ్యతిరేకమైన ఆర్. యస్. యస్. జనసంఘ్‌లపట్ల దేశ ప్రగతిని కాంక్షించే శక్తులు, సామాజిక మార్పులలో విశ్వాసం గలవారంతా అప్రమత్తంగా వుండాలని కేంద్ర మాజీమంత్రి శ్రీ కె. ఆర్. గణేష్ హెచ్చరించారు.

రాజకీయ అనుబంధాలతో నిమిత్తం లేకుండా వామపక్ష ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకమై ఈ చీకటి శక్తులకు వ్యతిరేకంగా పోరాటం సాగించాలని ఆయన కోరారు

నేటిమధ్యాహ్నం ఇక్కడిగాంధీభవన్‌లో సోషలిస్టు ఎడ్యుకేషన్ సొసైటీ రాష్ట్రస్థాయి సదస్సును ప్రారంభిస్తూ ఆయన పై విధంగా అన్నారు.

దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రస్తావిస్తూ గత 30 సంవత్సరాలుగా దేశంలో అనుసరిస్తూ వచ్చిన పెట్టుబడిదారీ ఆర్థిక విధానాల వలన దేశ, ఆర్థికవ్యవస్థలో ఏర్పడిన ప్రతిష్టంభన, ద్రవ్యోల్బణం, వంటి దుష్ఫలితాలను తొలగించి దేశాభివృద్ధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించేందుకు కమ్యూనిస్టు, మార్క్సిస్టు కమ్యూనిస్టుపార్టీ (యం. యల్.) వంటి పార్టీలు, కాంగ్రెస్, జనతాపార్టీలలో వామపక్ష, ప్రజాతంత్ర భావాలుగల శక్తులు, ఇతర వ్యక్తులు సమైక్యంకావాలని ఆయన కోరారు.

రెండు రోజులపాటుజరిగే ఈ సదస్సులో లెక్చరర్లు, ప్రొఫెసర్లు,విద్యార్థులతో పాటుగా రాష్ట్రమంతటి నుండి వచ్చిన వందలాది మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు.

తృతీయ ప్రపంచ దేశాలలో ప్రత్యేకంగా భారత ఉప ఖండంలో ప్రజాస్వామ్యాన్ని విచ్ఛిన్నంచేసే చట్టవ్యతిరేక విద్రోహక ప్రవృత్తులను ప్రోత్సహించేందుకు ప్రపంచసామ్రాజ్యవాదం ప్రత్యేకంగాఅమెరికా,ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సహాయ ఏజెన్సీల ద్వారా సాగిస్తున్న నీచమైన కార్యకలాపాలను ప్రస్తావిస్తూ, మన దేశ ప్రజాస్వామ్యానికి, పార్లమెంటరీ సంస్థలకు ఏర్పడిన ప్రమాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు సమైక్యం కావాలని అన్నారు.

ఈ తీవ్ర ప్రమాదానికి వ్యతిరేకంగా వామపక్ష శక్తులుగాని లేక ప్రజాతంత్ర శక్తులుగాని ఒంటరిగా పోరాడలేవని పేర్కొంటూ ఈ రెండు శక్తులు సమైక్యంగా మాత్రమే విజయవంతంగా పోరాడగలవని ఆయన తెలిపారు.

ఉదయం సమావేశానికి శ్రీ ముక్కామల నాగభూషణం అధ్యక్షత వహించారు

ప్రముఖ ఆర్థికవేత్త శ్రీ ఆర్. సి. దత్ ప్రసంగిస్తూ, దేశంలోని గుత్త సంస్థలతో పాటుగా ప్రపంచ బ్యాంకు బహుళజాతి కంపెనీల వంటి సామ్రాజ్యవాద ఆర్థిక ఏజెన్సీల కుట్రల ప్రమాదంగురించి హెచ్చరించారు.

దేశ అభివృద్ధి పారిశ్రామిక విధానానికి సంబంధించి నెహ్రూ అభిప్రాయాలపై స్వార్థపర వర్గాలవారు దాడులకు పూనుకుంటున్నారని ఆయనన్నారు.

తొలుత ఆహ్వాన సంఘ కార్యదర్శి శ్రీ పి. ఆర్. రెడ్డి స్వాగతం పలికారు

కేంద్ర మాజీ మంత్రి శ్రీ.కె. వి. రఘునాథరెడ్డి రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి శ్రీ మహేంద్రనాథ్ తదితర ముఖ్యులు సదస్సుకు హాజరవుతున్నారు.

యాదవరెడ్డి హత్య

హైదరాబాదు, సెప్టెంబరు 10

ప్రత్యేక తెలంగాణా నాయకులు శ్రీ ఎస్. యాదవరెడ్డి జీపులో వెళ్లుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు గతరాత్రి అమానుషంగా హత్య చేశారు.

చాలా విచిత్రమయిన పరిస్థితిలో నిన్న రాత్రి 9.30 గంటలకు ఈ హత్య జరిగినట్టు చెప్పబడుతున్నది. జీపు నడిపిస్తూ వున్నప్పుడు ఆయనను వెనుకనుండి పొడిచినట్టు కనబడుతున్నది. ఆయన మెడ తలపై ఎన్నో కత్తిపోట్లు వున్నట్టు పోస్టుమార్టమ్ నివేదిక తెలియ చేస్తున్నది

పోలీసు కేసు రిజిస్టరు చేసింది. సిటీ క్రైమ్ బ్రాంచి దర్యాప్తు జరుపుతున్నది. శ్రీ రెడ్డి ఇటీవలనే జనతాపార్టీలో చేరారు.

ఈ హత్యను తెలంగాణా ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు శ్రీ ఆర్. వి మూర్తి ఖండిస్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రజల భద్రతకు చర్య తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శ్రీ రెడ్డి మృతి పట్ల సంతాపం ప్రకటించారు.

జనతా నాయకుల దివాళాకోరుతనం

తనపై వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి సమాధానం

హైదరాబాదు సెప్టెంబరు 10

తమ రాజకీయ దివాళాకోరుతనాన్ని కప్పిపుచ్చుకోవటానికై ఇతరులపై వ్యాఖ్యలను చేయడానికి బదులు తమ ఇల్లు తాము చక్కబెట్టుకోవడం మేలని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు నేడిక్కడ రాష్ట్ర జనతా పార్టీ నాయకులకు సలహాయిచ్చారు.

సాయంత్రం మంత్రివర్గ సమావేశానంతరం సచివాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న సందర్భంగా మంత్రివర్గ విస్తరణపై జనతాపార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా ముఖ్యమంత్రి పై జవాబిచ్చారు.

జనతాపార్టీ అధ్యక్షుని ఎన్నికలోని దివాళాకోరు స్థితిని కప్పి పుచ్చుకోవటానికై వ్యాఖ్యానాలు చేయడం కన్నా వాళ్ళకు వేరే పనేమి లేదని ఆయన అన్నారు.

నేను నా ప్రయత్నాల సందర్భంగా జనతా పార్టీనిగాని మరెవరినిగాని ఎక్కడా ప్రస్తావించడం లేదు ప్రస్తావిస్తే వారికి లేనిపోని ప్రచారం లభిస్తుంది వారిని గురించి ప్రస్తావించే పరిస్థితి యింకా ఇక్కడ ఏర్పడటం లేదని శ్రీ వెంగళరావు అన్నారు. [వి వి]

సహకారబ్యాంకు సమ్మె విచ్ఛిన్నానికి నీతిబాహ్యమైన చర్య తగదు

శ్రీ కె. వి. రఘునాథరెడ్డి ప్రకటన

హైదరాబాదు, సెప్టెంబరు 10

సహకార బ్యాంకు సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన సిబ్బందిచే బ్యాంకులలో పని చేయించటం విచారకరమయిన విషయమని, ఆరోగ్యకరమయిన పారిశ్రామిక సంబంధాల దృష్ట్యా, ఇది నీతిబద్ధం కాదని, ఇది మేనేజ్‌మెంటుకు కూడా ప్రయోజనకరం కాదని, పార్లమెంటు సభ్యులు, మాజీ మంత్రి శ్రీ కె. వి రఘునాథరెడ్డి నేడిక్కడ ఒక ప్రకటనలో తెలియ జేశారు.

"రైల్వే సమ్మె సందర్భంగా అనుసరించిన తప్పుడు పద్ధతులు ఆచరించకూడదు" అని ఆయన హెచ్చరించారు.

ఈ వివాద పరిష్కారంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని శ్రీ రెడ్డి సూచించారు. అందరి ప్రయోజనాల దృష్ట్యా ప్రత్యేకంగా రాష్ట్ర పురోభివృద్ధి దృష్ట్యా, త్రైపాక్షిక చర్చలద్వారా కాని, పరస్పర అంగీకార యోగ్యంతో మధ్యవర్తి తీర్పుకుగాని సమస్యనునివేదించి సమ్మెను ఉపసంహరింప చేయవచ్చని అన్నారు.

"మేనేజ్‌మెంటు, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్‌మధ్య ఏడు సంవత్సరాల క్రితం జరిగిన ద్వైపాక్షిక ఒప్పందాలు నాలుగు సంవత్సరాల క్రితమే కాలం చెల్లిపోయాయి. ఈ ఒప్పందం బ్యాంకుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడి వాని స్థాయి పెంపును దోహదం చేశాయి" అని ఆయన అన్నారు.

సమ్మె వలన యజమానులే కాకుండా ఖరీఫ్ తరుణంలో అప్పులు దొరకక పేద వ్యవసాయ దారులు యిబ్బంది పడుతున్నారు అని ఆయన అన్నారు.

సమ్మె పై ముఖ్యమంత్రి వ్యాఖ్య

హైదరాబాదు, సెప్టెంబరు 10

క్రింది తరగతి ఉద్యోగులకు తప్ప అందరికీ వేతనాలు పెంచే ప్రసక్తే లేదని నేడిక్కడ కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెపై వ్యాఖ్యానిస్తూ ముఖ్యమంత్రి తెలియ జేశారు.

ఇప్పటికే వారికి వేతనాలు రాష్ట్ర ప్రభుత్వ మిగిలిన ఉద్యోగుల కన్నా అధికముగా లభిస్తున్నందున, క్రింది తరగతి ఉద్యోగు లెవరైనా వుంటే న్యాయమైన రీతిలో వేతనాలు పెంచడానికి అవకాశం వుంటుంది. అందుకు సమ్మెను ముందుగా విరమించాలి అని శ్రీ వెంగళరావు మంత్రివర్గ సమావేశానంతరం సాయంత్రం విలేకరులతో చెప్పారు.

దీర్ఘ కాలికమైన ఈ సమ్మె ఫలితంగా రైతాంగం యిబ్బందులు పడుతున్నారన్న విషయానికి జవాబుగా "కొన్నాళ్ళు యిబ్బందులు పడాల్సి వస్తే పడాలి" అని అన్నారు.

రు 3500 వేతనంపొందే ఉద్యోగులకు పెంచడం ఎలా సాధ్యం? పారిశ్రామిక కార్మికులుగా వారు ప్రవర్తించడం మంచిది కాదని ఆయన అన్నారు

ఇప్పటికే రిజర్వుబ్యాంకునుండి రైతుల ఋణాలకుగాను 7 శాతం వడ్డీకి లభించే మొత్తాలనే ఈ బ్యాంకులద్వారా 12.5 శాతానికి చెల్లిస్తున్నాము. ఇంకేమాత్రం రైతాంగంపై అదనపు భారాన్ని వేయమని శ్రీ వెంగళరావు తెలియజేశారు. (వి.వి.)

దేశంలో ఆగస్టులో రికార్డు స్థాయి సిమెంట్ ఉత్పత్తి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

దేశంలో సిమెంటు గత సంవత్సరం ఆగస్టు నెలలో 14.06 లక్షల టన్నులు ఉత్పత్తి కాగా యీ సంవత్సరం ఆగస్టులో 15.73 లక్షల టన్నులు రికార్డు స్థాయిలో ఉత్పత్తి చేసింది.

సిమెంటు ఫ్యాక్టరీలలో విద్యుత్ కోత కాని కార్మిక వివాదాలు కాని లేకుండా వుంటే ఈ సంవత్సరం సిమెంటుఉత్పత్తి 190 లక్షల టన్నులకు చేరుకోవచ్చునని అధికార వర్గాలు తెలియజేస్తున్నాయి.

ఆర్థిక, సాంకేతిక సహకార ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

రెండు దేశాల మధ్య ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని మరింతగా పెంపు చేయటానికి వీలు కల్పించే ఒప్పందంపై భారత్, ఇరాన్‌లు నిన్న సంతకాలు చేశాయి.

ఆర్థిక సాంకేతిక సహకారంపై భారత్ ఇరాక్‌ల సంయుక్త కమిషన్ సమావేశం ముగింపు సందర్భంగా నిన్న రాత్రి పది గంటలకు ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి.

ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలో గల బాక్సయిట్ నిక్షేపాల అన్వేషణ పేపర్ మరియు పల్ప్ ఉత్పత్తి పరిశ్రమలను నెలకొల్పుటలో భారత్ ఇరాన్‌కు సహాయ పడుతుంది

గేదె మాంసం ఎగుమతికి అనుమతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

శీతలీకరణతో నిల్వ చేసిన గేదె మాంసాన్ని కిలో రు. 7.50 కనీస ధరకు ఎగుమతి చేసేందుకు అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గొర్రె, మేక మాంసం కనీస ఎగుమతి ధర కిలో రు. 12.50 బహిరంగమైన సాధారణ లైసెన్సు క్రింద ఎగుమతిని అనుమతిస్తారు. ఈ అంశంలో ఇతర షరతులకు సంబంధించిమార్పులేదని వాణిజ్యమంత్రిత్వ శాఖ ప్రకటించింది.

వియత్నాంలో వరి పరిశోధన, గేదెల అభివృద్ధికి సహాయం

భారత్ అంగీకారం : ఒప్పందంపై సంతకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 10

వియత్నాంలో వరి పరిశోధన సంస్థ, గేదెల అభివృద్ధి కేంద్రం స్థాపించేందుకై వియత్నాంతో సహకరించేందుకు భారత్ అంగీకరించింది.

పరిశోధన సంస్థకు పరికరాలు, గేదెల అభివృద్ధి కేంద్రానికి అవసరమయిన పశువులను భారతప్రభుత్వం సరఫరా చేస్తుంది.

పై సంస్థలతోబాటు, వడ్డీ లేకుండా వియత్నాంకు లక్ష టన్నుల గోధుమ ఋణంగా యివ్వడానికికుదిరిన ఒప్పందంపై నిన్న ఉదయం ఉభయ దేశాలు సంతకాలు చేశాయి

విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ ఏ. కె. అహూజా భారత్ తరపున ఒప్పందంపై సంతకాలు పెట్టారు.

ఉభయ దేశాలమధ్య సహకారాన్ని అభివృద్ధి చేసేందుకు, ఉమ్మడి స్వావలంబన, అలీన వర్ధమాన దేశాల మధ్య పరస్పర సహాయాన్ని యీ ఒప్పందాలు ప్రతిబింబిస్తున్నాయనిఅహూజాచెప్పారు.

గత కొద్ది రోజులుగా వియత్నాం ఆర్థిక ప్రతినిధి వర్గానికీ, భారత అధికారులకుమధ్య చర్చలు జరిగిన అనంతరం ఈ ఒప్పందాలు కుదిరాయి. వియత్నాం ప్రతినిధి వర్గ నాయకుడు విదేశీ వాణిజ్య ఉపమంత్రి గుయెన్‌షాన్ ప్రసంగిస్తూ, సహ వర్ధమాన దేశానికి సహాయం చేసేందుకై భారత ప్రభుత్వం ప్రదర్శించిన సుహృద్భావానికి తమ దేశం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ఉభయ దేశాల ప్రతినిధి వర్గాలు వివిధ రంగాలలో పరస్పర సహకారానికిగలఅవకాశాలపై చర్చలు జరిపాయని, అందుకుగాను త్వరలో చర్యలు తీసుకుంటామని అహూజా తెలిపారు.

వియత్నాంలో సహకారాభివృద్ధికి భారత్ కృతనిశ్చయంతో వుందనీ, వియత్నాం పునర్నిర్మాణానికి వారు జరుపుతున్న కృషి విజయవంతం కావాలనీ ఆశాభావం వ్యక్తం చేశారు.

వియత్నాం ప్రతినిధివర్గం భారత నాయకుల, ప్రజల సుహృద్భావాన్ని తమవెంట తీసుక వెడుతూ, నిన్న హనోయ్ బయలు దేరింది ఉభయ దేశాలమధ్య మైత్రిని మరింతగా అభివృద్ధి పరచే విధంగా, ఆర్థిక, సాంకేతిక సహకారాన్ని ముందుకు గొని పోయేందుకు తమ దేశం కృషిచేస్తుందని గుయెన్‌షాన్ ఉద్ఘాటించాడు.

వియత్నాం ప్రతినిధివర్గం ఆగస్టు 25న ఢిల్లీ వచ్చింది గత కొద్ది రోజులలోనూ వారు వారణాసి కలకత్తా బెంగుళూరు, బొంబాయి అహమ్మదాబాదులలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల పారిశ్రామిక సంస్థల సందర్శనకై పర్యటన జరిపారు.

పరస్పర సుహృద్భావ పూరిత వాతావరణంలో ఉభయదేశాల ప్రతినిధుల మధ్య చర్చలు జరిగినట్లు నిన్న ఉదయం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో తెలిపారు.

రాష్ట్రంలో గతవారం వర్షపాతం

హైదరాబాద్, సెప్టెంబర్ 10

ఈ నెల మొదటివారంలో ఆదిలాబాద్ నిజామాబాద్, కరీంనగర్ నల్గొండజిల్లాలలోని జిల్లా మెట్ట ప్రాంతాలు, పశ్చిమగోదావరిలో నర్సాపురం, తణుకు తాలూకాల్లో వర్షపాతం సాధారణంకంటె ఎక్కువగా ఉందని భారత వాతావరణ పరిశోధక కేంద్రం తెలిపింది. వరంగల్ (మహబూబాబాద్‌తాలూకా మినహా), ఖమ్మం (ఖమ్మం మధిర తాలూకాలు మినహా) మహబూబ్‌నగర్ జిల్లా పశ్చిమ ప్రాంతం, శ్రీకాకుళం జిల్లా కోస్తా తాలూకాలు, పశ్చిమ గోదావరిలో భీమవరం తాడేపల్లిగూడెం, కొవ్వూరు తాలూకాల్లో వర్షం సాధారణంగా ఉంది.

తూర్పు గోదావరిలో అత్యధిక భాగం, శ్రీకాకుళం, పశ్చిమ గోదావరిల్లో ఎగువ ప్రాంతాలు, ఆదిలాబాద్ మహబూబ్‌నగర్ జిల్లాల తూర్పు భాగాలు, కృష్ణా జిల్లా కోస్తా తాలూకాలు, రాయలసీమలో చాలచోట్ల నెల్లూరు ప్రకాశం, గుంటూరు, హైదరాబాద్ మెదక్, విశాఖ జిల్లా కోస్తా తాలూకాలు, కృష్ణా జిల్లామధ్య, ఎగువ ప్రాంతాలు, తూర్పు గోదావరిలో రంపచోడవరం, ఎల్లవరం పశ్చిమ గోదావరిలో ఏలూరు, వరంగల్ జిల్లాలో మహబూబాబాద్‌లలో వర్షపాతం తక్కువగా ఉంది.

అణుశక్తి రంగంలో సహకార ఒప్పందం

భారత్, పోలెండ్‌ల సంతకాలు

బొంబాయి, సెప్టెంబరు 10

అణుశక్తి శాంతియుత ప్రయోజనాలకు వినియోగించుకోవటంలో సహకారానికి ఒప్పందంపై భారత్ పోలెండ్‌లు నిన్న ఇక్కడ సంతకాలు చేశాయి.

ఈ ఒప్పందంపై పోలెండ్ మంత్రి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు అయిన ఎడ్వర్డ్ పిక్‌నడర్, భారత్ తరపున అణుశక్తి కమిషన్ అధ్యక్షులు డాక్టర్ హెచ్. యన్. సేత్నా సంతకాలు చేశారు.

5 సంవత్సరాలపాటు అమలులో వుండే ఈ ఒప్పందం రెండు దేశాల మధ్య శాస్త్ర వేత్తలు, సాంకేతిక వేత్తల మార్పిడికి, పరస్పర ప్రాతిపదికపై స్కాలర్ షిప్‌లు, ఫెలోషిప్‌లు మంజూరుకు వీలు కల్పిస్తుంది.

పశ్చిమ జర్మనీ ఆర్థికమంత్రి రాజీనామా

బాన్, సెప్టెంబరు 10

పశ్చిమ జర్మనీ ఆర్థికమంత్రి హాన్స్ ఫ్రెడరిక్స్ నిన్న రాజీనామా చేశారు. ఇది వచ్చేనెలనుండి అమలులోకి వస్తుంది.

దేశంలో కల్లా రెండవ పెద్ద వాణిజ్య బ్యాంకు అయిన డ్రెస్డనర్ బ్యాంకు యాజమాన్యంలో ఆయన చేరబోతున్నారు,

నందిని గృహాలపై దాడులు; పలుపత్రాల స్వాధీనం

కటక్, సెప్టెంబరు 10

శ్రీమతి నందినీ శతపథి, ఆమె బంధువులూ, మిత్రులూ, సహచరుల గృహాలను సోదా చేయడానికి పంపిన 31 బృందాలలో 21 బృందాలు అనుమానాస్పద మయిన పత్రాలు, వస్తువులను స్వాధీనం చేసుకొన్నాయి. వీని నిన్న కటక్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ శ్రీ వి. యస్. మిశ్రా ముందుంచారు.

స్వాధీనం చేసుకున్న పత్రాలు కొన్ని ట్రంకు పెట్టెల్లో వున్నాయి, శ్రీమతి శతపథి భర్త శ్రీ దేవేంద్ర శతపథివున్న ఢెంకనాల్ నివాస గృహంలో, మేజిస్ట్రేట్, సాక్షుల ముందు స్వాధీనం చేసుకున్న రు.51,766 కరెన్సీ వుంది.

అవినీతి నిరోధక చట్టం కింద విజిలెన్సు పోలీసులు శ్రీమతి శతపథిపై రిజిస్టర్ చేసిన కేసు మేరకు కటక్ చీఫ్ జుడిషియల్ మేజిస్ట్రేట్ విడుదలచేసిన 30 సోదా వారంట్లతో విజిలెన్సు అధికారులు అనేక గృహాలపై దాడులు జరిపారు.

ఈ కేసు సందర్భంగా భువనేశ్వర్‌లో శ్రీ త్రైలోక్యమిశ్రా యింట సోదా చేశారు ఆయనకు నిన్న యాంటిసిపేటరీ బెయిలు లభించింది.

నిన్న నాల్గవ రోజు కూడా దేశమంతటా ఈ సోదా జరిగిందని ఒరిస్సా విజిలెన్స్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఘనశ్యామ్‌దాస్ చెప్పారు.

భువనేశ్వర్‌లో శ్రీమతిశతపథి గృహంలో 0.38 మందు గుండుకు చెందిన 38రౌండ్లు 0.30 రైఫిల్ మందుగుండుకు చెందిన 14 రౌండ్లు స్వాధీనం చేసుకున్నారు.

శ్రీమతి శతపథిపై గల ఎనిమిది ఆరోపణలలో నాలుగింటిపై రిటైర్డు జడ్జీ శ్రీ. ఆర్ కె దాస్ యిచ్చిన నివేదికను ఒరిస్సా మంత్రి వర్గం నిన్న ఆమోదించింది.

దాస్ నివేదికపై తగిన తదనంతర చర్యలు తీసుకోవలసిందిగా విజిలెన్సు పోలీసులు అయా అధికారులకు మంత్రివర్గం ఆదేశించిందని ముఖ్యమంత్రి శ్రీ నీలమణి రౌత్రాయ్ చెప్పారు.

సాల్ విత్తనాల సేకరణకు కొన్ని అటవీ ప్రాంతాలను ఒక ప్రైవేటు సంస్థకు శ్రీమతి శతపథి లీజు కివ్వడంవల్ల రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం వచ్చిందనీ, ఒక టైర్ ట్రేడింగ్ ప్రైవేట్ సంస్థపట్ల పక్షపాతం చూపారనీ, ఆమె కుమారుడికి ఈ రెండు సంస్థలతో సంబంధం ఉందనీ దాస్ నివేదిక ఆరోపణలు తెలిపాయి.

పబ్లిక్ హెల్తు ఇంజనీరింగ్ డిపార్టుమెంట్‌కు చెందిన మాజీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు సూపరింటెండింగ్ ఇంజనీర్ స్థాయి నివ్వడం ప్రభుత్వ యాజమాన్యాన వున్న కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఒక వ్యక్తి నియామకంపై మిగతా రెండు ఆరోపణలున్నాయి.

ఏదో ఒకసాకుతో మీసాను కొనసాగించే ధోరణి

—శ్రీ భూపేష్ గుప్తా ఖండన

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

మీసాను రద్దు చేయాలన్న నిర్ణయానికి కట్టుబడి వున్నామని జనతాపార్టీ ప్రభుత్వం చెబుతున్నా, వాస్తవంలో ఏదో ఒక సాకుతో లేదా కొత్త పేరుతో కొనసాగించే ధోరణిని న్యాయశాఖ మంత్రి వెల్లడించడాన్ని పార్లమెంటులోని కమ్యూనిస్టు పక్ష నాయకుడు శ్రీ భూపేష్‌గుప్తా ఒక ప్రకటనలో ఖండించారు

సెప్టెంబరు ఆరవ తేదీని శ్రీ గుప్తా విడుదల చేసిన పత్రికా ప్రకటన పూర్తి పాఠం ఇలా వుంది

"మీసాను రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం నిర్నిబంధమయినదని అనుమానానికి తావు లేదని ప్రధాన మంత్రి, హోం మంత్రి న్యాయశాఖ మంత్రి పదే పదే చెబుతూ వచ్చారు కాని న్యాయశాఖ మంత్రి శాంతి భూషణ్ న్యూఢిల్లీలో ఒక పత్రికా గోష్టిలో మాట్లాడుతూ ఏదో ఒక సాకుతో లేదా కొత్త పేరుతో మీసాను కొనసాగించాలన్న ప్రభుత్వ ఆలోచనసూచనప్రాయంగా వెల్లడించారు

పార్లమెంటు శీతాకాల సమావేశాలలో ప్రభుత్వం తీసుకురావాలను కొంటున్న కొన్ని బిల్లుల గురించి న్యాయశాఖ మంత్రి మాట్లాడారు కాని వాటిలో మీసాను రద్దు చేసే బిలు ఒకటి వుంటుందన్న సూచన కూడా ఏమీ లేకపోవడం గమనించదగిన విషయం వచ్చే పార్లమెంట్ సమావేశాల మొదట్లోనే దీనిని రద్దు చేసేందుకు వీలుగా మీసా సమస్యపై ప్రభుత్వం తన పటాయింపు ధోరణికి స్వస్తి చెప్పాల్సిన అవసరం ఆసన్నమయింది.

ప్రివెంటివ్ డిటెన్షన్ నిబంధనలకు వ్యతిరేకంగా ఎన్నడూ "గట్టి గొణుగుడు" లేదని న్యాయశాఖ మంత్రి చేసిన వ్యాఖ్యవల్ల నేను చకితుడనయ్యాను, న్యాయశాఖమంత్రికి ఎక్కువ తెలిసి వుంటుందని భావించాను. 1952 లో మొదటి సార్వత్రిక ఎన్నికలు పూర్తయిన వెంటనే ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టం పునరుద్ధరణ సమయంలో భారత కమ్యూనిస్టుపార్టీ, డాక్టర్ శ్యామప్రసాద్ ముఖర్జీతోసహా యితర ప్రతిపక్షాలు పి. డి చట్టాన్ని తీవ్రంగావ్యతిరేకించాయి

ఆ సమయంలో పి డి. చట్టానికి వ్యతిరేకంగా పార్లమెంటులో "గొణుగుడు" మాత్రమేగాదు పెద్ద గందరగోళం జరిగింది. ఫలితంగా ఆ కఠోరమయిన చట్టానికి కొన్ని సవరణలతో ప్రభుత్వం కొంత మేరకు సరళం చెయ్యాల్సి వచ్చింది. ఈ చట్టం పునరుద్ధరణకు వచ్చినప్పుడల్లా పార్లమెంటులో గట్టి వ్యతిరేకత వ్యక్తమవుతూనే వచ్చింది.

1969 లో కాంగ్రెసులో చీలిక అనంతరం ప్రభుత్వం లోక్‌సభలో మెజారిటీ కోల్పోయినప్పుడు పి. డి చట్టాన్ని పునరుద్ధరించకుండా కమ్యూనిస్టుపార్టీ, యితర ప్రతిపక్ష పార్టీలు నిరోధించ గలిగాయి. చట్టాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వం భావిస్తే దానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం ఓటు చేస్తుందని ఫలితంగా ఆమె ప్రభుత్వం పడిపోతుందని మేం అప్పటి ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరా గాంధీకి స్పష్టం చేశాం.

అందువల్ల ఒక సంవత్సరం ఆరు మాసాల పాటు దేశంలో ప్రివెంటివ్ డిటెన్షన్ చట్టంలేదు. అయితే 1971 ఎన్నికల తర్వాత మాజీ ప్రధానమంత్రి పెద్దమెజారిటీ సంపాయించిన తర్వాత మాత్రమే ఈ చట్టాన్ని మరింత కఠోరమైన రూపంలో శాశ్వత చట్టంగా పునరుద్ధరించబడింది. ఈ అఖండ మెజారిటీని తర్వాత ప్రజా వ్యతిరేక ప్రజాస్వామిక వ్యతిరేక చర్యలు తీసుకునేందుకు దుర్వినియోగం చెయ్యడం జరిగింది

విచారణ లేకుండా డిటెన్షన్‌ను కొనసాగింప ప్రయత్నంలో గత ప్రభుత్వ ఉదాహరణను అనుసరించడానికి న్యాయశాఖ మంత్రి శ్రీ శాంతిభూషణ్ సర్వవిదితమైన ఈ వాస్తవాలన్నిటినీ చూడ నిరాకరిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

తెన్నేటి విశ్వనాథం ఢిల్లీ పయనం

రాష్ట్రంలో జనతానాయకత్వ సమస్యపై పిలుపు

విశాఖపట్నం, సెప్టెంబరు 10

రాష్ట్రంలో జనతా నాయకుడుగా శ్రీ తెన్నేటి విశ్వనాథం నియమించబడవచ్చునన్న ఊహాగానాల మధ్య ఆయన నిన్న ఇక్కడి నుండి బయల్దేరాడు.

తక్షణం రావలసిందిగా అధిష్టానవర్గం కబురు పెట్టింది, ఆయన నేడు విజయవాడ చేరి, రేపు ఢిల్లీ వెళ్తారు.

11 వ తేదీ నాటికల్లా ఢిల్లీలో ఉండాల్సిందిగా జనతా ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణ హెగ్డే ఆయనకు కబురు పంపారు.

11,000 కోట్ల డాలర్ల అమెరికా సైనిక బడ్జెట్

వాషింగ్టన్, సెప్టెంబరు 10

1978 వ సంవత్సరానికి 11 వేల కోట్ల డాలర్ల సైనిక బడ్జెట్ అమెరికా సెనేట్ ఆమోదించి అధ్యక్షుడు కార్టర్ ఆమోదానికి పంపింది.

అయితే కార్టర్ కోరినట్లు బి.1 రకపు బాంబర్ల తయారీకి సెనేట్ నిధులను కేటాయించ లేదు.

తిరుపతిలో న్యాయ శాస్త్రంలో పి.జి. కోర్సులు

తిరుపతి, సెప్టెంబరు 10

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రంలో పి. జి, కోర్సులను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి శ్రీ అల్లాడి కుప్పుస్వామి నిన్న ప్రారంభించారు.

చట్టాలకు సంబంధించిన విజ్ఞానాన్ని ప్రజలలో వ్యాప్తి చేయాలని, న్యాయస్థానాలు (ట్రిబ్యునల్స్) కార్యకలాపాలను గురించి వారికి వివరించాలని శ్రీ కుప్పుస్వామి కోరారు. న్యాయస్థానాలలో ఉచితంగా ప్రాక్టీసు చేసుకొనేందుకు పోస్టుగ్రాడ్యుయేట్ న్యాయశాస్త్ర విద్యార్థులకు అవకాశం కల్పించాలని ఆయన సూచించారు.

ఉచిత న్యాయ సహాయ కేంద్రం అధ్యక్షులు, పి జి. న్యాయశాస్త్ర విభాగ అధిపతి శ్రీ వి. కోటేశ్వరరావు చట్టాలన్నింటిని సామాన్య మానవునికి అర్థం అయ్యే విధంగా చేయాలని సూచించారు. మన న్యాయ వ్యవస్థలో సామాన్యులకు న్యాయం జరగటంలేదని ఆయన అన్నారు.

మోటారు వాహనాల పన్ను చెల్లింపుకు తిరుపతిలో సౌకర్యం

తిరుపతి హెడ్ పోస్టాఫీసు, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సబ్ పోస్టాఫీసుల ద్వారా మోటారు వాహనాల పన్ను చెల్లించేందుకు తిరుపతిలో సౌకర్యం కల్పించటం జరిగింది. రాయలసీమ ప్రాంతంలో ఇటువంటి సౌకర్యాన్ని కల్పించటం యిదే ప్రథమం. అక్టోబరు రెండు నుండి ఈ సౌకర్యం లభిస్తుంది

వాణిజ్య వాహనాలు మినహా మిగతా వాహనాల యజమానులు లైసెన్సు ఫీజు, సర్వీసు ఛార్జీలను చెల్లించి పై రెండు పోస్టాఫీసులలో మోటారు వాహనాల పన్ను చెల్లించవచ్చు. అవసరమైతే ఈసౌకర్యాన్ని తిరుపతి, పుత్తూరులలోని మరికొన్ని పోస్టాఫీసులలో ఏర్పాటు చేస్తారు.

నిండుగొండలో హరిజనులపై భూస్వాముల దౌర్జన్యాలు

నర్సీపట్నం, సెప్టెంబరు 11

విశాఖపట్నం జిల్లా నర్సీపట్నం తాలూకా నిండుగొండ గ్రామ హరిజనులపై నర్సీపట్నం సమితి మాజీఉపాధ్యక్షులు ధనిక రైతు శ్రీ అయినశెట్టి పోతినాయుడు ఆయన అనుచరులు అకృత్యాలకు పాల్పడ్డారు.

గ్రామంలో దాదాపు 70 హరిజన కుటుంబాలున్నాయి గతంలో ప్రభుత్వం వీరికి చెరువు బంజర్లను, మెట్ట చుట్టూవున్న బంజర్లకు పట్టా లిచ్చింది.

ఆ తరువాత హరిజనులు ఇళ్ళ స్థలాలకై దరఖాస్తులు పెట్టుకొనగా సబ్ కలెక్టర్ ఆ గ్రామానికి స్వయంగా వచ్చి 3 ఎకరాల 50 సెంట్లు భూమిని రైతుల నుండి తీసుకొనుటకు నిర్ణయించి, సర్వేయర్‌ను పంపిస్తానని చెప్పి వెళ్ళారు.

ఇది తెలిసిన సమితి మాజీ ఉపాధ్యక్షులు, ధనిక రైతు శ్రీ అయినశెట్టి పోతినాయుడు హరిజనులను పిలిపించి "మాకు ఇళ్ళ స్థలాలు అక్కరలేదని" తిరిగి ప్రభుత్వానికి అర్జీలుపెట్టమని వత్తిడిచేశారు.

హరిజనులు అందుకు నిరాకరించగా, హరిజనులను గ్రామాలలో తిరగనీయవద్దని, వారికిచ్చిన బంజర్లను సాగుచేయనీయవద్దని వారు వేసుకొన్న పంటలను నాశనం చేయడానికై ఆ భూములపై పశువులను, మేకలను, గొర్రెలను తోలి మేపి సర్వనాశనం చేయమని తన అనుచరులకు బహిరంగగానే ఆదేశాలు ఇచ్చారు.

ఆ దేశాల మేరకు ఆయన అనుచరులు కర్రలు, పారలు పట్టుకొని గ్రామంలోవున్న పశువులను, మేకలను, గొర్రెలను హరిజనుల వేసుకొన్న పైర్లమీదకు తోలించి నాశనం చేయించారు. అంతటితో ఆగకపారలతో మడి గట్లను నరికి చెదరవేశారు.

మా జనతా ప్రభుత్వం వచ్చింది, మీకు దిక్కున్నచోట చెప్పుకోండి' అంటూ కేకలు వేస్తూ నానా హంగామా చేస్తూ హరిజనుల పీకలుకూడా నరకేస్తామని నానా దుర్భాషలాడారు.

జిల్లా వ్యవసాయ కార్మికసంఘ సహాయ కార్యదర్శి శ్రీ వై. మారిరెడ్డి ఇటీవల ఆ గ్రామం వెళ్ళినప్పుడు హరిజనులు కంట నీరు పెట్టుకొంటూ తమకు జరిగిన అన్యాయాన్ని తెలియచేశారు.

శ్రీ మారిరెడ్డి ఈ దారుణ చర్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకొనివస్తూ ప్రభుత్వం వెంటనే హరిజనులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



తెలుగు విజ్ఞాన సర్వస్వం 13 వ సంపుటిని రెవిన్యూమంత్రి శ్రీ పి. నరసారెడ్డి ఆవిష్కరించిన దృశ్యం విద్యామంత్రి శ్రీ ఎం. వి. కృష్ణారావును తెలుగు భాషాసమితి అధ్యక్షులు డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డినికూడ చిత్రంలోచూడవచ్చు



హైదరాబాద్ - సికింద్రాబాద్‌ల మధ్య పట్టాలు తప్పిన బొంబాయి ఎక్స్‌ప్రెస్

వచ్చే 20 సంవత్సరాలకు బొగ్గు, జింక్, తదితరాలకు గిరాకీ

భూభౌతిక పరిశోధనా సంస్థ డైరెక్టర్ వెల్లడి

కొత్తగూడెం సెప్టెంబర్ 11

వచ్చే 20సంవత్సరాల పైగా కాలంలో దేశ జనాభా 90 - 100 కోట్లకు పెరగనున్న దృష్ట్యా బొగ్గు జింక్ ఇనుము,రాగి, అణువిద్యుత్‌కు అధికంగా గిరాకీ ఏర్పడుతుందని హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ డైరెక్టర్ డా॥ హరినారాయణన్ తెలియచేశారు.

"వ్యవసాయ, పారిశ్రామికాభి వృద్ధికి సంబంధించి జాతీయ వనరుల ప్రాధాన్యత" అనే అంశంపై ఇక్కడ ఇల్లెందు క్లబ్‌లో ఆయన ప్రసంగిస్తూ పై విధంగా తెలిపారు.

సభకు చైర్మన్, మేనేజింగ్ డైరెక్టరు శ్రీ బి. ఎన్. రామన్ అధ్యక్షత వహించారు.

శ్రీ నారాయన్ తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ కాల వ్యవధి తక్కువగా వుండటం చేత మన ప్రాధాన్యతలను నిర్ణయించడం తప్పనిసరి అవసరమని, పెరుగుతున్న అవసరాలను తీర్చటానికి, పరిష్కారానికి కృషి సల్పాలని అన్నారు.

దేశంలో నిరుద్యోగం, అర్హతకు తగిన ఉద్యోగం లేకపోవడాన్ని ఆయన ప్రస్తావించి, ఈ పరిస్థితి మరింత క్లిష్టపరుస్తుందని ఇందుకై ముందుగా అవసరమైన ప్రత్యేకించి ఖనిజాల అన్వేషణకు సంబంధించిన కృషి జరగాల్సి వుందని అన్నారు.

స్వాతంత్ర్యానంతరం ప్రత్యేకించి భారత భూభౌతిక పరిశోధన లాంటి పెద్ద సంస్థల క్రింద ఎంతో కృషి జరిగిందని చెబుతూ యింకా 50 శాతం ప్రాంతం భూగర్భ పరిశోధన జరగాల్సి వుందని అన్నారు. ఇంతవరకు క్రమపద్ధతి ప్రకారం 40 శాతం ప్రాంతంలో హైడ్రో జియోలాజికల్ సర్వే జరిగిందని, 30 శాతం భూసార పరిశోధన జరపబడిందని తెలియ చేశారు.

ఒక్క గంగానది లోయలోనే భూముల పైనా, భూగర్భంలోని జలాల అన్వేషణకై శాస్త్రీయంగానరే జరిగితే, అద్భుతమైనరీతిలో ఆహార ధాన్యాలు ఉత్పత్తి చేయవచ్చునని ఆయనన్నారు.

బొగ్గు, పెట్రోలు, అణువిద్యుత్ లాంటి వాణిజ్య వనరుల వినియోగం గత 30 సంవత్సరాల్లోఎంతో అధికంగా పెరిగిందనిమన కార్యక్రమాలు, ప్రాజెక్టుల, నిర్వహణలో బొగ్గు అత్యంత ప్రధానపాత్ర నిర్వహిస్తుందని అన్నారు.

బొగ్గు స్థానంలో విద్యుత్‌ను వినియోగించటంలో మనం నవంగా శాస్త్రీయ విధానాన్ని రూపొందించుటకు ప్రయత్నించాల్సి వుందని తెలియచేశారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించి మన దేశం ప్రపంచంలో మూడవ స్థానంలో వుందని కనుక మన సాంకేతిక పరిజ్ఞానాన్ని సంరక్షించుకోవాల్సి వుందని చెప్పారు.

భూకంపాలను పసిగట్టే మరో కొన్ని కేంద్రాలను సమీప భవిష్యత్‌లో నెలకొల్పాలని నిర్ణయించడం జరిగిందని ఆయన తెలిపారు.

శ్రీ టి ప్రసాద్ స్వాగతం చెప్పగా శ్రీ మోగ్నే వందన సమర్పణ చేశారు.

రాష్ట్రపతికి శుభాకాంక్షలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 10

రాష్ట్రపతి శ్రీ నీలం సంజీవరెడ్డి త్వరగా కోలుకోవాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఆకాంక్షను వ్యక్తం చేసింది.

"మీకు శస్త్ర చికిత్స జయప్రదంగా జరిగినందుకు ఆనందిస్తున్నాం మీరు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాం" అని శ్రీ చవాన్ రాష్ట్రపతికి టెలెక్స్ పంపారు.

టెల్లర్ కౌంటర్

హైదరాబాద్, సెప్టెంబరు 9

రాజధానిలోని స్టేట్ బ్యాంక్ మార్కెట్ స్ట్రీట్ బ్రాంచిలో "టెలర్ కౌంటర్"ను గాంధీ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ సి ఆర్, రాజగోపాలన్ నేడు ప్రారంభించారు.

ఖాతాదార్లకు సేవలను మెరుగుచేస్తున్న బ్యాంకు కృషిని ప్రశంసించారు. హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ శ్రీ సాల్మన్‌రాజు ఈ పథకాన్ని వివరించారు. అంతకుముందు బ్రాంచి మేనేజరు అచ్యుతరావు స్వాగతం పలికారు శ్రీ జి. విశ్వనాథం వందన సమర్పణ చేశారు.

ఎక్స్‌టెన్షన్ కౌంటర్

ఇక్కడి ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా వారి ప్రథమ ఎక్స్‌టెన్షన్ కౌంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ ఎ కృష్ణస్వామి నిన్న ప్రారంభోత్సవం చేశారు.

రీజనల్ మేనేజర్ శ్రీ యస్ సాల్మన్ రాజు స్వాగతం పలికారు.

స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ (ప్లానింగ్) శ్రీ ఎ బోస్ మాట్లాడుతూ, వసతి కల్పించి తమ పూర్తి సహకారం అందజేసిన ఆస్పత్రి అధికారులకు, ప్రత్యేకించి ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీ వెంకట్రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీ కృష్ణస్వామి మాట్లాడుతూ ఎప్పుడూ ఆస్పత్రి పనులతోనే పరిమితమయ్యే డాక్టర్లకు బ్యాంకింగ్ సౌకర్యాలను విస్తరించిన బ్యాంకు అధికారులను అభినందించారు.

బ్రాంచి మేనేజర్ శ్రీ వి, శ్రీనివాసరావు వందన సమర్పణ చేశారు,

అమెరికా మొక్కజొన్నలో కాన్సర్ ముప్పు

వాషింగ్టన్, సెప్టెంబరు 11

అమెరికాలో తెగులు పట్టిన మొక్కజొన్న కాన్సర్ వ్యాధిని తెచ్చే ప్రమాదం వుందని ప్రభుత్వం ప్రకటించింది.

కాన్సర్‌ను తెచ్చే ఎఫ్లోటాక్సిన్ అనే పదార్థం ఎగుమతులలోకి కూడా వెళ్ళగలదని ఇది అమెరికా ధాన్యాన్ని వాడుకొనే విదేశీ వినియోగదార్లకు ఆందోళన కలిగిస్తుందని పేర్కొంది.

అయితే మొక్కజొన్న ఉత్పత్తుల వల్ల తిన్నవారి ఆరోగ్యానికి భంగం కలిగినట్లు చెప్పనప్పటికీ కొన్ని రకాల పశువులకు ఆ మొక్కజొన్న పెట్టవద్దని అమెరికాధికార్లు హెచ్చరిస్తున్నారు. కరువు వాతబడ్డ అమెరికా ఆగ్నేయాన ఎఫ్లోటాక్సిన్ పదార్థం అత్యంత తీవ్రంగా ఉందని వ్యవసాయ, ఆహారం మందులశాఖ అధికారులు తెలిపారు. కరువువల్ల ఆగ్నేయ ప్రాంతంలో ఈఏడాది మొక్కజొన్నపంట గణనీయంగా తగ్గిందని ఎ. పి వార్తాసంస్థ కథనం. మొక్కజొన్న ఎక్కువగా పండే మధ్య పశ్చిమ ప్రాంతంలో ఎఫ్లోటాక్సిన్ వ్యాపించలేదన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ కృష్ణాజిల్లా జడ్జి,
కోర్టు వారి సముఖమునకు
O. P. 88/1977
In the matter of the minors
కందికట్టు నాగదుర్గారావు,
" వెంకటరత్నం,
" భవానీ లక్ష్మి.
పిటీషనర్లు: కందికట్టు ఉమామహేశ్వరరావు వగైరా.

పై నెంబరున విజయవాడలో శాటాకులవారిపేట లోని 10/135 నెంబరు యింటిలో మైనర్ల హక్కు విక్రయించుటకు పిటీషను పెట్టబడినది. ఎవరికైన యెట్టి ఆక్షేపణ ఉన్నను ది. 23-9-1977 న పై కోర్టు వారి యెదుట 10 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును.

వి. వి. సూర్యనారాయణ,
పిటీషనర్ల అడ్వకేటు

చిలకమ్మచెప్పింది
ఆచారాలఅక్కయ్యలాగే
ఆవిడకీకూడామగాళ్ళ
వాసనేగిట్టదట!
కాలేజికి దారి
Gopi Krishna International
చేగొండి హరిబాబు సమర్పించు
గోపీకృష్ణా ఇంటర్నేషనల్ వారి
చిలకమ్మ చెప్పింది
కథ-సం: ఈరంకి శర్మ దర్శకత్వం: కె. బాలచందర్ నిర్మాత: చలసాని గోపి
లక్ష్మీఫిలింస్



సెప్టెంబర్ 16 విడుదల! ఉదయం ఆటతో
ప్రేక్షకలోకానికి ఒక వినూత్న అనుభూతి!
వైయల్.యన్. పిక్చర్స్
కాళిదాస్
ఈస్ట్‌మన్‌కలర్
దర్శకత్వం: పి. సుబ్రహ్మణ్యం
నిర్మాత: వి.యస్.నరసింహారెడ్డి
ఆంధ్ర-నైజామ్: పూర్ణా రిలీజ్

నాగార్జున యూనివర్సిటీ

నోటిఫికేషన్

1978 మే లో జరిగే ఎం. ఎ., ఎం.కాం. మరియు ఎం.ఎస్.సి మేథమేటిక్స్ పరీక్షలకు ప్రైవేటుగా కూర్చొనుటకు లటెండెన్సు నుండి మినహాయింపు కోరుతూ లేట్ ఫీతో దరఖాస్తులు ఈ క్రింది విధముగా స్వీకరించబడును.

1. సెప్టెంబరు 1 నుండి సెప్టెంబరు 10 వరకు } రు. 5/-లు
2. సెప్టెంబరు 11 నుండి సెప్టెంబరు 30 వరకు } రు 10/-లు
3. అక్టోబరు 1 నుండి అక్టోబరు 15 వరకు } రు 35/-లు

రిజిస్ట్రార్.

ఇల్లెందు సభలో ప్రసంగిస్తున్న శ్రీ చంద్రప్పన్

ప్రజాసమస్యలపై యువకార్మికులు సమైక్యంగా పోరాడాలి

ఇల్లెందు సభలో శ్రీ చంద్రప్పన్ పిలుపు

ఖమ్మం, సెప్టెంబరు 11

అఖిలభారత యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ సి కె చంద్రప్పన్ ఈ నెల 1, 2 తేదీలలో ఖమ్మంజిల్లాలో పర్యటించిన సందర్భంగా 2 వ తేదీన ఇల్లెందు పట్టణంలో జరిగిన యువ కార్మికుల సదస్సులో 500 మంది పాల్గొన్నారు. తాలూకా యువజన సమాఖ్య అధ్యక్షులు శ్రీ బి. బాలయ్య అధ్యక్షత వహించారు. పట్టణయువజన నాయకులు శ్రీ రాంబాబు స్వాగతం చెప్పారు.

వేదికపై శ్రీ సి. కె. చంద్రప్పన్, రాష్ట్ర యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ ఎం రామకృష్ణారెడ్డి ఉపాధ్యక్షులు శ్రీ టి. వి. చౌదరి, జిల్లా యువజన సమాఖ్య కార్యదర్శి శ్రీ సిద్ది వెంకటేశ్వర్లు, జిల్లా విద్యార్థి ఫెడరేషన్ కన్వీనర్ శ్రీ ఎం. రామారావు శ్రీయుతులు ఎ. ప్రసాదరావు, కె అచ్యుతన్, ఎ సుధాకర్, కె. బోసులు ఆశీనులయ్యారు

స్థానిక ప్రజానాట్యమండలి కళాకారులు ఉత్తేజకరమైన విప్లవ గీతాలు పాడి యువకులను ఉర్రూతలూగించారు.

తొలుత, జిల్లా కమ్యూనిస్టు సమితి సహాయ కార్యదర్శి శ్రీ దొండపాటి వెంకయ్య మృతిపట్ల సభ సంతాపాన్ని వ్యక్తం చేసింది

శ్రీ చంద్రప్పన్ జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరిస్తూ యువ కార్మికులంతా ప్రజాసమస్యలపై పోరాడాలని ఉద్బోధించారు.

శ్రీ ఎం రామకృష్ణారెడ్డి జనతా ప్రభుత్వ విధానాలను వివరిస్తూ నేడు గ్రామీణ ప్రాంతాలలో హరిజన గిరిజన ఇతర బలహీనవర్గాల వారిపై భూస్వాములు, ధనిక వర్గాలు జరుపుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు యువత ముందుకు వచ్చి రక్తం ధారపోసి అయినా బలహీనవర్గాలవారికి అండగా నిలవాలని ఉద్బోధించారు

కళా కార్యక్రమాలను శ్రీ టి. వి. చౌదరి వివరించారు.

ముఖ్యమంత్రి నియోజక వర్గమైన సత్తుపల్లి తాలూకాలోని ఉసిర్లగూడెం గ్రామములో గిరిజనుల భూములలో నాటికి నేటికి పచ్చిన పంటకు ధ్వంసం చేసిన వినాయకపురం భూస్వాములు, వారికి సాయిగూండాలను అరెస్టు చేసి, వారిపై కఠినచర్యలు తీసుకోవాలని పంటను నష్టపరిహారం యిప్పించాలని, ఈ భూములపై అర్హత కలిగివున్న గిరిజన హరిజనులకు పట్టాలు యివ్వాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశం తీర్మానించింది.

తిరుమలకు ఆర్. టి సి. ప్రత్యేక బస్సులు

సెప్టెంబరు 15 నుండి 23 వరకు

హైదరాబాద్: సెప్టెంబరు 11

తిరుపతి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని యీనెల 15 నుండి 23 వరకు రాష్ట్రంలో అన్ని ముఖ్యకేంద్రాల నుండి ఎ. పి.యస్. ఆర్. టి. సి. ప్రత్యేక బస్సులనడుపుతుంది.

హైదరాబాదు, విజయవాడ కాకినాడ, రాజమండ్రి, అమలాపురం, నరసాపురం, ఏలూరు వంటి పట్టణాల నుండి, తగినంత మంది ప్రయాణీకులు వుంటే, రాష్ట్రంలోని అన్ని డిపోల నుండి బస్సులు నడపబడతాయి అంతర్రాష్ట్రీయ మార్గాలలో కూడా ప్రత్యేకబస్సులు నడిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి

ప్రయాణీకుల సౌకర్యం దృష్ట్యా, ఆర్ టి సి. వెయిటింగ్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో బాటు, ప్రత్యేక పారిశుధ్య చర్యలు, మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది ప్రయాణీకులకు రాష్ట్రంలోని అన్నికేంద్రాలనుండి, ఉత్తరప్రాంతాల నుండి కూడా లింక్ టిక్కెట్లు యివ్వబడతాయి ఈ లింకు టిక్కెట్లతో, ప్రయాణీకులు తిరుపతిలో ఆగవలసిన అవసరం లేకుండా తిరుమలకు ఏకా ఏకిన ప్రయాణం చెయ్యవచ్చును.

మొజాంబిక్ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనకు భారత్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11

మపూటో [మొజాంబిక్] లో గత నెల 27 న ప్రారంభమైన మొజాంబిక్ 13 వ అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శనలో భారత్ ప్రత్యక్షంగా పాల్గొన్నది. ఈ ప్రదర్శన ఈ నెల 11 వరకు కొనసాగింది.

ఈ ప్రదర్శనలో భారత్ తో బాటు 22 యితర దేశాలు కూడా పాల్గొన్నాయి

ఈ ప్రదర్శనలో దాదాపు 30 భారత వాణిజ్య సంస్థలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా అవి తమ వాహనాల పంపుసెట్లు డీజిల్ ఇంజన్లు, వ్యవసాయ పరిమట్లు విద్యుత్ ఫ్యాన్లు సైకిళ్ళు. వాటి భాగాలు మెడికల్, సర్జికల్ ఇన్‌స్ట్రుమెంట్లు, రసాయనాలు, అనుబంధ ఉత్పత్తులు, ప్లాస్టిక్, నూలు వస్త్రాలు; రెడీమేడ్ దుస్తులు వగైరాలను ప్రదర్శిస్తాయి

ఖమ్మం జిల్లాలో కరువు నివారణ కార్యక్రమాలు : ముఖ్యమంత్రి వెల్లడి

ఖమ్మం, సెప్టెంబరు 12

ఖమ్మంజిల్లాలో ఈ నెలలో కూడా వర్షాలు పడకపోతే కరువు పరిస్థితి ఏర్పడవచ్చునని అందుచేత వచ్చే నెల నుండి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టగలదని ఖమ్మం పత్రికా విలేకరుల గోష్టిలో ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు తెలియ చేశారు.

ముఖ్యమంత్రి ఈ నెల 8 వ తేదీన ఖమ్మంజిల్లా పర్యటనకై వచ్చినసందర్భంగా స్థానిక హిల్ బంగళాలో పత్రికా విలేకరులు కలుసుకొని జిల్లాలో ఏర్పడిన కరువు పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకొనిరాగా ఆయన పై విధంగా సమాధానంచెప్పారు.

ప్రస్తుతం నాగార్జున సాగర్ కాలువ త్రవ్వకం వలన అనేకమంది పేదలకు పనులు దొరుకుతూనే వున్నవని, యింకా ముమ్మర కార్యక్రమాన్ని చేపట్టనున్నామని అన్నారు.

కేంద్ర సహకార బ్యాంకు ఉద్యోగుల సమ్మెను గురించి ప్రశ్నించగా ఉద్యోగులలో రు 15 వందలనుండి రు 3 వేల వరకు జీతాలు తీసుకొనేవారు కూడా ఇంకా పెంచమని అడగటం బాగోలేదని, ఈ సమయములో ఉద్యోగులు అడగకుండానే జీతాలు పెంచడం జరిగిందని, సమ్మెలకు దారితీయకుండా చేశామని అన్నారు

బ్యాంకు ఉద్యోగులలో కూడా చిన్న తరగతి వారి కోర్కెలను పరిష్కరించడంలో తన కేలాంటి అభ్యంతరం లేదని, బ్యాంకు ఉద్యోగుల నాయకులు హైదరాబాదులో కలుసుకున్నప్పుడు వారికి అన్ని విషయాలు చెప్పానని అన్నారు.

ఖమ్మంలో నిరాహారదీక్ష చేస్తున్న ఒక యువకుణ్ణి అరెస్టుచేసి, బేడీలువేసి తీసుకెళ్ళినట్లు ఒక దినపత్రికలో వచ్చినవార్త ప్రస్తావనకు రాగానే, ఈ వార్త యదార్థం కాదని, అరెస్టు చేయడంగాని, బేడీలు వేయడంగాని జరగలేదని, నీరసస్థితిలో వున్న ఆ యువకుణ్ణి అతని తండ్రి తీసుకొని వెళ్ళగానే అతను ఇలాగా ఆహారం తీసుకొన్నాడని జిల్లా పోలీసు సూపరింటెండెంటు చెప్పారు.

ముఖ్యమంత్రిని స్థానిక ఎస్. ఎస్. ఆర్. అండ్ జ్యోతి కాలేజి ప్రతినిధివర్గం కలుసుకొని తమ కాలేజీ 7 సంవత్సరాల నుండి నిర్వహింపబడుతున్నదని ఇంతవరకు గ్రాంట్లు మంజూరు కాలేదని వినతి పత్రం సమర్పించారు

ముఖ్యమంత్రి సమాధానం చెబుతూ 5 సంవత్సరాలు దాటిన అన్ని కాలేజీలకు గ్రాంట్లు మంజూరుచేస్తూ 4 5 రోజులలో ఉత్తర్వులు జారీకాగలవని తెలిపారు.

61 మందికి లక్ష రూపాయల రుణం

61 మంది షెడ్యూల్డు కులాలు జాతుల వారు నాగలి, ఎడ్లు, గొర్రెలు తదితరాలను కొనుగోలు చేసేందుకు హైదరాబాద్ స్టేట్ బ్యాంక్ ఖమ్మం బ్రాంచి రు, 1,25 050 రుణం మంజూరు చేసింది

కేశవపురం, జిల్ల చెరువులకు చెందిన 30 మంది నాగలి, ఎడ్లు కొనేందుకు రు 62 150 కేటాయించింది.

ఖమ్మంలో నిన్న ముఖ్యమంత్రి ఈ రుణాల పంపిణీ జరిపారు.

బంగారపు కడ్డీలు, చేతి గడియారాల స్వాధీనం

బొంబాయి, సెప్టెంబరు 11

సింధు జలసంధి ప్రాంతంలోని ఒక దేశం నుండి తిరిగి వచ్చిన "యస్. యస్. మెహమేది" నౌక నుండి రు. 1 83 లక్షల విలువ గల 24 బంగారపు కడ్డీలు, 35 చేతి గడియారాలను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

కైవెలిలో అల్లర్ల సందర్భంగా పది మంది అరెస్టు

కోళికోడ్, సెప్టెంబరు 11

ఇక్కడికి 50 కిలో మీటర్ల దూరంలో కైవెలి గ్రామంలో గత బుధవారం చెలరేగిన ఘర్షణలకు సంబంధించి నేడు పోలీసులు పది మందిని అరెస్టు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఘర్షణల సమయంలో పెద్ద ఎత్తున రాళ్ల విసరడం జరిగింది.

ఈ ఘర్షణ ఐక్య సంఘటనకు చెందిన కార్మికులకు, మార్క్సిస్టుపార్టీకి చెందిన కార్మికులకు మధ్యన జరిగినట్లు సమాచార్ తెలుపుతోంది. ఈ సందర్భంగా కనీసం ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు భద్రతా చర్యంకై గ్రామంలో వున్నారు.

కందుకూరులో సూపర్ బజారు

కందుకూరు, సెప్టెంబరు 11

కందుకూరులో కోఆపరేటివ్ సూపర్ బజారును జిల్లా కలెక్టర్ శ్రీ వైద్యనాథయ్యర్ ఈ నెల 2 న ప్రారంభించారు.

ఆయన పి. ఎ. శ్రీ అబ్దుల్‌హక్ అధ్యక్షతన బహిరంగసభ జరిగింది. సూపర్ బజార్‌లో అన్ని రకాల సరుకులూ ఉన్నప్పుడు ప్రైవేటు వ్యాపారులవద్దకు పేదలు వెళ్ళవలసిన అవసరం ఉండదని కలెక్టర్ అన్నారు.

సహకార కేంద్ర బ్యాంకు అధ్యక్షుడు శ్రీ వి. గోపాలస్వామి సూపర్ బజార్ అధ్యక్షులు శ్రీ కృష్ణమూర్తి (ఆర్. డి. ఓ.) ఒంగోలు కస్తూరిబాయి మహిళా సంక్షేమ కేంద్రం అధ్యక్షులు శ్రీమతి స్వరాజ్యలక్ష్మి ప్రసంగించారు.

సూపర్ బజార్ ఉపాధ్యక్షులు శ్రీ టి. సి. కొండయ్య వందన సమర్పణ చేశారు.

(వి. వి.)

ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్

టెండరు నోటీసు

ఈ క్రింది పనులకు సీలువేసిన టెండర్లు రిజిస్టర్డు పి. డబ్ల్యు. డి. కాంట్రాక్టర్లు, మరియు ప్రసిద్ధి చెందిన సంస్థలనుండి కోరబడుచున్నవి.

పని పేరు	సుమారు విలువ	ఎర్నెస్టుమనీ	టెండరు ఫారం ఖరీదు	పని పూర్తి చేయవలసిన కాలం
1. యం. కె నెం. 5 ఇన్‌క్లైన్, మందమర్రి, బెల్లంపల్లివద్ద స్క్రీనింగ్ ప్లాంటు & పికింగ్ ప్లోర్, (సివిల్‌వర్క్సు), 50హెచ్ పి పానహౌస్. 150 హెచ్ పి. హాల్లర్ షెడ్, క్యాంటిన్, ఎక్స్‌ప్లోసివ్ మ్యాగజైన్, లాంప్ కాబిన్, రెస్టుషెల్టర్, షెడ్స్, చిన్న ఫిల్టర్‌బెడ్, మరియు క్రాస్‌డ్రైనేజిపనులలో కలుపుకుని డబ్ల్యు. బి. యం. రోడ్డు నిర్మాణము చేయుట.	రు. 5,70,000/.	రు. 11,400/.	రు. 30/.	పని ఆర్డరు యిచ్చిన తేదీనుండి 12 నెలలు
2. గోలేటి నెం 1 ఇన్‌క్లైన్ బెల్లంపల్లి వద్ద స్క్రీనింగ్ ప్లాంటు & పికింగ్ ప్లోర్ (సివిల్‌వర్క్సు), 50 హెచ్. పి. పానహౌస్, 150 హెచ్. పి హాల్లర్ షెడ్ క్యాంటిన్, ఎక్స్‌ప్లోసివ్ మ్యాగజైన్, లాంప్‌కాబిన్, రెస్టుషెల్టర్, షెడ్స్, చిన్నఫిల్టర్ బెడ్. క్రాస్‌డ్రైనేజి పనులతో డబ్ల్యు. బి యం. రోడ్డు నిర్మాణము చేయుట.	5 30 000/.	10 600/.	30/.	పని ఆర్డరు యిచ్చిన తేదీనుండి 12 నెలలు

1. టెండరు ఫారములు 3-10-1977 న సాయంత్రం 4.00 గంటలవరకు అమ్మబడును.
2. టెండర్లు 7-10-1977 న సాయంత్రం 3.00 గంటల వరకు స్వీకరించబడును.
3. టెండర్లు 8-10-1977 న ఉదయం 10.00 గంటలకు తెరువబడును.
4. టెండరు ఫారములు, కావలసిన మొత్తాలు మరియు నమూనాలు అడిషనల్ జనరల్ మేనేజర్, ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ పి. ఒ. బెల్లంపల్లి లేదా అడిషనల్ జనరల్ మేనేజర్, ది సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, రామగుండం డివిజన్సు, పి ఒ. గోదావరిఖని వారి కార్యాలయములో పని దినములలో నగదుగా చెల్లించి ఆఫీసు పని చేయు వేళలలో ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పొందవచ్చును.
5. ఎర్నెస్టుమనీ డిపాజిట్‌ను అడిషనల్ జనరల్ మేనేజర్, బెల్లంపల్లి కాలరీస్, బెల్లంపల్లి వారి కార్యాలయంలో లేదా అడిషనల్ జనరల్ మేనేజర్, రామగుండం డివిజన్సు, పి ఒ. గోదావరిఖని, వారి కార్యాలయంలో నగదుగా గాని లేక బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్ రిసీప్టును సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్, కొత్తగూడెంకాలరీస్‌వారి పేర ఎండార్సు చేసి డిపాజిట్ చేయాలి. ఎర్నెస్టుమనీ రసీదు లేక బ్యాంకు ఫిక్సెడ్ డిపాజిట్ రసీదు టెండరుకు జతపరచి పంపాలి. మరియు దానికి సంబంధించిన రిఫరెన్సు టెండరు ఉన్న కవరుపై వ్రాయాలి. అట్లు చేయనట్లయితే టెండరు అంగీకరించబడదు. పెండింగ్ బిల్సు, డిపాజిట్సు ఎర్నెస్టుమనీ క్రింద జమకట్టమని వచ్చిన అభ్యర్థనలు అంగీకరింపబడవు. బ్యాంకు గ్యారంటీలు అంగీకరింపబడవు.
6. ఎట్టి కారణము తెలుపకనే ఏ ఒక్క టెండరునైనా పూర్తిగా లేక పాక్షికంగా అంగీకరించుటకు లేదా ఏ టెండరునైనా లేక అన్ని టెండర్లు నిరాకరించు అధికారము క్రింది సంతకందారునికి కలదు
7. కాంట్రాక్టర్లు 1970 కాంట్రాక్టు లేబర్ చట్టం (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్ మరియు 1971 కాంట్రాక్టు లేబర్ సెంట్రల్ రూల్సు (రెగ్యులేషన్ అండ్ అబాలిషన్) క్రింద కావలసిన లైసెన్సు పొంది ఉండాలి.
8. కండిషనల్ టెండర్లు అంగీకరింపబడవు.

కొత్తగూడెం కాలరీస్,
తేది 23-8-77.
60 Advt/77-78.

ఫర్ జనరల్ మేనేజరు

సన్నకారు రైతుల అభివృద్ధి పథకం క్రింద ఖమ్మంజిల్లా ఏదులాపురంలో జరిగిన కృషి

సెంట్రల్ బ్యాంక్ చే రు. 10 లక్షల రుణసాయం పంపిణీ

ఏదులాపురం గ్రామం ఖమ్మం పట్టణానికి నాలుగు కిలోమీటర్ల దూరంలో వున్నది దీని జనాభా నాలుగు వేలు కాగా దీని క్రింద నాలుగు శివారు అయిన అంగడి తండాలు, మునేటి ప్రక్కనే వున్న నాయుడుపేట, చరో కొత్తూరు గ్రామాలు వున్నవి. జనాభాలో అత్యధికులు లంబాడీలు, పేద రైతులు, ఇతర వృత్తులు చేసుకొనేవారు వున్నారు. 1959 వ సంవత్సరంలో, గ్రామపంచాయతీ ఏర్పడిన నాటినుంచి, యీనాటి వరకు పంచాయతీ పరిపాలనగానీ సహకార పరపతి సంఘంగాని కమ్యూనిస్టు నాయకత్వాననే నడపబడుతున్నవి.

త్వరిత్వరగా అభివృద్ధి చెందుతున్న ఖమ్మం పట్టణం మునేటి అవతల ఒడ్డున వ్యాపించి యీ గ్రామ పంచాయతీ ఏర్యాలోనే ఒక ఎముకల మిల్లు, గ్రానాయిల్ మిలు, కోళ్ళ పరిశ్రమ, "మాడ్కుఫెడ్" పర్సీసింగ్ సెంటరు, 10 లక్షల వ్యయంతో నిర్మాణం తలపెట్టిన కుష్టు రోగుల శిబిరాల కేంద్రంతోపాటూ ఇటీవలనే నూతనంగా నిర్మాణం గావించిన 'జలగం నగరి కాలని' కూడా యీ పంచాయతీ ఏరియాలోనే కట్టబడింది.

పూరాతన కాలం నుంచి బరుకు కొండలో పడి వుంటూ ఇండ్ల వసతి లేక నికృష్ట జీవితాలు గడుపుతున్న లంబాడీ అందరినీ ఒకే ప్రదేశంలో పొట్టు యిచ్చేందుకు బోషర్ వెల్ఫేర్ అధికార్లు పథకాలు తయారుచేస్తూ దానికి తగిన భూ సేకరణ సన్నాహం కొనసాగిస్తున్నారు.

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారం

20 అంశాల పథకం వచ్చిన తరువాత ఖమ్మానికి ఇంత సమీపంలో వున్న యీ గ్రామాన్ని అభివృద్ధి పర్చేందుకు వాణిజ్య బ్యాంకు లేవీ ముందుకు రాలేదు చివరకు పలుమార్లు ఆందోళన చేసిన తరువాతనే ఆయన సత్యం శ్రీ మహమ్మద్ రజబలీ కృషి ఫలితంగా అనాడున్న జిల్లా కలెక్టర్ శ్రీ పి. వి. ఆర్ కె. ప్రసాద్ చూపిన శ్రద్ధ వలన యీ గ్రామాన్ని అభివృద్ధి పరచేందుకు సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖమ్మం బ్రాంచి ముందుకువచ్చి యీ గ్రామాన్ని దత్తత తీసుకొని బ్యాంకు మేనేజరు శ్రీ జి. శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రామంలో సన్నకారు రైతులకు వ్యవసాయాభివృద్ధికోసం, ఇతర వృత్తులవారికి ఆర్థిక సహకారంగా ఇప్పటికి 10 లక్షలు పెట్టుబడి పెట్టారు వీరితోపాటుగా సన్నకారు రైతుల అభివృద్ధిసంస్థ ప్రాజెక్టు ఆఫీసరుగావున్న శ్రీ మురళీకృష్ణ కూడా ఎప్పటికప్పుడు శ్రద్ధతో రైతులు పెట్టుకున్న దరఖాస్తులను మంజూరుచేస్తూ బ్యాంకుకు పంపడంలో తోడ్పడ్డారు.

ఇప్పటివరకుగ్రామంలో 90 మందిసన్నకారు రైతులు మోట బావులు త్రవ్వుకునేందుకు 90 బావులకుగాను 3 లక్షలు పెట్టుబడిగా యిచ్చారు. వీరంతా బావులను త్రవ్వుకొని పంటలు పండిస్తున్నారు.

వీరితోపాటుగా 55 గురు రైతులకు ఆయిల్ ఇంజనులకుగాను సుమారు 2 లక్షల 25 వేలు యిచ్చారు. 9 మంది రైతులకు దుక్కిటెద్దులు కొనుక్కునేందుకు 27 వేలు యిచ్చారు.

65 గురు రైతులకు 2 వేల నుండి 3 వేల దాకా క్రాప్‌లోన్ క్రింద పెట్టుబడి పెట్టారు కేవలం సన్నకారు రైతులకు తాను పండించే పంటలను వ్యాపారస్తులకు అతి తక్కువ ధరకు అమ్ముకు యిచ్చే అప్పులు

శ్రీ వెంపటి రామకోటయ్య
గ్రామ సర్పంచ్

తీసుకొనివచ్చిన పంటనంతా షావుకార్ల పరం గాకుండా రైతు పండించిన పంటను తన కష్టమొచ్చినప్పుడు మార్కెట్టులో అమ్ముకొని లాభపడే అవకాశం చిక్కింది ఇలా గత సంవత్సరం తీసుకున్న క్రాప్‌లోన్ మొత్తాన్ని బ్యాంకుకు చెల్లించి తిరిగి యీ సంవత్సరం కూడా తీసుకున్నారు దానివల్ల సన్నకారు రైతులకు చాలా లాభం చేకూరింది.



జిల్లా కలెక్టర్ శ్రీ బెనర్జీ, ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ మురళీకృష్ణ ప్రభృతులకు స్వాగతం చెబుతున్న శ్రీ రామకోటయ్య

ఇవికాక గ్రామంలో తోటలను అభివృద్ధి పరచటానికై ఒక వేయి కొబ్బరి మొక్కలు 11 వందల టెంకాయ మొక్కలను రైతులకు సబ్‌సిడీ సప్లయి చేశారు. వీటికి కూడా బ్యాంకు వారు పెట్టుబడి పెట్టారు.

పాడి గేదెలు

గ్రామంలో పాలు అమ్ముకొని జీవించే బలహీన వర్గాల వారికి పాడి పరిశ్రమాభివృద్ధి క్రింద బ్యాంకు ఒక లక్ష 80 వేలు పెట్టుబడితో 110 గేదెలను ఖరీదుచేసి యిచ్చింది. ప్రతిరోజు ఇప్పటినుండి 30 నుంచి 90 లీటర్ల దాకా పాలను చిల్లింగు పాల కేంద్రంవారికి సప్లయిచేస్తూ దానిద్వారా వచ్చిన రాబడిని అప్పుక్రింద జమ చేస్తున్నారు. దీనివల్ల గ్రామంలో బలహీన వర్గాలకు చెందిన స్త్రీలకు అనేకమందికి ఉపాధి కలిగింది.

గ్రామంలో చెప్పులు కుట్టుకొని జీవిస్తున్న 12 మంది హరిజనులకు ఒక్కొక్కరికి 3 వందల చొప్పున 36 వందలు యిచ్చారు.

ప్రతిరోజు సైకిళ్ళపైన పెళ్ళి కూరగాయలు, ఇతర వ్యాపారాలు చేసుకునే యువకులకు 52 సైకిళ్ళు యిచ్చారు ఒక్కొక్క సైకిల్ ఖరీదు రు 450 చొప్పున ఖరీదు చేసుకొని దానిక్రింద బ్యాంకుకు చెల్లించే డబ్బు వాయిదాలపైన చెల్లిస్తున్నారు.

వీరితోపాటుగా గంపలతో కూరగాయలు అమ్ముకునే 60 మందికి తలా 3 వందల చొప్పున అప్పులిచ్చారు గ్రామంలో చిల్లర కిరాణ వ్యాపారం చేసుకొని జీవించే 11 మందికి వారి వ్యాపారాన్నిబట్టి 5 నుంచి 9 వందల దాకా రుణాలిచ్చారు.

గ్రామంలో వడ్రంగం వృత్తిపైన జీవించే ఇద్దరు వడ్రంగులకు ఒక్కొక్కరికి రెండువేల చొప్పున రుణాలిచ్చారు వీరితోపాటుగా షేరలాంపెట్టుకొని జీవించేందుకు ఒక నాయీ బ్రాహ్మణునికి 2 వేలు అప్పు యిచ్చారు.

అంగడి తండాలో రిక్షాలు తొక్కి జీవించే 18 మందికి రిక్షాలు కొనుక్కునేందుకు 22 వేలు పెట్టుబడి పెట్టారు.

అంతకు ముందు వారు కిరాయి రిక్షాలు తీసుకుని పొట్ట గడవక ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం వారు స్వంత రిక్షాలతో కిరాయిలు తోలుకొని వారు బ్రతుకుతూ బ్యాంకు అప్పులను చెల్లిస్తున్నారు.

దానితో పాటుగా గ్రామంలో వున్న వికాల సహకార పరపతి సంఘం శ్రీ వెంపటి పిచ్చయ్య అధ్యక్షులుగా వుండి పాలకవర్గం యావత్తు ఐక్యంగా వుంటూ గ్రామంలో వున్న రైతులకు వ్యవసాయానికి పెట్టుబడిగా అయిదు లక్షల రూపాయలదాకా అప్పు లివ్వడం వాటిని తిరిగి రైతుల ద్వారా చెల్లిస్తూ సొసైటీని మొదటినుంచి అభివృద్ధి చెందుతున్నది.

గ్రామంలో యిలాంటి సహకారం వుండటం వల్లనే ఒక్కరైతుకూడా యితర ప్రయివేటు పెట్టుబడిదారుల వద్దకుగాని, వడ్డీ వ్యాపారస్తుల కబంధ హస్తాలకు వెళ్ళే అవసరం లేకుండా పోయింది.

అధికారులబృందం సందర్శన

గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి కార్యకలాపాలను తెలుసుకునేందుకు జిల్లా కలెక్టర్ శ్రీ యస్. బెనర్జీ సన్నకారురైతుల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు ఆఫీసరు శ్రీ మురళీకృష్ణ, జిల్లా పరిషత్తు కార్యదర్శి శ్రీ సీతారాం సింగ్, సెంట్రల్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖమ్మం బ్రాంచిమేనేజరు శ్రీ జి. శ్రీనివాసరావు, తిర్మలాయపాలెం సమితి బి. డి. వో. శ్రీఅనంతరావుదేశపాండేతదితర ఉద్యోగుల బృందంయిటీవల ఈగ్రామాన్ని సందర్శించడానికి వచ్చినపుడు గ్రామ ప్రజలందరూ వారికి ఘనమైనస్వాగతంచెప్పారు ఈ సందర్భంగా జరిగిన సభలో గ్రామాభివృద్ధి కోసంపర్యాప్తమైనా చేపట్టవలసిన కార్యకలాపాల గూర్చిపంచాయతీ తరపున జిల్లా కలెక్టరుకు ఒక మెమోరాండం సమర్పించబడింది.

ఇదే సందర్భంలో జిల్లా కలెక్టర్ రైతులకు కొబ్బరి, అరటి మొక్కలను పంచారు.

గ్రామంలో జరిగిన అభివృద్ధిని గురించి కలెక్టర్ కొనియాడుతూ పంచాయతీ తరపున కోరిన కోర్కెలన్నిటిని సానుభూతితో పరిశీలిస్తానని హామీ యిచ్చారు.

వరంగల్ రోడ్డు నుంచి గ్రామం వరకు వున్న అప్రోచ్ రోడ్డును పక్కా మరమ్మతు చేయాలని ప్రస్తుతం గ్రామంలో 5వతరగతి వరకు వున్న పాఠశాలను 7వ తరగతి వరకు పెంచాలని, పాఠశాల వద్ద మంచినీటి బావిని త్రవ్వించాలని, ప్రస్తుతం చెరువుకు మరతూము పెట్టాలని, నాయుడుపేటలో నిర్మాణం ఆగిపోయిన పాఠశాల భవన నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు తగిన నిధులు కేటాయించాలని, ఇండ్లులేని లంబాడీ పేదలకు ఇండ్లస్థలాలు యిప్పించాలనే మొదలైన కోర్కెలను తెలియచేస్తూ కలెక్టర్‌కు అందించబడింది

పంచాయతీ ప్రాంతంలో వున్న శివారు గ్రామాలలోగాని, గ్రామంలోగాని ఇలాంటి అభివృద్ధి కార్యకలాపాలు సాధించడంలో పేద రైతులు, సామాన్య ప్రజల ఐక్యతగా వున్నందువలనే ఇలాంటికార్యకలాపాలు సాధ్యపడుతున్నవనేఅనుభవంలో రుజువైంది వారందరికి ధన్యవాదాలు సమర్పించ వలసివున్నది

దాంతోపాటుగా సన్నకారు రైతుల అభివృద్ధి ప్రాజెక్టు ఆఫీసరు వారి ఉద్యోగులు సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం బ్రాంచి మేనేజరు వారి బృందం, అభినందనీయులు. గ్రామాభివృద్ధిని గురించి శ్రద్ధగా తెలుసుకొని సహకరిస్తానని వాగ్దానంచేసిన జిల్లాకలెక్టర్ శ్రీ యస్ బెనర్జీ తన వాగ్దానాలు నెరవేర్చుతారని ఆశిస్తున్నాను.

విశాలాంధ్ర విజ్ఞాన సమితి తరఫున ప్రింటరు అండ్ పబ్లిషరు : టి. వెంకటేశ్వరరావు. ఎడిటరు : సి. రాఘవాచారి. ముద్రణ : విశాలాంధ్ర ప్రెస్, విజయవాడ- 520004. R. No. 3118/57.